28
జనవరి 72

కథల సంచిక

The tyrant dies and his rule is over;
The martyr dies and his rule begins.

— Soren Kierkegaard.

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

ఒక రూపాయి

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

28

జనవరి 1972

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

ఒక రూపాయి

ప్రతులకు, వివరాలకు
సంపాదకుడు
సృజన,
హనుమకొండ,
వరంగల్-1. (ఆం.ప్ర.)

సంవత్సర చందా: పదిరూపాయలు
అర్థసంవత్సర చందా: ఆరురూపాయలు
విడిప్రతి: ఒకరూపాయి

సృజన

అభ్యుదయ సాహిత్య వేదిక

72 జనవరి   మాసపత్రిక   28

స్వేచ్ఛ

ప్రభుత్వం ఆంతరంగిక భద్రతాచట్టంకింద ఇద్దరు తెలుగు పత్రికా సంపాదకులను అరెస్టుచేసింది. ప్రభంజనం సంపాదకుడు, విప్లవరచయితల సంఘం కార్యవర్గసభ్యుడు డాక్టర్ ఎం.వి. రమణారెడ్డి అరెస్టువార్త (పోలీసులు యిచ్చివుంటారు కనుక) పత్రికల్లో రానయినా వచ్చిందికాని, 'విద్యుల్లత' సాహిత్య మాసపత్రిక సంపాదకుడు ఉమ్మెంతల వెంకటరెడ్డి అరెస్టయినవార్త అయినా రాలేదు.

ఈ పైనంచూస్తే పౌరసత్వాలపట్ల, పౌరసత్వాలపట్ల వ్యగ్రత చూపుతున్న పత్రికలు, రచయితలు, మేధావులపట్ల యీప్రభుత్వానికెంత'ఆదరణ' వున్నదో స్పష్టమవుతుంది.

నల్లబజారు వర్తకులమీదనో, అధికలాభాలు గుంజేవాళ్ళమీదనో, గోదాముల్లో ధాన్యాలు నిలవపోసినవాళ్ళమీదనో, కక్షలు, ఉద్రేకాలు, వదంతులు వ్యాపింపచేసి ప్రజాజీవితాన్ని సంక్షుభితంచేసేవాళ్ళమీదనో ఉపయోగించవలసిన యీ ఆంతరంగిక భద్రతాచట్టాన్ని విప్లవ పత్రికలమీద, రచయితల మీద తనకున్న కసిని, అక్కసును తీర్చుకోడానికి మళ్ళీ ఒకసారి ఉపయోగించింది పోలీసుశాఖ.

బంగ్లాదేశ్‌లో మేధావులపట్ల, ప్రజలపట్ల మిలిట్రీనియంతృత్వం చేసిన ఘోరమైన అత్యాచారాలను ఖండించిన చేతులతోనే యీదేశంలో భావప్రకటనా స్వేచ్ఛను తుడిచిపెట్టే స్థితికి యీ ప్రభుత్వం దిగజారదని ఆశిస్తున్నాం.

—సంపాదకుడు

పేబ్లోనేరూడాకు నోబెల్ బహుమతి

కె. వి. రమణారెడ్డి

లెనిన్ శాంతిబహుమతిని అందుకొన్న చేతులతోనే పేబ్లోనేరూడా నోబెల్‌సాహిత్య బహుమతిని అందుకోబోతున్నాడు. కమ్యూనిస్ట్ కాని సార్త్ (Sartre) కూడా తోసివేసిన బహుమతిని తాను తీసుకొంటున్నాడు. పాస్టర్నాక్‌ను బలవంతపెట్టిన సోవియట్ ప్రభుత్వం ఫెడియేవ్‌ను స్టాక్‌హోమ్ నగరానికి సాగనంపి బహుమతి స్వీకరింపజేసింది. డైనమైట్ డిస్కవర్ ద్వారా వచ్చే లాభాలలో ఒక నలభైలక్షల అమెరికన్ డాలర్లకిమ్మత్తు గల మొత్తం సాహిత్యానికి దక్కుతూంది. 'దక్కిందే బొక్కుడు!'

ఈ బహుమతి మూలంగా క్రితంలోలేని గుర్తింపు ఇప్పుడు కొత్తగా నేరుడాకు కలగబోతూందా అంటే అనుమానమే. నోబెల్ బహుమతి ఒక్కటే శంకులో పోసిన తీర్థం అయేట్లయితే, అది వేరేమాట.

1935 తర్వాత కమ్యూనిస్టుగా మారిన నేరుడాను ఇటీవలికాలంలో పెట్టుబడిదారి దేశాల విద్యాపీఠాలుకూడా 'గుర్తించాయి'. హార్వర్డ్ విశ్వవిద్యాలయ గౌరవసభ్యుడయాడు. అక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ గౌరవ 'డాక్టరేట్' పట్టా పుచ్చుకొన్నాడు.

అయితే 1955 కి పదేళ్ళ పూర్వం నుంచీ విశ్వవిఖ్యాతుడయ్యాడు. ఫెడరికో గార్సియా లోర్కా అంతటి కవిచేత 'మహాకవి' అని పొగడ్త సంపాదించుకొన్నాడు. అరగాఁ, ఎహ్రెన్‌బర్గ్ వంటి మేటి రచయితలు తన కావ్యాలను కళ్ళకద్దుకొన్నారు. దేశాంతరాల్లోని పాఠకులమాట మరి చెప్పడమెందుకు? ప్రపంచంలోని అభ్యుదయ కవుల్లో ఈ చిలీదేశపు కవి అగ్రస్థానాన నిలువగలిగాడు.

లేటిన్ అమెరికన్ దేశాలప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేకతకు నేరుడా సాహిత్య ప్రతిబింబమయ్యాడు. అలాగే అక్కడి సైనికనియంతల ఫేసిస్ట్ రాజ్యాలకు వ్యతిరేకంగా సోషలిజానికి అనుకూలంగా జరుగుతూ వచ్చిన మహోద్యమాలకు తాను అక్షరలోక ప్రతినిధి కాగలిగాడు. అయినా, ఇప్పుడు క్యూబాలోని మేధావులకంటె వెనకబడిపోయాడు. మహావిప్లవోద్యమాలకు పురిటిళ్లలో ఒకటైన లేటిన్ అమెరికాలోని సజీవ సోషలిస్టు ఉద్యమాలకు దూరమయ్యాడు. తాను ప్రారంభకాలంలో రచించిన భావ గీతాలవంకకే ఇప్పుడు వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు. అరవైఏడేళ్ళ ప్రాయంలో ఉన్న (1904 లో పుట్టాడు.) ఈ భారీవిగ్రహం, బట్టతలకింద నున్నగా కోలగా వ్యాపించిన ఈముఖం, వృద్ధాప్యాన్ని అక్షరాలా రెండవ బాల్యంగా మార్చుకొంటున్న

దన్నమాట. పేసిఫిక్ మహాసముద్ర దృశ్యానికి చేరువగా చిలీదేశపు పడమటిభాగంలో ఒక చిన్నపల్లె ఇప్పుడు, విశ్వజీవి అనిపించుకొన్న నేరూడా నివాసం.

తనపోరాట సంప్రదాయాలను తానే విస్మరించినట్టా? కవిగా, రాజకీయోపజీవిగా నేరూడా జీవితం ఒకనాటి కథకాదు. కల్పనాకథకు ఎంతపట్టు ఉంటుందో, అతని జీవిత కథకూ అంత ఉంటుందంటే ఆశ్చర్యంలేదు. అయితే ఇది ఒకానొక స్థాయికివచ్చిచేరు కొన్నాక, మరి కొత్తమార్పులను స్వీకరించలేదు. అపూర్వమనదగిన సాహసాలకు పూనుకోలేదు. దాని ఎదుగుదల అంతటితో సరి. అయితే ఆమాత్రపు ఎదుగుదలైనా సాధారణ కవులకు సాధ్యమయ్యేదికాదు.

ఇప్పుడు నేరుడా జీవితఘట్టాలను ఒకొక్కటిగా స్మరిద్దాం.

యూనివర్సిటీ చదువు కొనముట్టగానే, చిలీదేశపు వాణిజ్య దౌత్యోద్యోగిగా (కాన్సల్) అనేక దక్షిణ అమెరికా, ఆసియా, యూరప్‌ఖండాల దేశాలలో ఉండి పోయాడు. అంతక్రితమే ప్రకటించిన తొలికావ్య సంకలనం Twenty Poems of Love And One Song of Despair స్పెనిష్‌భాషా కవిత్వంలో, ముఖ్యంగా దక్షిణ అమెరికాలో, 'నవ్యత'కు శ్రీకారంచుట్టిన రూబెన్ దారియోమార్గాన్ని అనుసరించింది. ఆత్మాశ్రయ పద్ధతిలో గీతికావ్యరచన జరిగింది. ప్రకృతితో తాదాత్మ్యం. స్వీయాను భూతుల ప్రాముఖ్యం, దీనిమొక్కట్లు. అంతవరకూ నఫ్తలీరికార్డో రెయిస్‌గానే పది మందికీ తెలిసిన ఈవ్యక్తి అప్పటినుంచీ (1924) పేబ్లోనెరూడా అనే మారుపేరుతో కవిగా లోకానికి పరిచయమయ్యాడు.

రెండవ ఘట్టం స్పెయిన్‌దేశంలో ప్రారంభమైంది. దౌత్యోద్యోగిగానే ఉంటూ లోర్కావంటి కవుల సాహచర్యంతోటి బాద్‌లేర్, రేంబోవంటి ఫ్రెంచి సింబాలిస్టు కవుల అధ్యయనంద్వారా సర్రియలిస్టు ధోరణికి లోబడి Residence on Earth రచించాడు ఎంత అందంగా రాయగలిగినా, భావప్రతిమల (ఇమేజెస్) దురవగాహత్వం వల్లి ఈ సంకలనం భంగపడక తప్పలేదు. అయితే, తనపాలిటివరంలా, స్పెయిన్ పాలిటి శాపంలా, స్పెనిష్ అంతర్యుద్ధం మొదలైంది– రిపబ్లికన్లకూ ఫేసిస్టులకూమధ్య దేశదేశాల కవులూ మేధావులూ స్పెయిన్‌కువచ్చి అంతర్జాతీయ దళాలలోచేరి పోరాడుతూ ప్రాణదానంచేసే కాలంలో, నేరుడా కవిత్వం ఈ సంఘర్షణను ప్రతిబింబించకతప్పలేదు. Spain In My Heart అనే సంకలనంలో కనిపించేది పికాసో 'గుయెర్నికా' చిత్రం లోని బీభత్సమే. ఈదశలోనే నేరుడా కమ్యూనిస్టుగా మారాడు. వ్యక్తిగానూ కవిగానూ నిబద్ధత (కమిట్‌మెంట్) మొదలైంది. భావాల గజిబిజివదలిపోయింది. ప్రయోజన పరమైనదృష్టి అలవడింది. సంఘటనల ఒడ్డున కూర్చోక వాటిలోనేదూరి లోకాన్ని

మార్చే మహాప్రయత్నంలో తానూ మారక తప్పలేదు. గీతికావ్య పరిభావం నుంచి బయటపడి సాంప్రదాయిక ఛ్ఛందస్సులను సడలించిన, సరళ రచనాపద్ధతిని చేబట్టవలసి వచ్చింది.

ఇక్కడే నేరుడాను ఒకవైపునుంచి వాల్ట్ విట్మన్, మరోవైపునుంచి మయాకోవస్కీ తమ ప్రభావాలతో లోబరచుకొన్నారు. విట్మన్ సంభావించిన మానవసౌభాత్రం ముఖ్యంగా మనస్సంబంధి. భావపరిధిని దాటిరాని ఈశరీరికకు నేరూడా రక్తమాంసాలు సమకూర్చిపెట్టి ఆచరణీయం చేశాడు. మయాకోవస్కీనుంచి క్రియాపాటవాన్ని గ్రహించాడు. కవిత్వానికీ జీవితానికీ, మాటకూ చేష్టకూ, మధ్యగల అఖాతాన్ని పూడ్చడం నేరుడాకు ఇందువల్లనే సాధ్యమైంది. లోర్కానుంచి సక్రియలిప్తు భావచిత్రాలను నిర్మించేశక్తిని తానూ అలవరచుకొన్న నేరూడా, స్వదేశీయుడైన జీసస్ బ్రిటోవద్దనుంచి సరళగంభీరమైన ప్రజాకవిత్వ పద్ధతిని సంపాదించుకొన్నాడు. విట్మన్‌కు ప్రత్యేకమైన దగ్గ జాబితా కవిత్వం, లోర్కాకు విలక్షణమైనదగ్గ గీతికవిత్వం, మాయాకోవస్కీ సమ్మెటపోట్లవంటి మాటల కూర్పు— ఇవన్నీ నేరూడాలో సంగమించాయి. విట్మనుకు గల వివరణశక్తి, మయాకోవస్కీ ఖండనశక్తి, లోర్కా అభ్యర్థనశక్తి— ఇవి జీసస్ బ్రిటో దేశికవిత్వ ధోరణులతో కలిసినప్పుడు, నేరూడా కవిత్వానికి వచనరూపం చేకూరినట్టే. అతని వచనంకూడా కవిత్వానికి సమీపంగా ఉంటుంది. వచనంలోని వెసులుబాటూ నిడివీ, పద్యంలోని ఆలంకారిక సామగ్రి, పాటలోని హృదయానుభూతీ కలిసి ఈ మూడూకాని ఒకకొత్తపదార్థం తయారౌతుంది. అదే నేరూడా కవిత్వం.

స్పెయిన్ అంతర్యుద్ధం తాలూకు అనుభవాలూ అనుభూతులూ నేరుడాకు కవిగా పౌరుడుగా మార్గాంతరం చూపెట్టాయి. చిలీకి తిరిగివచ్చాక రాజకీయాలలో ప్రవేశించి కమ్యూనిస్టుగా సెనెట్‌కు ఎన్నికయ్యాడు. కమ్యూనిస్టుల మద్దతుతో అధికారానికి వచ్చి వెంటనే ఉత్తర అమెరికా చూరుబట్టుకొని వేళ్లాడుతూ శ్రామికోద్యమాన్ని అణచివెయ్య సాగిన చిలీ అధ్యక్షుడు విదేలాను నేరుగా సెనెట్‌లో ఎదుర్కొని, అతడు తనమీద మోపిన రాజ్యాంగ విద్రోహనేరాన్ని తిప్పి అతనిమీద కొట్టాడు. ఆ తర్వాత రహస్య జీవితం గడపవలసి వచ్చింది. అయితే ఈ స్పెయిన్‌నుంచి తిరిగివచ్చిన తర్వాత, రాజకీయాలలోకి చొరబారకముందు— ఈ మధ్యకాలంలో మెక్సికోదేశానికి చిలీ రాయబారిగా ఉండినప్పుడు నేరూడా రాసిన గేయాలకు స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం వస్తువైంది. ఆ గేయాలు వాల్‌పోస్టర్లరూపంలో మెక్సికోనగర కుడ్యాలమీదికి ఎక్కాయి. అలాగే చిలీకి తిరిగివచ్చాక రచించిన రాజకీయగేయాలు కరపత్రాల రూపంలో పల్లెల్లోకి వెళ్ళిపోయాయి. ఒక గేయం రహస్యంగా రెండువేల కాపీలు చెల్లిందట. మరోపాటను విద్యార్థులు దేశాధ్యక్షుడైన విదేలాకే బహూకరించి భయపెట్టారు.

నేరూడా వట్టి కవేకాదు, వట్టి రాజకీయవాదేకాదు. తన గీతాలద్వారా కవిత్వానికి ఒకబాట చూపించినట్లే, తన రాజకీయాలద్వారా ప్రజలకు ఒకబాట చూపించాడు. కవిత్వానికీ రాజకీయానికీ నాయకులు సామాన్యప్రజలే. వాళ్ళైనా ఒకదేశానికి చెందిన వాళ్ళేకాదు. నానాదేశీయులు, అందరూ కష్టజీవులు. జాతి, మత, వర్ణభేదాలున్నా వాటి అట్టడుగున ఉండే సర్వసామాన్యమైన మానవత్వం వాళ్ళహృదయాలనూ హస్తాలనూ కలుపుతున్నది. వాళ్లందరి చూపు, బాధలనుంచి ఒడ్డునవేసి సంతృప్తినీ సంతోషాన్నీ చేకూర్చి జీవశాంతికి పాదులుకట్టే, సామ్యవాదం వైపే. ఇలా సాగిన నేరూడా భావనకు క్రియాచణమైన మానవీయత, సార్థకమైన విశ్వజనీనత ప్రాతిపదికలయ్యాయి. Canto Generale అనే అతని విశ్వగీతికకు జీవధాతువు ఇదే. విట్మన్ భావంలా ఇది నిరూపం కాదు. దేశకాలాలకు అతీతం కాదు కనిపించేదాన్ని గురించే రాస్తానని శపథం చేసిన నేరూడా కల్పనను పూర్తిగా తృణీకరించలేదు. అయితే అది అభూతకల్పన కాదు.

"ఇక్కడ మన అమెరికాలో మనం ఒక ప్రపంచాన్ని నిర్మించవలసి ఉంది. తెలియని దీవిగడమీద నౌక భగ్నంకాగా తలా ఒకదారి అయిపోయిన నిస్సహాయులం కాము మనం. హేతువాదబద్ధమైన సాంఘిక వ్యవస్థకోసం పోట్లాడేవాళ్ళం. అజేయమైన నవమానవధర్మానికి పరిచారకులం. కాబట్టి మన కళాసృష్టిదానీ పోరాటంగానీ ఒంటరిగాని వెర్రిచేష్టలెంతమాత్రం కావు. అలా కాకపోగా, అవి నిర్మాణాత్మకమైన మహాశక్తికి అవయవాలౌతున్నాయి".

వ్యక్తిగా, కవిగా, తన భవిష్యత్తును శ్రామికోద్యమ భవిష్యత్తుతోటి అనుసంధానించాడు నేరూడా. బాధలు, బహిష్కారాలు, శిక్షలు, ఇవేవీ ప్రజాకళాకారులను కుంగదీయలేవని తన జీవితం ద్వారా నిరూపించాడు. సాయుధుడైన కవిగా పేరుతెచ్చుకొన్నాడు. లేటిన్ అమెరికా స్థానం పీడితలోక యుద్ధరంగంలోనే అని గుర్తించాడు.

"అనేకులైన ప్రజలకు మీ పాటలే పతాకలుగా నిలిచి ఆకర్షించి దారిచూపాలని మీరు ఆశిస్తున్నారా అని నన్ను అడుగుతూ ఉంటారు. పాటలలో పోరాటాలతో మనం సాధించబోతున్న శాంతికి దారిచూపుతూ ప్రజా హృదయాల్లో నాకవిత్వం ప్రజ్వలిస్తున్నమాట నిజమే అయితే, నా సంతోషానికి మేరలేదు".

లెనిన్ శాంతి బహుమానం సాధించిన నేరూడా గేయం Let the Rail-splitter Awake అమెరికా సంయుక్త రాష్ట్రాలపట్ల అతని వైఖరిని తెలుపుతుంది— వ్యంగ్యంగా కాదు, వాచ్యంగానే. ఈ Rail-splitter మరెవరోకాదు. అబ్రహాం లింకనే. అతనెత్తిదించిన గొడ్డలి కలపమొద్దులనుంచి మాత్రమే పేళ్లకొట్టలేదు. సాంఘిక దురన్యాయం, వర్ణద్వేషం, రక్తదాహం, ధనమదం— వీటి నడుముల మీదకూడా పడిందని, లేదా, పడి ఉంటే బాగుండేదని నేరూడా భావించాడు.

"నేను కవిమాత్రుణ్ణి తప్ప అంతకు అధికమేమీ కాదు. మిమ్మల్నందరినీ ప్రేమిస్తాను. నేను ప్రేమించే ఈ ప్రపంచం అంతటా సంచరిస్తాను.

"దేన్నీ పరిష్కరిద్దామని రాలేదు నేను. పాట పాడుదామనీ, నాతో మీరు గొంతుకలిపి పాడుతారనీ మాత్రమే ముందుకు వచ్చాను".

ఆ నేరూడా ఈ నేరుడా ఒక్కరేనా అన్నంత సందేహాశ్చర్యాలు కలిగేవిధంగా మళ్ళీ ఇప్పుడు తన అరవయ్యేదోయేట నూనూగు మీసాల నూత్నయౌవన దశను నెమరువేస్తున్నట్టుగా, గీతికావ్యరచన చేస్తున్నాడు. అపారమైన తన జీవితానుభవం ఒకప్పుడు గాఢమైన విషాదాన్ని అతని రచనలమీద కుమ్మరించింది. ఎండబారిన ఈ ముదివయస్సులో మాత్రం, లలితమైన హాస్యరేఖ నేరూడా తాజా కవిత్వం నుంచి తొంగిచూస్తున్నదట.

నోబెల్ బహుమతి నేరూడా కవిత్వానికిగానీ, జీవితానికిగానీ కలికితురాయికాదు, జరీకుళ్లాయీకాదు. మధ్యాహ్న శిఖరంనుంచి పడమటివైపుకు వాలిపోవడం ఆ రెండింటి లోనూ ఎన్నడనగానో మొదలైంది. తాను జీవితంతోటీ జీవితం తనతోటీ రాజీపడడం ప్రారంభమై చాలాకాలమైంది. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం రెండుగా చీలిన నేడు నేరూడా సోవియట్‌పక్షాన ఉండడమే అతనిభావాలకు చేకూరిన జడత్వానికి నిదర్శనం అనుకోవచ్చు. క్యూబన్ మేధావుల్లాగానైనా తన స్వతంత్రి, స్వచ్ఛంద వ్యక్తిత్వాన్ని నిలుపుకోగలుగుతున్నాడో లేదో తెలియదు.

ఏమైనాగాని, నేరూడా కవిత్వం, నాటికీ నేటికీ మాత్రిమేగాక, ముందొకనాటి కైనా పోరాటాలలో పడుతూ లేస్తూ ముందుకీ సిదికిపోయే శోషలిస్టు ప్రజాశక్తులకు ఆత్మవిశ్వాసాన్ని అందించగలదు.

"కూలి పడిపోయిన సోదరులారా: అశేషమానవుల అమూల్యాశయం విజయసంరంభంగా ప్రజ్వలించినప్పుడు, ప్రస్ఫుటించినప్పుడు, ఇప్పటి ఘోరనీరవం నుంచి మీ కంఠస్వరాలు స్వేచ్ఛను నినదించి అనంత జీవసాగర తరంగాలౌతాయి ?"

పేబ్లో నేరూడా నిజంగానే మహాకవి. ఆ అంశమాత్రిమే అతనికి ఇంకా మిగిలి ఉంది.

కవిత:

దేశపతాక

పేబ్లో నేరూడా

వాళ్లు కూలిపడిన యీచోట, విలపిద్దామనిగాక,
యింకా జీవించివున్న మిమ్మల్ని పలకరించిపోదామని వచ్చాను;
ఈ మాటల్ని మీకేగాక నాకుగూడా ఉద్దేశించాను.

నిరుడు ఈవేళకు చనిపోయినవాళ్లు గుర్తున్నారా మీకు?
మిమ్మల్ని పోలినవాళ్లు, మీపేర్లలాంటివే ఉండినవాళ్ళు, హత్య అయినవాళ్ళు,
బెస్తలు కంసాలిబత్తులు, మీవృత్తుల్లాంటివే సాగించినవాళ్లు,
చిలీకి అస్థిప్రాయుల్లాంటి బిడ్డలు,
గాలికసుర్ల గాటమైనదెబ్బలు ముద్రించుకొని పంపాలవలె బక్కజిక్క
బాధ చేవ్రాళ్లు ధరించిన ముఖాలుగలవాళ్ళు,
అవును, వాళ్లు మీకు గుర్తుంటారు.

మన పితృభూమిలోని దుర్గాలవెలపానా,
మసకలేని గాజులా తళతళలాడే మంచు అంచుల,
పచ్చ—కొమ్మ నదీతీరపు యిరుకుసందుల, నత్రిజనికింద,
విచ్చుకొనే విత్తనంగుల్లకింద నిక్షేపించబడి,
చిట్టచివరకు దట్టంగా ద్రవించిన సోదర రుధిర బిందువులు చూశాను;
మండింది నిప్పులా ప్రతిబొట్టూ.

గట్టిమట్టి నుంచి శక్తినిచ్చే ధూళిని తవ్వే అజ్ఞాతవీరులతో,
నత్రిశయ్యల్లో, సమ్మె సాగుతూండిన దినాలలో,
ఒకమారు కాలం గడపడం నాకు గుర్తువస్తూంది.
భూమికి సంబంధించిన నేస్తుల హస్తాల
గాఢస్పర్శ మళ్ళీనేనిప్పు డనుభవిస్తున్నాను.

"హంబర్స్టన్‌లో, రికావెంతూరాలో, పలామోలో, పియోజెల్లీలో,
పాన్దాజుకార్‌లో, మేమెలాబతుకు యీడుస్తున్నామో, అన్నా, చూడు!" అన్నారు.
తమని పోషించే దుంపలూ వేళ్ళూ రుచిచూడమన్నారు.

ఉడుకు, మురికి, నల్లులు, అంతులేని ఒంటరి బతుకులు వాళ్ళవి.
పలుగుకొయ్య— పిడులమీద వాళ్ళచేతివేళ్ళు అచ్చుపడ్డాయి.
చెమటలు కక్కుతూ తవ్వకం పనిచేసేవాళ్ళను చూశాను.
పిరమిడ్‌లాంటి కట్టడం కిందిభాగం నుంచి నరకం
కడుపే విచ్చుకొందా, విహ్వలించిందా— కాదు—
ఒక గొంతుక, తీవ్రమైన ఒకగొంతుక వినిపించింది.
ముఖానికి బదులు నెత్తుటిలో చెమటలో మురికితో
"ఎక్కడికెళ్లినా మరకలుపడిన తొడుగుగల ఆకృతి. పేరులేని ఆజీవి అరిచింది ఇలా:
ఈ విషయం చాటు। అట్టడుగున మిడికేజనం అనుభవిస్తూన్న వ్యథ,
నరకం సందిట్లో గిలగిలలాడే నీతమ్ముడి గోడు, వెల్లడిచెయ్।"

2

ప్రజలారా, పనితో గూనుపడిపోయిన
పంపాపనివాళ్ళకు చేయూతనిస్తామని మీరిక్కడ శపథం తీశారు.
ఆబాలగోపాలంగా సమస్త పంపాకార్మిక జనాన్ని నిరుడు ఇక్కడికి పిలిపించారు మీరు.
ఇక్కడే, దేశపు నడిబొడ్డులోనే, భవంతిముందే, నట్టనడిదారిలోనే,
మీనెత్తురు కాలవలైంది. లోకమంతా చూచునుగానని.
కడిగితేపోని మీ ఎర్రమరకలు నిలిచిపోయా యిక్కడ—
చుక్కల్లా, ప్రతిష్ఠజేసినట్లు, శాంతిపొందక.
పంపాలవైపుగా చిలీ దేశీయుల చేతులు అలల్లా ఎగిసెగిసిపడుతూన్న వేళ.
ప్రజలారా, మీ గుండెలు దూసుకొచ్చే ఐక్యతనుచ్చరించే నాదాలు నినదిస్తూన్న వేళ,
మీ జాగలోనే మీరు నడుస్తూండగా,
అశ్రువులు ఆశలు ఆక్రోశాలు ఆవేదనలు నిండిన పాటలు పాడుతూండగా,
మీ చేతిని మీరక్తంతోనే తడిపినాడు ఆ కసాయివాడు.

ఇలా తయారుచేశాం దేశపతాకను:
విలాపవస్త్రాల చిరుగులతోటి తయారుచేశారు ప్రజలు తమ ధ్వజాన్ని.
మెరిసే నేస్తపు రంగునూలుతోటి అంచులుకుట్టారు.
చొక్కాల నుంచి, లేదా గగనం తానునుంచే కావచ్చు,
స్వదేశ పతాకాన్ని ధరించేందుకోసమని కావలసిన నీలిమని కత్తిరించుకొన్నారు.
ఆతుర హస్తాలతో మణిలా దాన్ని అక్కడ గుచ్చారు.
బొట్టుకిబొట్టు జతపడేకొద్దికీ అరుణించిందది అగ్గిలా.

గుండ్లువింపిన తుపాకులనూ కిరాతకవధకు ఆజ్ఞలనూ ధరించి
ఇక్కడికి దూకివడినవాళ్ళు చూసింది పాడుకొంటూ వుండిన గుంపుని మాత్రమేగాని
మిత్రధర్మంతో మనస్సులు అతుక్కొన్న మహాప్రజగా మార్చివేశారు.

పతాకను పట్టుతప్పనీయకుండానే పడిపోయింది ఒకపసి, వల్చటిపిల్ల.
డొక్కలోదూరిన గాయంగుండా ప్రాణాన్ని దగ్గివేశాడు గిరగిరలాడుతూ ఒక పడుచువాడు
బాధాతరంగం క్రమక్రమంగా ఎగిసికరిచే క్రోధంగా ఘనీభవించింది.
అటుమీద నెత్తుట్లో జండాలను హత్తి
హంతకుల పశుముఖాల ముందు విదిలించి వదిలించారు.

శాస్తి. శాస్తిని కోరుతున్నాను,
ఆ చనిపోయిన వాళ్ళపేరిట ప్రతిక్రియ జరపమంటున్నాను.

పితృభూమిని పుత్ర రక్తహ్రదం చేసినవాళ్ళకు శిక్ష, శిక్షపడాలంటున్నాను.
ఈ హత్యకు అనుజ్ఞనిచ్చిన ఆ శస్త్రపాత్రవుడికి శిక్ష, శిక్షపడాలంటున్నాను.
పీనుగుల గుట్టమీదుగా గద్దెనెక్కిన విశ్వాసఘాతుకుడికి శిక్ష, శిక్షపడాలంటున్నాను.
శత్రువులతో కరస్పర్శచేసి ఈ కఠోరసత్యాన్ని విస్మరించే వాణ్ణిగాను.
రక్తదూషితమైన పాపిష్ఠివాడి చేతులసలే ముట్టుకోను,

నేనడిగేది హంతకులకు శిక్ష। ఇక్కడే, ఇప్పుడే, రక్తం మరిగే యిక్కడే,
యిప్పుడే, శిక్షించాలి, శిక్షించాలి వాళ్ళని.

సోదరులారా, సాగిపోతుంది పోరాటం మనది. ఇంతటితో ఆగిపోదు.
కార్ఖానా, నత్రిఖని, పంపా, పొలం. పచ్చటి ఎర్రటిరాగిని ఎగుమతిచేసే స్థలం,
చీకటిని చించే బొగ్గుమంటలు అగ్గలించే గుహ-
వీటన్నిటా రణరేఖలు గీయబడుతాయి.

మీ మరణానికి సాక్షులు ఈ ధ్వజాలు,
అంతులేని వసంతకాలపు ముమ్మరమైన ఆకు గుబుర్లలా
మాగుండెల్లో రెపరెపలాడేంతదాకా, రెట్టింపు అవుతూంటాయి.
ఈ జాగాలో వెయ్యేళ్ళపర్యంతం మెదిలేకాళ్ల తొక్కుళ్ల
రాళ్ళనుంచి మీ రక్తచిహ్నాలను తుడిచివెయ్యలేవు.
ఈ ప్రశాంతిపిదాటే లక్షోపలక్షల కంఠాలఘోషకూడా
మీమరణాన్ని స్మరించే ఘంటారావంలో మాటుమణిగి పోతుంది.
ఈగోడల్ని వాన నాన్చి కూల్చివేసినప్పటికీ
త్యాగధనులైన మీపేర్ల వెలుగుని ఆర్పలేదు.

శతాధికమైన క్రూరనిరంకుశ నిశీథాల మృత్యుహస్త శైతల్యం,
అశేష మానవాళితోబాటు మీరు సాగించగోరిన కఠినపోరాటం నుంచి
అంతిమ మహాదినాన గెలిచే సజీవవినాదాగ్నిని తాకిగూడా గెలవలేదు.

కూలిపడ్డ సోదరులారా,
అసంఖ్యాకమానవుల అమూల్యాశయం విజయ వినోద సంరంభంగా పరిణమించినప్పుడు
వర్తమాన నిశ్శబ్దంనుంచి మీ కంఠాలు
స్వేచ్ఛనువినదించి అనంత జీవసాగర తరంగాలౌతాయి.

అనుసరణ: కె. వి. రమణారెడ్డి

వివరణ :— వామపక్షాల తోడ్పాటుతో చిలీ దేశాధ్యక్షుడైన గోన్జలజ్ విదేలా త్వరలో కార్మిక సంస్థలమీద దాడిచేసి నియంతృత్వాన్ని స్థాపించిన 1947–48 కాలంలో రాసిన వచనగేయం.

మీరూ కంటారు, మేమూ కంటాము మానవజీవితాన్ని గురించిన మధురమైన కలల్ని. కాని మీకా కల నిజంకాకున్నా, ఏకొందరికో ఆకల ఫలించే అవకాశం వుండి అందరికీ ఆ అవకాశాలులేకున్నా, ఫరవాలేదనుకుని, ఆ కలల్నే నెమరేసుకుంటూ సుషుప్తావస్థలో, ఆత్మవంచనను చేసుకుంటున్నామనే యింగితంలేకుండా పగటికలల్లో గడిపేస్తారు. కాని మాకు మానవజీవితంపై ఎంత నమ్మకమంటే, సమగ్రమైన అవగాహన గల, స్వయం నిర్ణయశక్తిగల- సర్వోత్కృష్టమైన, జీవితాన్ని భావితరాలకు సమకూర్చడానికి, తృణప్రాయంగా అర్పించబడ్డందుకే మా జీవితాలు ధన్యమైనవీ ఉన్నతమైనవీ కాగలవని మేం భావిస్తాం.

—విజయ్

విప్లవ రచయితలు-కథ

మరువాడ రాజేశ్వరరావు

సమాజంలో మార్పులతో పాటు సాహిత్యంలో కూడా మార్పులు రావాలని, సహజంగా వస్తాయనీ, అందరూ సూత్రప్రాయంగానేనా అంగీకరించే విషయం. సాహిత్యంలో మార్పు అంటే, వివిధ సాహిత్య స్వరూపాల్లోనూ, ప్రకటించే భావాల్లోను, భావాలు ప్రకటించే విధానంలోను, వస్తువులోను మార్పు. 'కథ'లో ఈ మార్పులెలా వచ్చేయో, ఇప్పుడేస్థితిలో ఉందో పరిశీలిద్దాం.

ఇంతో అంతో మంచి సాహిత్యం చదివిన వాళ్ళంతా ఈనాటి కథాసాహిత్యం బాగులేదనే అంటున్నారు. కథల 'సంఖ్య' ఎంత పెరిగిందో, 'స్థాయి' అంతగానూ తగ్గిపోయిందంటున్నారు. కొంచెం ఆలోచిస్తే కారణం తెలుస్తుంది— ఏనాటి సాహిత్యం ఆ సమాజాన్నే ప్రతిబింబిస్తుంది. చరిత్రే అందుకు నిదర్శనం.

ఇంగ్లీషువాళ్ల రాకతో, ఆర్థిక రాజకీయరంగాల్లో పెద్దమార్పు వచ్చింది. ఇతర దేశాల సంస్కృతీ, నాగరికతలు మనవాళ్లచేత ఆలోచింపజేసేయి సామాజిక విలువల్లో మార్పులకోసం, సామాజిక దురన్యాయాల నెదిరించేందుకు— సంఘ సంస్కరణోద్యమాలు ప్రారంభమయేయి. కందుకూరి, గురజాడ, చిలకమర్తి, పానుగంటి మొదలైన వారి సాహిత్యం ఈపరిస్థితులని, భావాలని ప్రతిబింబిస్తుంది.

సంస్కరణోద్యమం కొన్నాళ్ళకి విఫలమైపోయింది. సంస్కర్తల కున్నంత చిత్తశుద్ధి ఆర్థిక రాజకీయవ్యవస్థని పాలిస్తున్నవాళ్లకి లేదు. సంస్కరణ వ్యాపారసాధనంగా మారింది. కపటం; మోసం— సామాజిక విలువల ముసుగులు కప్పుకుని రెండు చేతులా డబ్బు, అధికారం సంపాయిస్తున్నాయి. స్వార్థాన్నే నైతికవిలువగా చిత్రించేరు. ఈసామాజిక పరిస్థితుల్లోని తిరోగమనవాదం, పలాయనవాదం, నిరాశావాదం సాహిత్యరంగంలోకూడా ప్రవేశించేయి. గడిచిపోయిన సమాజ 'వైభవాన్ని' విశ్వాసాలని సమర్థిస్తూ కొందరు రాస్తే యీ సమాజాన్ని కోపగించుకునీ, అసహ్యించుకునీ, దాన్ని సంస్కరించలేనందుకు చీదరించుకునీ,— కట్టుబాట్లన్నిటినీ ఛేదించుకుని ఏదోస్పష్టంగా తెలియని స్వేచ్ఛకోసం పాకులాటతో కొందరురాసేరు. చలం సాహిత్యంలో యిది కనిపిస్తుంది.

చలంగారివరకూ— సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలకి మూలకారణాలు, పరస్పర సంబంధాలకి సంబంధించిన అవగాహన—తో రచనలురాలేదు. రష్యా ప్రజల

విప్లవ విజయానికితోడ్పడ్డ మార్క్సిస్టు ఆర్థికరాజకీయ తత్వశాస్త్రాలు తెలుగువాళ్ళ భావ ప్రపంచంలోకి దూసుకొచ్చేయి. గాంధీగారి– అలకద్వారా అవతలివాడి మనసుమార్చే- సత్యాగ్రహ పోరాటానికి సంబంధించిన భావాలుకూడా ప్రచారంలోకొచ్చేయి. పారిశ్రామికాభివృద్ధితోపాటు ఆర్థికంగా వర్గవిభజన స్పష్టమౌతోంది. కొత్తవ్యవస్థకీ, మతం ప్రాతిపదికగా ఉన్న పాతవ్యవస్థకీ మధ్య. కొత్తవ్యవస్థలోని వివిధవర్గాల ప్రయోజనాల మధ్య పోటీలు ప్రారంభమయేయి. తదనుగుణమైన భావాలు ప్రచారంలోకొచ్చేయి. ప్రజల్లో రాజకీయ చైతన్యం ఉధృతమౌతోంది. పాతవ్యవస్థని బలపరిచే భావాలు విశ్వనాథ సత్యనారాయణగారి రచనల్లో కనిపించేయి.

....'జరుగుతున్న దోపిడిని, అన్యాయాన్ని చూడం– వినం– చూసినా విన్నా పట్టించుకోం– ప్రకృతి సౌందర్యం ... స్త్రీ సౌందర్యం.... ప్రేమ.... స్వేచ్ఛ ... కలలు, ఆనందం.... ఇవే మాకుముఖ్యం'....

అనే 'పేదవాడి పొట్టకొట్టే పెద్దవాడికి సేవచేసే' మధ్యతరగతి మనస్తత్వాన్ని బుచ్చిబాబు రచనల్లో చూస్తాం. ఈరకం శక్తుల్ని, ఆలోచనాపద్ధతుల్ని ఎదిరిస్తూ అభ్యుదయ రచయితల ఉద్యమం బయలుదేరింది. వాస్తవజీవితాన్ని చిత్రిస్తూ, వాస్తవ జీవితంలోని వ్యక్తుల మనస్తత్వాలకి అద్దంపట్టే పాత్రల్ని సృష్టిస్తూ, జీవితంలోని సంఘటనలకి, సమస్యలకి వెనక ఉండే సాంఘిక, ఆర్థిక, రాజకీయకారణాల analysis ఇస్తూ, పాఠకుడికి జీవితాన్ని గురించి ఎలా ఆలోచించాలో మార్క్సిస్టు దృక్పథంతో చెప్పక చెప్పిన కొడవటిగంటి కుటుంబరావుగారు ఈ ఉద్యమాన్ని నడిపిన గొప్పశక్తి. ఆయన కథావస్తువు సామాన్య మధ్యతరగతి జీవితం. మొత్తంగా సమాజ శ్రేయస్సుని దృష్టిలోపెట్టుకున్న అభ్యుదయ భావాలు. అవి అందరికీ సులభంగా అర్థమయే శైలి. ఆయన కథలు 'శాశ్వతంగా నిలిచిపోయే అనర్ఘరత్నాలు' కాదు. మారుతున్న సమాజానికి ఒకదశలో ప్రయోజనకరమైన కథలు. అభ్యుదయ సాహిత్యోద్యమంనాటి ఇతర కథకుల్లో మార్క్సిస్టు దృక్పథంతో కొంతకాలంపాటు కథలురాసిన రచయిత గోపీచంద్‌గారు.

స్వాతంత్ర్యం వచ్చేక సాంఘిక, ఆర్థికరంగాలలో కొన్నాళ్ళపాటు 'ఆశాపూరిత వాతావరణం' ఏర్పడి ప్రజల రాజకీయ చైతన్యాన్ని చంపేసింది. ఆ వాతావరణం కుటుంబరావు, చాసోవంటి ఒకరిద్దర్ని తప్ప అభ్యుదయ రచయితల్ని సినీ రచయితలుగాను, గవర్న్మెంటు రచయితలుగాను చేసింది. ఆ రోజుల్లోనే, మొదట శిల్పంలోను తరవాత వస్తువులోను, జీవిత చిత్రణలోను తెలుగుకథని అత్యున్నతస్థానానికి తీసుకుపోయిన రాచకొండ విశ్వనాథశాస్త్రి రచనా ప్రారంభం. కొద్దికాలం తరవాత మాలతీ

చందూర్, లత, ముప్పాళ రంగనాయకమ్మవంటి రచయిత్రులు సాంఘిక వ్యవస్థని విమర్శిస్తూ కథలురాసేరు. ఇప్పుడు చాలామంది స్త్రీలుకూడా రాస్తున్నారు.

ఈ రోజుల్లో,—

గొప్పవాళ్ళ కుటుంబ కలహాలు, మనస్పర్థలు, అపార్థాలు, పశ్చాత్తాపాలు, మనశ్శాంతి గురించీ;

తాగుడు, వ్యభిచారం, జూదంవంటి వ్యసనాలకి బానిసలై చితికిపోయిన గొప్పవాళ్ల గురించి;

నిప్పులాంటి నిజాయితీ, శాంతం, పెద్దలపట్ల భక్తి, విశ్వాసాలుకలిగిన, కష్టపడి పనిచేసే పేదవాడు భగవదనుగ్రహంవల్లనూ, పెద్దల దయవల్లనూ గొప్పవాడైపోవడం గురించి;

ఒక ధనికుడు అందమైన, గుణవంతురాలైన ఓ పేదరాల్ని, (పెద్దల్నెదిరించి) ప్రేమించి, (పెద్దల మనసు మార్చి) పెళ్లాడ్డం, లేదా ...

కోటీశ్వరుడి ఏకైక వారసురాలు అందగాడు, వివేకవంతుడు, మంచివాడు అయిన యువకుడిని ప్రేమించి, తండ్రికోపానికి గురై, కష్టాలనుభవించి (ధనికుడు కానివాడు చచ్చేంత కష్టాలు పడుతున్నట్టు ఈరచయితకి తెలుసనేందుకు నిదర్శనం!) చావుకి దగ్గరౌతూండగా, మనసుమారిన తండ్రి గురించి,—

ఇలాగ కలిగిన వాళ్లకులాసా జీవితంలోని 'బరువైన', 'ఆదర్శప్రాయమైన' ఘట్టాలతో కట్టలుకట్టలుగా కథలు వస్తున్నాయి. ఇవన్నీ మొగుడ్నికొట్టి మొగసాలెక్కిన అరుపుల్లాంటి భావాలు. ఒకపక్క కోట్లాది శ్రమజీవులు తిండిలేక రోగాలతో, దరిద్రంతో, అజ్ఞానంతో, కలహాలతో, దుఃఖంతో, కొట్లాటలతో దుర్భర జీవితాన్ని గడుపుతుంటే ... వాళ్లదుస్థితికి కారకులైన కోటీశ్వరులకి దురదా? ఎన్నికోళ్ళని, ఎన్ని మేకల్ని, ఎన్నిగొర్రెల్ని చంపేవనికాక, ఎంత తృప్తిగా భోంచేసేం అని ఆలోచించే తత్వం వాళ్ళది. వాళ్ళదృష్టిలో ప్రత్యక్షంగా పండుకు తినదగ్గ జంతువులు కోళ్ళు, గొర్రెలు, మేకలు అయితే, పరోక్షంగా పిండుకోదగ్గ జంతువులు శ్రమజీవులు. ఎంత పిండుకున్నాం, ఆస్తులెంత పెంచుకున్నాంవన్నదే వాళ్ళధ్యాస. వాళ్ళ భావాలని, వాళ్ళ సంస్కృతిని బలపరిచేదే పై సాహిత్యం. వాళ్ళ సాహిత్యం బాగులేదనేవాళ్ళు ఫలానా సంస్కృతి బాగులేదని చెప్పుకోవాలి.

వర్గసమాజంలో కోటీశ్వరుల ప్రయోజనాలకి పనికొచ్చే భావాలు మాత్రమే ప్రచారం కావు. శ్రామికజీవుల ప్రయోజనాలకోసం పోరాడే భావాలుకూడా ప్రచారం అవుతాయి. రాచకొండ, కాశీపట్నం కథలే అందుకు నిదర్శనం. రౌడీలు, పడుపుకత్తెలు

కూలీలు, సారాసీసాలు మోసేవాళ్ళు, రిక్షాలాగేవాళ్ళు— ఒక్కమాటలో చెప్పాలంటే పొట్టకోసం వాళ్ళమ్ముకునే వాళ్ళంతా వాళ్ళ స్వంతమాటలతో, ఆలోచనలతో, బాధలతో, భయాలతో, ఆశలతో, తెగింపుతో, సత్తువతో, పౌరుషంతో, మానాభిమానాలతో— రాచకొండవారి కథల్లో కనిపిస్తారు.

బుగతలు, షావుకార్లు, కరణాలు, మునసబులు, ప్రభుత్వ ఆఫీసర్లు పీల్చుకు తినే శ్రమజీవులు— రైతుకూలీలు, పేదరైతుల జీవితాన్ని కాళీపట్నం రామారావుగారి కథల్లో చూస్తాం. పల్లెలలోని ఆర్థిక, సాంఘిక, రాజకీయవ్యవస్థా స్వరూపాలని, వాని ఫలితాన్ని పాఠకుడి కళ్ళముందు యథాతథంగా నిలబెడతాయి ఆయన కథలు.

ఈ పరిణామక్రమాన్నంతా పరిశీలిస్తే మనకి కొన్నివిషయాలు బోధపడతాయి. కథ సామాజిక జీవితాన్ని అంటిపెట్టుకునే పెరుగుతోంది వివిధ సామాజిక శక్తులని ప్రతిబింబిస్తోంది. జీవితంలో వచ్చిన మార్పులన్నీకూడా కథా 'వస్తువు'ని విస్తృతం చేసినవే. కథకి క్రమంగా మరింత 'లోతు'ని, ఎక్కువ ప్రయోజనాన్ని కలగజేసినవే. రచయితల, రచయిత్రుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

ఈదృష్ట్యా, విప్లవ రచయితలవల్ల కథ మరింత ప్రయోజనకరమైన సామాజిక శక్తిగా రూపొందుతుందని ఆశించవచ్చు.

శ్రమజీవులు రాజ్యాధికారాన్ని చేపట్టడమే విప్లవం. ఆ విప్లవావసరాన్ని గుర్తించిన వారంతా రాచకొండలాగ, కాళీపట్నంలాగ శ్రామిక సంస్కృతిని బలపరిచే భావాలు ప్రచారం చెయ్యాలి.

ఏ వర్గానికీ, ఏ రాజకీయ సిద్ధాంతానికీ కట్టుపడని రచయితలు వొట్టి బూటక వాదులు. సమాజాన్నిగురించి రాయనివాళ్ళని సమాజంకూడా పట్టించుకోదు. సమాజాన్ని గురించి రాసేవాడు జీవితానికి కట్టుబడకతప్పదు. జీవితంలో న్యాయాన్నో, అన్యాయన్నో ధర్మాన్నో, అధర్మాన్నో, దోపిడీనో ప్రతిఘటననో బలపరచకతప్పదు. ఎవరూ తప్పించుకోలేరు.

చివరిమాట

ఇవాల్టినించీ మనం విప్లవ రచయితలమైపోయామే.... ఆకాశంలో ఎక్కడ్నించో సరికొత్త విప్లవ కథలు ఊడపీకాలే' అనుకునే అగత్యం విప్లవ రచయితలకి లేదు. దేశంలో విప్లవ పరిస్థితులున్నాయని నమ్మినవాళ్లు కనక, విప్లవాన్ని ఆహ్వానిస్తున్నారు కనక విప్లవరచయితలయేరు. జీవితాన్నిగురించి ఒక 'ఫలానివిధమైన అవగాహన' ఉన్నందుకు విప్లవ రచయితలయేరు. తమనమ్మకాలకి, అవగాహనకి రూపకల్పనచేస్తే అవి విప్లవకథలే అవుతాయి.

అసమానతలు

కృష్ణాబాయి

పీడిత ప్రజలపక్షాన పోరాడడానికి కంకణం కట్టుకున్న విప్లవ రచయితల సంఘం, సమాజంలో సగానికిపైగావుండి, అడుగడుగునా అసమానతలకు గురవుతూన్న ఆడవారి పట్ల తనపాత్రను ఎలా నిర్వహిస్తోంది అని ఒక సందేహం.

మన సంఘంలో ఇంకా పాతరాతియుగపు భావాలే చలామణీ అవుతున్నాయి. సంఘంలోవున్న ఎగుడుదిగుడులకు డబ్బే మూలకారణం అని వూరుకోకుండా సాంఘిక అసమానత్వాలను గురించిన చైతన్యం స్త్రీజాతిలో కలిగించడానికి విరసం పాటుబడాలి.

అప్పటి కన్యాశుల్కంలాగా ఇప్పటి వరకట్నం ఆడవాళ్లను కొయ్యబొమ్మలుగా, మరబొమ్మలుగా మార్చివేస్తోంది. వారి వ్యక్తిత్వం అణగారిపోతోంది. మగవాడి ఉదార బుద్ధితో, చిత్తసంస్కారంతో ఇలాంటి సమస్యలు తీరిపోతాయని చిత్రిస్తూ కథలు, నవలలు చాలా వచ్చాయి. కొద్దిమంది మగవారి ఔదార్యంతో కొందరు కన్నెపిల్లలు గట్టెక్కవచ్చు. దానితో మొత్తం సమస్య తీరిపోదుగా? స్త్రీ ముందుగా తన కాళ్ళమీద తను నిలబడాలి. అప్పుడే నిజమైన మానవత్వపు విలువలు మొగ్గదొడుగుతాయి. సమ సమాజం ఏర్పడేలోగా స్త్రీలో యీ జాగృతిని పెంపొందింపచేసే రచనలు రావాలి. కొడవటిగంటి కుటుంబరావుగారు యీదృష్టితోనే 'పంచకల్యాణి' లాంటి నవలరాశారు.

'న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అని ఏనాడో తెగేసిచెప్పారు మన మనువుగారు. అందుకే ఒక ఆంగ్లరచయిత woman was a slave before the slave existed అని బాధపడ్డాడు. ఆమాటకొస్తే అసలీ ధనస్వామ్యవ్యవస్థలో మగవాడే ఒక బానిస. ఆ బానిసకు బానిస ఆడది. కలెక్టరుగారి భార్య తాశిల్దారుమీద జులుం చలాయిస్తుంది అదే తాశిల్దారుగారు తన భార్యను చెప్పుకింద తేలులా అణిచిపెడతాడు. మొదటిది ఆర్థిక అసమానత్వాన్ని, రెండోది సాంఘిక అసమానత్వాన్ని సూచిస్తుంది.

శ్రమజీవుల్లోనే నిజమైన సమానత్వం నెలకొంటుంది. దీనిని నిరూపిస్తూ కవికొండల వెంకటరావుగారు వెనకెప్పుడో 'ఉద్యోగపుటుద్ది' కథ రాశారు.

వరదరాజనే ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌ని భార్య కౌముది "వైస్రాయి దంపతులని రాశారే, వైస్రాయి వుద్యోగం భార్యకు, భర్తకు కూడానా?" అని అడుగుతుంది.

ఆమె మనసుని పసికట్టి "నా వుద్యోగం పేరు నీక్కూడా ఎందుకు లేదనా నీ సందేహం?" అంటాడు పెనిమిటి. కౌముది మురిసిపోయి "భర్తకు భార్య సహచరిణి అంటారు. ఆదిదంపతులది అర్ధనారీశ్వర స్వరూపమంటారు. కాని మీరు మీ ఫైళ్ళు, పాడ్సులో మునిగివుంటారు. చీమ తలకాయంతకూడ వాటివూసు నాకు తెలియనివ్వరు. నాకేంబాగోలా యిది" అని అంటుంది. "నిన్నూ ఇన్‌స్పెక్ట్రెస్ అనిపించవచ్చు. కాని మనకు ఇచ్చేది ఒకజీతమే, రెండుజీతాలివ్వరు. అయినా చాకిరీ అంతా చేసేది నేనుగదా? అటువంటి నామమాత్రావశిష్టమైన పేరు ఎందుకూ అనిఇప్పించలేదు" అంటాడు. అప్పు డామె గోముగా "నామమాత్రావశిష్టమేమిటి? మగనితో సమానంగా వుంటూంటే!" అంది. దానికి జవాబుగా వరదరాజు డ్యూటీమీద వెళుతూ భార్యని కూడ కాంపుకి తీసుకెళతాడు.

ఆ దంపతులు పల్లెటూరు వెళతారు. ఓ నూనె గానగదగ్గర మగాడు గానగ ఆడుతూంటే ఆడది తెలకపిండి అమ్ముతుంది. ఒక సాలెపడుచు బట్టలు నేయడంలో తన పెనిమిటికి సాయం చేస్తూంటుంది. ఓ మాలవాడు నూర్చిన కళ్ళంలోంచి ధాన్యం బస్తాలు మోస్తూంటే అతని ఇల్లాలు కళ్ళంలోని గింజలు తుడుస్తూంటుంది. ఇలా ఆలుమగలుకలిసి పనిచేస్తూంటే కౌముది కళ్ళప్పగించి చూసి "అదే నిజమైన కాపురమం" టుంది. "నేనుమాత్రం నీవంక ప్రేమగా చూడనా? మనం ప్రేమించుకోవడంలేదా?" అంటాడు వరదరాజు. "కాని మీ జీవితంలో నాకుతెలీని, అర్థంగాని భాగం ఒకటిలేదా? భార్యాభర్తల మధ్య అలాంటిది వుండగూడదం"టుంది కౌముది.

పోతిగాడు అనే అతను పోతుతాటికల్లు గీస్తూంటే, అతని భార్య చెల్లాలు కల్లు ముంతల కావిడేసుకుని మోసుకెళుతూంటుంది. పోతిగాడు సర్కారుతాటికి కల్లుగీస్తూంటే వరదరాజు కేసురాస్తాడు. ఆ కాగితం చింపేస్తుంది కౌముది. తనవుద్యోగం పోతుందని భార్యని చడామడా తిడతాడు. తిరిగి వచ్చేటప్పుడు కౌముది "ఈ గమళ్ళ దంపతులు, వాళ్ళ అన్యోన్యం, మాయామర్మంలేని వాళ్లనవ్వులు- ఇవిచూసి నేనాకాగితం చింపేశా" నంటుంది. ఇదివిన్న చెల్లాలు "అమ్మగారే ఇన్‌స్పెక్టరైతే మనమీద కేసుపెట్టేదికాదు" అంటే "అప్పుడు ఆవిడ సింపేయదే. రాసుకుని దాసుకుంటుంది. అధికారమే అది" అంటాడు పోతిగాడు.

ఏనాడో, ఇంత స్పష్టమైన అవగాహనతో వచ్చినదని యీకథని ఇంతవివరంగా రాయాల్సివచ్చింది.

"స్త్రీ బుద్ధి ప్రళయాంతకః" అని తిడతారు. లేదా, "ఎక్కడ స్త్రీలు పూజింప బడతారో అక్కడ దేవతలు క్రీడిస్తారు" అని తెగపొగుడుతారు. అంతేగాని తోటి వ్యక్తిగా, సాటిమనిషిగా చూసే దృష్టిలేదు. ఒకరకంగా అప్పటి యీదృష్టిదోషమే

సాంఘిక అసమానతకు కారణం. "కాంతా కనకాల''నీ, 'పుస్తకం వనితావిత్తం పర హస్తం గతంగతః" అనీ స్త్రీని కేవలం ఆటబొమ్మగా మార్చేశారు.

'బిల్లు పాసయింది' అనే కథలో కంట్రాక్టరైన భర్తబిల్లు ముందు పాసుకావడానికి భార్య ఆఫీసరుతో హోటలుకి, సినిమాకి వెళుతుంది. ఆమె తొందరగా తిరిగిరాలేదని మండిపడుతున్న భర్తతో "మనబిల్లు ముందు పాసవుతుంది'' అని చెప్పగానే, అతను చల్లబడిపోయి "శ్యామలా, నువ్వెంత మంచిదానివి, నీకేంకావాలో చెప్పు" అని కౌగ లించుకుంటాడు. "ఆఫీసర్ వర్మ సెకండ్‌షోకి టికెట్లు తీసుకున్నాడు. నాకోసం ఎదురు చూడకుండా నిద్రపొండి" అని వెళ్ళిపోతుంది (విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘంవారి 'కథాంజలి'లో కర్మవీర్ రచన). ఇది చదివితే యీవ్యవస్థ స్త్రీని యిలా దిగజార్చి నందుకు బాధకలగడంతోపాటు ఆభార్యాభర్తలమీద మనకు ఏవగింపు కల్గుతుంది. డబ్బు ముందు అన్నివిలువలు కరిగిపోతాయి యీవ్యవస్థలో. ఇలాంటి పతితలమీద మనకు కలగాల్సింది కరుణగాని ఏవగింపుకాదు. వాళ్ళనలా దిగజార్చిన యీవ్యవస్థమీద కసి రావాలి. అది సాధించారు 'వాడిన మల్లెలు' కథలో సోదుం జయరాం ('సంవేదన'). తమ్ముడి వుద్యోగంకోసం అక్క ఒక కంపెనీ డైరెక్టరుకి తనకుతానుగా వశమవుతుంది. మర్నాడు తమ్ముడు ఎంతో ఆశగా వుద్యోగంకోసం వెళ్ళేసరికి డైరెక్టర్ బదులు మరె వరోవుంటా రాగదిలో. తమ్ముడితోపాటు మనమూ కుప్పకూలిపోతాం. అక్క 'వ్రతం చెడ్డా ఫలం దక్కదు'. ఈ కథలో సాంఘిక, ఆర్థిక కారణాలు పడగవిప్పి నాట్యం చేస్తాయి. ఆ పడగనీడలో ఎన్నిజీవితాలు రాలిపోతున్నాయో మనని ఆలోచింపచేశారు రచయిత.

స్త్రీలపట్ల ఏవగింపు, జాలికలిగించే రచనలు కాక, స్త్రీ వ్యక్తిత్వాన్ని గుర్తించి పాత్రచిత్రణచేసే రచనలు మనకిరావాలి. ఇటీవల యం. సావిత్రి రాసిన 'ద్వితీయం' ('ఆంధ్రప్రభ') కథలో ఒక నవయువకుడు వితంతువుని పెళ్ళాడతానని ముందుకి వస్తాడు. తీరా ఆమె నిలేసి అడిగేసరికి, కేవలం ఆమెను వుద్ధరిద్దామనే జాలితో చేసు కుంటానంటాడు. పెళ్లికి కావల్సినది జాలి, వుద్ధరింపుకాదు, ప్రేమ అనిచెప్పి ఆమె తిరస్కరిస్తుంది. మనకు కావల్సింది, రావల్సింది ఇలాంటి ధీరోదాత్తలైన నాయికల కథలు, 'కాలాతీత వ్యక్తులు' 'అతడు-ఆమె' నవలల్లో బాగా చదువుకున్న ఆడవాళ్లు తమకాళ్లమీద తాము నిలబడి వ్యక్తిత్వాన్ని నిరూపించుకుంటారు. ముఖ్యంగా యీ నవలల్లో పాత్రచిత్రణ ఆడవారి వ్యక్తిత్వానికి అద్దంపట్టింది. అలాగే మనతోటి కన్నడ భాషలో వెలువడిన 'వెండిమబ్బు' అనే నవల నేటిభారతీయ సాహిత్యంలోనే మేల్బంతి. కేవలం తనడబ్బుకోసమే తనను పెళ్ళాడదామనుకున్న యువకుడికి గట్టిగా బుద్ధిచెప్తుంది. ఇలాంటి వ్యక్తిత్వం స్త్రీలలో తొణికిసలాడాలి.

రేడియోలలో, పత్రికలలో, డాక్యుమెంటరీలలో ఉద్యోగంచేసే ఆడవాళ్ల ఈతి బాధలగురించి ప్రసంగాలు, వ్యాసాలు, చిత్రాలువస్తున్నాయి. మరి కాయకష్టంచేసి బతికే ఆడవాళ్లగురించి ఏప్రత్యేక సంచికలూ రాయవు ప్రొద్దున్నే లేచి పిల్లలకింత గంజిపోసి, తాముతాగి పనిలోకిపోయి పొద్దస్తమానం రెక్కలు ముక్కలు చేసుకుని, రాత్రి ఇంటికి పోయి ఇంత తినే ఆడవాళ్ళ జీవితాలు ఎందరికి తెలుస్తున్నాయి? ఆ కూలిపనికూడా దొరకని రోజుల్లో పిల్లల్ని డొక్కలో పెట్టుకు పడుకునే ఆడవాళ్లబాధ ఏఫోటోల్లో ప్రతి బింబిస్తోంది? పిల్లలకి బలమైన ఆహారం యిమ్మనీ, శీతాకాలంలో ఉన్నిబట్టలు, వేసవి కాలంలో పదులుదుస్తులు వెయ్యమనీ రేడియోలో హోరెత్తిం చేస్తూంటారు. కలవారికి అందరూ అంగరక్షకులే. అసలు కూటికి గుడ్డకి ముఖంవాచి, ఎండలో వానలో పసులతో దినమొలతో తిరిగే కోట్లాదిబిడ్డల మాటేమిటి? పై తరగతుల్లోని ఆడవాళ్ల పద్దించిన విస్తరిలాగా, కడుపులో చల్ల కదలకుండా పైలా పచ్చీసుగా బ్రతుకుతున్నారు. అద్వైత వేదాంతం యీ ఎగుడుదిగుళ్లను మాయం చెయ్యలేదు. కర్మసిద్ధాంతం ముసుగుతో వీటిని కప్పిపెట్టలేం.

పై తరగతి నడిమి తరగతి ఆడవాళ్ళు అలగా పని మనుష్యులతో పడే యిబ్బందులను గురించి నాటకాలు, వ్యాసాలు బోలెడు వస్తున్నాయి. కాని ఆ పనిమనుషులు పెద్దయిళ్ళలో పడే కష్టనిష్ఠురాలు పైకిరావు. కాళీపట్నం రామారావుగారు 'ఆదివారం' కథలో ఓ మధ్య తరగతి యజమానురాలి మనస్తత్వాన్ని, నక్కజిత్తుల్ని గ్రహించి వాళ్ళను చిత్తుచేసిన పని మనిషి పాత్రను చిత్రించారు. ఇంతవరకు ఎవ్వరూ ఇంత ప్రతిభావంతంగా చైతన్యంగల పనిమనిషిని చిత్రించలేదు. రావిశాస్త్రిగారి 'సారా కథ'ల్లో చాకుల్లాంటి ఆడవాళ్ళు ప్లీడర్లనీ, జడ్జీలనీ బొడ్లోచెయ్యేసి నిలేస్తారు. జీవిత సత్యాలను కాచి వడపోసి ధారాళంగా చెప్తారు.

ఇంతకాలం నడిమి తరగతి స్త్రీల వాస్తవిక జీవిత చిత్రణ కొంతవరకు జరిగింది- అభ్యుదయ కాముకుల రచనల్లో. ఇక అట్టడుగువర్గ స్త్రీల జీవిత సమస్యల గురించి రచనలు రావాలి. వాళ్ళు చదివి అర్థంచేసుకోలేకపోవచ్చు. కాని వాళ్ళను మనం అర్థంచేసుకుని చిత్రించాలి ఎలాగూ విరసం సభ్యులు తమకథల్ని ప్రజలమధ్యకు పోయి చదివి వినిపించాలనే కార్యక్రమంవుందికనుక ప్రజలకి అందే అవకాశంవుంది.

సమాజాన్ని కూకటి వేళ్ళతో కదిలించివేసే సమస్యలెన్నో వుండగా, లేనిపోని వాటిని తమ బుర్రల్లో సృష్టించుకుని మన రచయిత్రులు తెలుగు సాహిత్యంలో గుంట పూలు పూయిస్తున్నారు. ఉదా:— ఎయిర్ కండిషన్డ్ రూంలో కూర్చుని భర్త తనని ప్రేమిస్తున్నానని రోజుకోమారు చెప్పడంలేదని వాపోయే నవయువతుల కథలు.

సాహిత్యానికి కావల్సింది స్థూలదృష్టికాదు. అట్టడుగుజనం అంతరంగాలలోని బాధ, వేదన గ్రహించి కళ్ళకు కట్టేలా చిత్రించాలి. సమాజం ఏ స్థితిలోవుందో చూపించి వున్నసామాజిక వ్యవస్థలో రావలసిన మార్పులను గురించి రాయాలి. అదే ఉత్తమ సాహిత్యం.

విప్లవ కథలు

కొడవటిగంటి కుటుంబరావు

విప్లవ కవులు, విప్లవ రచయితలు, విప్లవకథకులు, విప్లవరాజకీయవాదులు విప్లవసంఘ సంస్కర్తలు– వీరందరిదీ ఒకటే లక్ష్యం. అది సాంఘిక విప్లవాన్ని సాధించటం. వీరందరూ ఒకే లక్ష్యం గురించి ఆలోచించగా, ఆ లక్ష్యాన్ని సంఘం చేరుకోవటానికి వేరువేరు మార్గాలు సూచిస్తారు.

విప్లవం అంటే పైపై సంస్కరణలుకాదనీ, సామాజిక వ్యవస్థయొక్క పునాదులే మారాలనీ, కొత్త పునాదులపై కొత్త సామాజిక సంబంధాలు ఏర్పడాలనీ అందరికీ తెలిసినదే.

మాటవరసకు విప్లవ ఫలితంగా సమాజంలో యజమాని-బానిస సంబంధాలుండవనీ; ఎక్కువ తక్కువ కులాలుండవనీ; అంటరానితనమూ, దాని ఉద్ధరింపుకు పత్రికలూ ఉండవనీ; పరిపాలనలో అవినీతి, లంచగొండితనమూ, పక్షపాతమూ ఉండవనీ; వ్యక్తికి నిజమైన గౌరవం ఉంటుందనీ; అధిక సంఖ్యాకులు కుక్క బతుకు బతకరనీ; పెత్తందారీపోయి, నిజమైన నాయకత్వం వస్తుందనీ; ఇప్పుడు పోలీసు తుపాకులతోనూ, కుర్చీల చాటునా విజృంభించి, వీరవిహారంచేస్తున్న సంఘ వినాశకర శక్తులు తలఎత్తితే వాటితలలు చితుకుతాయనీ బుద్ధిమంతులు సులువుగా ఊహించవచ్చు.
అయితే ఈ విప్లవదశ వడ్డించిన విస్తరికాదు మంత్రాలు చదివి ఆవాహనచేస్తే వచ్చేదికాదు. అనేకవేల చిన్న, పెద్ద సంఘర్షణలను జరిపి, వందలాది వేలాది వైరుధ్యాలను అధిగమించి, ఎంతో నరబలీ, రక్తపాతమూ దీక్షతోనూ, సరిఅయిన అవగాహనతోనూకూడిన ఆలోచనా విధానం అమలు జరిపితేగాని ఇప్పుడు మనమున్న దశనుంచి విప్లవదశకు చేరుకోలేదు.

ప్రతి సామాజిక వ్యవస్థనూ మార్పుచెందకుండా ఉంచటానికి దోహదం చేసే "జడత్వం" ఆ సమాజ నిర్మాణంలో అంతర్లీనంగా ఉంటుంది. ఆ "జడత్వం" సామాజిక మూఢ విశ్వాసాల రూపంలో ఉంటుంది. వాటిని Social inhibitions అనవచ్చు. ఏ అస్పృశ్యుడూ తన అస్పృశ్యతను బుద్ధి పూర్వకంగా నమ్మడు. ఏ స్త్రీ కూడా బుద్ధిపూర్వకంగా తన భర్త శవంతోపాటు చితిలోకాలి చావదు. ఏ శూద్రుడూ తాను బ్రాహ్మణ క్షత్రియవైశ్యులకన్న హీనంగాపుట్టానని బుద్ధి పూర్వకంగా ఆమోదించడు ఏ బాలవితంతువూ బుద్ధిపూర్వకంగా దిష్టిబొమ్మలాగా బతకదు. ఈ ఉదాహ

రణలన్నింటిలోనూ "బుద్ధి" అన్నది సాంఘిక విశ్వాసాలరూపంలో ఆయావ్యక్తుల బుర్రల్లో ప్రవేశించి వారి మెదడును జడంగా ఉంచేస్తుంది. అది మహాశక్తి, ఆ మహాశక్తితో పోరాటం సాగించకుండా సంస్కరణలే సాధ్యంకావు. (తాను బాగు చేయ దలచుకున్నవాళ్లే తన కృషికి ప్రతిబంధకంగా ఉంటున్నారని వీరేశలింగంగారు వాపోయారు.)

విప్లవల కోరేవారు ఈ మహాశక్తితోపాటు ఆయుధ బలాలనుకూడా ఎదుర్కోవాలి, విప్లవ రచయితలను జైళ్లలోకి తొయ్యటం ప్రారంభించిన హాస్యాస్పదమైన "ప్రజాస్వామిక" పాలకుబగల మనదేశంలో విప్లవరాజకీయ చర్యలు ఎటువంటి ప్రతిఘటనను ఎదుర్కొనాలో చెప్పనవసరంలేదు.

విప్లం కథకులు ప్రజలలోఉన్న సాంఘిక జడత్వాన్ని ఖండించాలి, ఈ నాటి సంఘ నిర్మాణానికి సిమెంటులాగా పనిచేస్తున్న విశ్వాసాలను ప్రజల మెదడులనుంచి కరిగించాలి, ప్రజలు విప్లవంకేసి పురోగమించటానికి అవాంతరంగా ఎదురయ్యే వైరుధ్యాలను మానసికంగా అధిగమించే మేధాశక్తిని కలిగించాలి.

ఒక్కముక్కలో చెప్పాలంటే, ప్రజలు విప్లవోన్ముఖులు కావటానికి అడ్డంగా ఉన్న వందలాది చిన్న, పెద్ద సంకెళ్లను ఒక్కొక్కటిగా ఊడగొట్టటం విప్లవరచయితల లక్ష్యం. తుపాకులు తీసుకుని గెరిల్లా యుద్ధాలు చేసేవారిని కీర్తించటంలో విప్లవ సాహిత్యం ఆగదు, ఆగరాదు. ఆ విప్లవ వీరులకూ, విప్లవంవల్ల బాగుపడదగిన అసంఖ్యాక ప్రజానీకానికీ మధ్య ఎన్నో అగాధాలున్నాయి. వాటిని పూడ్చటం విప్లవ రచయితలపని. విప్లవకవులు విప్లవ సత్యాలను సూటిగా, ఘాటుగా, సునిసూత్రంగా చెప్పగలరు. జీవితాన్ని వాస్తవికంగా చిత్రించేకథకులు హేతుబద్ధంగా ప్రజల మనస్సులను విప్లవోన్ముఖం కాకుండా బంధించే సంకెళ్ల చాలాఉన్నాయి. వారి అవగాహనను ముందుకుపోకుండా అరికట్టే ముడి పదార్థాలు ఎన్నో ఉన్నాయి. ఆ సంకెళ్లను విడగొట్టటమూ, ఆ ముడి ద్రవ్యాలను శానచెయ్యటమూ విప్లవకథకులపని.

ప్రజలను విప్లవ వ్యతిరేకాంధకారంలో ఉంచుతున్న దుష్టశక్తులు వాటంతట అవే బయటికి వస్తున్నాయి. వాటి నగ్నస్వరూపం ప్రజల ఎదటికి వస్తున్నది, వాటి దుష్టస్వభావాన్ని వివరించడమే రచయితల కర్తవ్యం.

Social inhibitions గురించి చెప్పాను ఏ సమాజంలోనూ రచయితలు వాటినుంచి విముక్తిపొందిఉంటేనే సమాజాన్ని ముందుకు నడిపించ గలుగుతారు. "వితంతువులు తిరిగి పెళ్లాడటం పాపమేమో!" అని లోపల పీకుతున్నంత కాలమూ ఏనాడూ వితంతు వివాహం చేయించలేడు. "అమెరికను యుద్ధయంత్రాన్ని మనం

ఎదుర్కోగలమా? అన్నభయం వియత్నాంవారికుంటే వారు అమెరికన్ బలాలచేత మట్టి కరిపించేవారా? "విప్లవ విశ్వాసం" లేని రచయిత విప్లవ రచనలు చేయలేడు. విప్లవ కథకులు మానసికంగా విప్లవకారుల స్థాయిని బలంగా అందుకుంటేగాని, తమ కథలద్వారా ప్రజల విప్లవ విశ్వాసాన్ని బలపరచలేరు.

మనం జ్ఞాపకం ఉంచుకోవాలి: చదువుకున్నవారిలోకూడా దేశభక్తి అంటే పాలక వర్గంపట్ల భక్తి అనుకుంటున్నవారున్నారు.

మనం మరిచిపోగూడదు: రోజూ హాట్ హాట్ సంపాదకీయాలు రాసేవాళ్లు, తమ పాలసీకి వ్యతిరేకంగా ఒక సంపాదకలేఖను ప్రచురించలేని పిరికి పందలు కావచ్చు. నల్లేరుమీదనడిచే బళ్లన్నీ కంకరరాళ్లమీద నడవలేవు.

మనం చూస్తూనేఉన్నాం: తిరుగుబాటుచేసే యువకులను కాల్చి చంపించే ప్రభుత్వం అభ్యుదయ నిరోధక పార్టీలచేత నానాతిట్లూ తింటుంది: తమ పరిపాలనకు ఎసరుతెచ్చే "కుడి" వాళ్ళను చూస్తూచూస్తూ శిక్షించలేదు. ప్రభుత్వాలకూ జడత్వం ఉంటుంది, అది ఒక్కొక్కసారి ఆ ప్రభుత్వం నాశనానికేదారి తీస్తుంది. అయినా విప్లవ వ్యతిరేక ప్రభుత్వాలు తమ జడత్వంనుండి బయటపడటానికి ప్రయత్నించవు.

కథకుడికి ఇవన్నీ ముడిపదార్థాలే. భయమూ, దౌర్జన్యమూ, ఆత్మద్రోహమూ అసత్యప్రమాణాలూ, ఇవిపీడకులలో కనిపించినప్పుడల్లా అవి పీడకవర్గం కవచంలో చిరుగులే అని నమ్మవచ్చు.

మనం ఈ నాడు "నూరు నక్సల్బరీలకు" ఎంతదూరంగా ఉన్నామంటే విప్లవ రచయితలు ఈనాడు చేసే రచనలు అత్యధిక సంఖ్యాకులకు అత్యుత్తమ సాహిత్య మనిపించితే ఆశ్చర్యం ఏలాఉండదు. "ఝంఝు" అమ్మకాలు దీన్ని ప్రత్యక్షంగా రుజువుచేశాయి. అందుకే ప్రభుత్వం 'ఝంఝు'ను చూచి బెదిరింది.

విప్లవ కథలుకూడా ప్రజలకు జీవిత నగ్నసత్యమనే ప్రగాఢ విశ్వాసాన్ని కలిగించి, వారి ఆలోచనా ధోరణులను విప్లవాభిమానంతోనింపుతూపోవాలి, విప్లవ కథకులు ఇతి వృత్తాలను ఎక్కడినుంచి తీసుకుంటారో, ఎలాటి శిల్పాలను ప్రయోగిస్తారో ఒకరు చెప్పేదికాదు.

కాని ఒక్కటి నిజమని నానమ్మకం— విప్లవ వాసనలేని కథలలో వైవిధ్యంలేదు చైతన్యంలేదు; అవి పాఠకులను రంజింపవచ్చుగాని, నిజంగా కదిలించలేవు. ఆ కథ పరిధి చాలా చిన్నది. విప్లవ కథల పరిధి జీవితమంత పెద్దదిగా ఉండాలి.

కథలు:

నర్తోడు

శ్రీపతి

'ఈ వానలో శంకరయ్య నాయుడ్ని ఎలా కాలుస్తారో' అన్నాడు కృష్ణారావు.

నర్తోడికి ఆ గుర్తేలేదు. పద్దినాలుగా వాడి కుడికాలు బొటనవేలుమీద పుండు బాధిస్తున్నది. తెల్లారే మందనించొచ్చి బుగతోరి ఇంటికి ఓ కావిడు నీళ్ళిచ్చి మందు కోసం చాకలిరంగడు దగ్గరికివెళ్ళాడు. రంగడు రేవుదగ్గరున్నాడంటే అక్కడికెళ్ళాడు. అక్కడ ఆ మందు వేరికి కట్టి వచ్చేసరికి ఆలస్యమయింది. చల్లింది తినేసి మందకి వచ్చేసరికి గొర్రెలు ఒకటే అరుస్తున్నాయి. ఆ హడావిడిలో శంకరయ్య నాయుడు చనిపోయిన సంగతి మరచిపోయాడు.

'ఈ పాటికి ఎప్పుడో బుగ్గయిపోయుంతాడు. నీసూర్లోనున్నాను పీనిగని తీసి కెలి పోయినారు'.

వెంటనే నర్తోడు కొడుకును గుర్తుతెచ్చుకున్నాడు ఇలాంటి వానకాలపురోజులే. చిన్నవయసు కాల్చకూడదని కావేటిలో మొగలిదొంకల దగ్గర పెద్ద గొయ్యితీసి-గొయ్యి తవ్వుతుంటే వాననీళ్ళు- ఏం కాదులేరా అని పాతిపెట్టారు. నక్కలు మళ్ళీ గోతిని తవ్వేసి శవాన్ని ఎత్తుకుపోతాయని ముళ్ళుకప్పారు.

దాంతో కొంతసేపు నర్తోడుకి వేలుమీది పుండునొప్పి తెలీలేదు. ఆ కొంతసేపు నర్తోడుకి ముందున్న కృష్ణారావు కనిపించలేదు. వాన గొడుగుమీద పడుతున్న చప్పుడుగాని ఇసికనేలమీద సైతం నీరు పాయలుగా పారుతున్న దృశ్యంగాని కనిపించ లేదు. ఆ కొంతసేపూ నర్తోడు పాతకాలం సముద్రింపులోంచి మునిగిపోయాడు.

ఒక్కసారి ఏదో గుర్తొచ్చినట్టయి 'లంజకొడుకులు దొరికిపోయినారా....' అన్నాడు గొణుగుతున్నట్టు. 'కన్నుమూసి కన్ను తెరచినంతలో అంతాచేసి రావాల. అప్పుడనగ ఎల్లి....' అని చుట్టూ కలయజూసాడు.

వర్షమే గాలికి తెరలు తెరలుగా ఊగులో కన్పిస్తున్నది.

ఆ వెళ్ళిన ముగ్గురు గొడుగులూ చిన్నగూడులాగ ఇసికలోగుచ్చి ఉన్నాయి. వాళ్ళ గొడుగుల్లో నర్తోడూ, కృష్ణారావూ ముడుచుకుని కూచున్నారు.

నర్తోడి తాటికమ్మలగొడుగు అది వాడి ఇల్లు లాంటిది. దాన్ని చాలా అలంకరించాడు. పాలపిట్టల రంగురంగుల ఈకలు పువ్వుల్లా లోపల పంజరానికి వేలాడగట్టాడు. చింతపురుగుల రెక్కలుమధ్యమధ్యన వేలాడదీసాడు. గొడుగు కర్రి ఎర్రగా నూనెలో పండేసాడు. లోపల తాళ్ళతో అందంగా ముడులేసాడు. అది నర్తోడుకి రెండో ప్రాణం. దాన్నొదిలి మందతో ఎప్పుడు నర్తోడు రాలేదు. ఎండకీ, వానకీ. అది తోడు.

తుమ్మల సవరయ్య తోట ఇప్పుడు ఈ వానలో కనిపించటంలేదుగాని దగ్గర్లోనే ఉంది. దుంపలు తవ్వుకుని రావటానికి తుంబడు, గడ్డయ్య. సోములూ వెళ్ళారు. ఇంకారాలేదు దొరికిపోయారేమో అని ఓ పక్క భయపడుతున్నాడు.

తుమ్మల సవరయ్య పెద్దరైతుకాడు. పేదోడు. దొంగతనం బయిటపడినా భయం లేదు. వాడు పెద్దల మధ్యకి తగువుకి వెళ్ళడు. పెద్దలంటే చాలాభయం. ఆచుట్టూ పెద్దరైతుల భూములు చాలా ఉన్నాయి. కాని వాళ్ళ భూముల్లోకెత్తె ఒకరోజు కాకపోతే ఇంకొకరోజన్నా దొంగతనం బయటపడిపోతుంది. పూళ్ళో తగువు పెట్తారు. తప్పు వేస్తారు. దొంగపోయింది పైసా అయితే దొంగలాడింది రూపాయి అంటారు. అంతా ముక్కపిండి బండిని అమ్మించో పశువుల్ని అమ్మించో– చిన్నరైతు అయితే– భూమిని అమ్మించో వసూల్చేస్తారు. పెద్దరైతుల తోటల్లో అందుకే అడుగు పెట్టరు. చిన్నరైతులంటే బతిమాలుకుంటే తిట్టి పూరుకుంటారు. ఆ ధైర్యంతోనే తుమ్మల సవరయ్య అరెకరా తోటలో దుంపలు తవ్వుకుని రావటానికి వెళ్లారు.

వెళ్లినవాళ్ళల్లో తుంబడు కత్తిలాంటివాడు. కాని వాడికి పాముల్ని చూసినా. పెద్దరైతుల్ని చూసినా, రాత్రిపూట వల్లికాడుని చూసినాభయం. వాడికి తోడుగావెళ్లిన సోములూ. గడ్డయ్యా గుంటలు. వాళ్ళకి తుంబడులాంటి వాళ్ళయితే లేదుగాని తెలివైనోళ్ళు. వీళ్ళు కాపలా ఉంటారు.

ఇంకా రాలేదు. వానకి జడసి ఎక్కడో ఏ పశులసాలల్లోనో కూచున్నారేమో అనుకుంటే వానకి లెక్కచేసేవాళ్ళుకారాయె. వానకి తడిసేవి వాళ్ళ వొంటిమీద ఏం లేవు. చిన్న గోచిపాతలాంటి పంచె నడుంచుట్టూ. తలకి చిన్నపాగా. ఏ పెద్దరైతు కళ్లల్లోనన్నా పడిపోయుంటారేమో. పట్టుకుని రాటకి కట్టేసి కొడ్తుంటే దెబ్బలుతిని అనుస్తున్నారేమోనని నర్తోడి భయం.

'కుష్టారావో తడిసిపోతన్నావా?' నర్తోడు అడిగాడు. 'గొడుగు అటుపక్క వొంచు. జల్లు ఆ పక్కనించి కొట్తన్నాది'.

కృష్ణారావుకి ఈ పసులకాపరితనం ఇంకాకొత్త. నెలదినాల కిందటి వరకు స్టూడెంట్. పరీక్షల్లో నెగ్గలేకపోయాడు. చదువులకి పనికిరాడని తండ్రి నిరాశపడిపోయి తెచ్చి వ్యవసాయంలోపెట్టాడు. ఇపుడు ఆవుల్ని మేపటం కృష్ణారావుకు చాలాబావుంది. చదువంటే, స్కూలంటే, టీచర్లంటే, స్కూల్ పిల్లలంటే భయమేర్పడి పోయింది. ఆ పాస్ మార్కులు అన్నవి ఎప్పుడూ హిమాలయ పర్వతాల దగ్గర ఉండిపోయేవి, వాటిని చేరుకోవటం కృష్ణారావుకు చేతకాలేదు,

నర్తోడులాగ మాటాడిన మనుషులని కృష్ణారావు చూడలేదు. అంత ప్రేమతో ఏ మేష్టరూ మాడాటలేదు. ఆ మేష్టర్లంతా ఎవరిమీదనో కసితోఉన్నట్టు బడికివచ్చి ఎవరి మీది కోపాన్నో క్లాసురూమ్‌లో అరుపుల్లోనూ తిట్లలోనూ కొన్నిసార్లు కొట్టటంలోనూ చూపి జిడ్డు మొహాల్తో వెళ్ళిపోయేవారు. అడవుల్లో తిరిగే జంతువులు వచ్చేట్టుగా ఉండేవారు. మేష్టర్లని చూడాలంటే భయం. చదువు మానిపించేసినందుకు కృష్ణారావుకు చాలాహాయిగాఉంది, తుంబడు, గోనెల్రాముడు, గడ్డయ్య, సోములు వీళ్ళంతా చాలా మంచివాళ్ళు. వందలు వందలున్న హైస్కూల్‌లో ఒకరిద్దరు కూడా మంచి స్నేహితులు ఏర్పడలేదు. ఆవుల్ని తోలుకుని వచ్చిన తొలిరోజునే వాళ్లంతా నేస్తులయి పోయారు. అందుకే వాళ్ళతోపాటు వెళ్తానన్నాడు దుంపలు తేవటానికి, నర్తోడు ఒప్పుకోలేదు,

'నీవు రైతు కొడుకువు, దొరికిపోతే పరువుపోతాది, ఆళ్ళా నాలుగు తన్నినా తింతారు, బరిస్తారు' అని పోనివ్వలేదు.

మొన్న పడిందివాన. నిన్నపడింది మళ్లీ. ఇసిక భూములు తడిసి మెత్తబడ్డాయి. చెట్టుపట్టుకుని సులువుమీద లాగితే మొత్తం దుంపలన్నీ గుత్తుగా వచ్చేస్తాయి. చెట్టుతో పట్టుకొస్తే అందరికీ సరిపోతాయి.

తిళ్లతేవటానికి వెళ్ళిన గోనెలాి్రముడు ఇప్పుడప్పుడేరాడు. వూరు మైలు దూరంలో ఉంది. వాడసలే నజ్జుమనిషి. ఏ పనీ చెకచెకా చెయ్యలేడు. వాడింకా వూళ్ళోనే ఎవరింటికాడో వుంటాడు. ఆ బుగతోరు తింపి తపేళాల్లోసర్ది ఉట్టిలోపెట్టి ఇవ్వాలి. అయిదు ఇళ్ళనించి అరకంగా ఆ తిళ్ళు తెచ్చి భుజానికి రెండు దిక్కులా వేలాడగట్టి మోసుకు రావాలి. ఈ వాన విడిచిందాకా వాడు వూరు విడిచిరాడు, ఈ వాన చూస్తే ఇప్పుడప్పుడే విడిచేట్టు కనిపించదు.

ఉదయం మందు కాలికి పెట్టూ చాకలి రంగడు 'కాలికి రెండో్రజులు నీళ్ల తగల్నివ్వకురో' అన్నాడు. కాని ఎక్కడ కుదుర్తుంది. వానజల్లుని ఎంత ఆపుతున్నా నేలమీది భూమి తడితో పాదం తడిసిపోతూనేఉంది,

పశువులన్నీ ముడుచుకొని మర్రిచెట్టు కింద నుంచున్నాయి. ఈ వానకాలం గ్రేజింగ్ గ్రౌండ్‌గా విడిచేసిన ఈ బంజర్లు తప్పించి పశువులు అడుగు పెట్టటానికి ఇంకెక్కడా చోటు మిగల్లేదు. అన్నీ పంట పొలాలు కొబ్బరితోటలు చుట్టుపక్కల గ్రామాల పశువులన్నీ తిరగటంవలన గడ్డి ఇక్కడాలేదు ముళ్ల తుప్పలున్నాయి. అవి కొరుక్కుంటాయి. కట్టుమీద సాల్లో వదిలేస్తే వాటికి కాళ్లనొప్పులొస్తాయి. అందుకని ఈ బంజర్లకి వదలడం.

పొగాకు ముక్కతీసి ఒక చిక్కతెంచి నోట్లో వేసుకున్నాడు నర్తోడు.

దగ్గర ఉన్న తుప్పలుగూడా కనిపించటంలేదు. వాన కుండపోతగా కురుస్తున్నది. వాళ్ళు దగ్గరకొస్తేకాని కనిపించరు. వాళ్ళుతెచ్చే దుంపలుకోసం ఆశపడి ఎదురు చూస్తూ కూచున్నారు. కడుపు కనకన లాడిపోతున్నది. అనుకున్నదేమిటంటే వాళ్ళు ఆ దుంపలు తెస్తే కాల్చాలని, అక్కడ ఎండుపుల్లలన్నీ పోగేసి ఉంచారు. అవి ఈ వానకి తడిసిపోయాయి. కాల్చటం పడదు. పచ్చివే తినాలి.

'వొచ్చారు' అన్నాడు కృష్ణారావు. తుప్పలచాటున నీడలుకదిలితే చూచి.

తుంబడు పొట్టిగా. సోములుకి కృష్ణారావు వయసు. గద్దయ్య సోములుకంటె వయసులో పెద్దే అయినా ఏదో జబ్బు ఉంది. వాడు బానకడుపుతో వేలాడుతున్న బుగ్గల్తో యీ చిన్నవయసుకే గుంటలుపడ్డ కళ్ళతో ఉంటాడు. అయితే చురుకుతనం ఏం తగ్గలేదు.

ముగ్గురూ చేతిలో ఒకటిరెండు చొప్పున పట్టుకుని వచ్చారు.

తెచ్చి నర్తోడు ముందు పడేసారు వెళ్ళి వాళ్ళ గొడుగులకింద కూచున్నారు.

నర్తోడు ఎర్రటి మనిషి. ఎండల్లో ఎండి బెల్లం రంగొచ్చింది వొంటికి. చిన్న గద్దకళ్లు, సన్నటి పెదాలు, సగంనెరిసిన మాసినగెడ్డం, మీసాలు పై పెదాలని కప్పేసి ఎదున్నాయి. తన ఆలోచన పనికొచ్చిందని సంతోషంలో ఉన్నాడు. ఒక మంచి లేతముక్క విరిచి కృష్ణారావుకు అందించి 'కుష్టారావో తిను' అన్నాడు.

వాళ్లు చలికి వొణికిపోతున్నారు. చూసి తన తలపాగాతీసి తుంబడికిస్తూ 'ఏమిరా ఇంత ఆలీసం' అని 'వొళ్లు తుడుసుకోండి'అని వాళ్ళవేపు ఒక్కొక్క దుంపవిసిరాడు.

నోట్లోని పొగాకు ఉమ్మేసి, తర్వాత నోరు ఖాండ్రించి మరోసారి ఉమ్మేసి ఒక దుంపతీసి చేత్తో లొక్క వొలుస్తున్నాడు.

'అడు సూసినట్టున్నాడోరి' అన్నాడు మళ్ళీ సోములు. వాడికి ఈమధ్యనే మగ గొంతు వచ్చింది. వాడికి గుండెమీద రొమ్ముమొనలు గడ్డలుకట్టి నొప్పెట్టున్నాయి.

వాడు ఎల్లప్పుడూ వాటిని వొత్తుకుంటున్నాడు. ఈ వానలో అయితే తిండిలో పడ్డాడు గాని ఖాళీగాఉంటే అదేపని. 'నీకు సమర్తాడే వొయసొచ్చిందిరా సోములూ' అని నవ్వి స్తాడు నర్తోడు.

'ఎవడారి తుమ్మల సవరయ్యా?'అని అడిగాడు. సోములు చెప్పినమాటకి అను మానం వచ్చింది. ఇదేదో కొంపమునిగినట్టున్నా దే అనుకున్నాడు.

'అడుకాడురా. తామాడ సుగ్రీవుల దావు. వస్తుంతే ఆ పక్క గుడ్డిలోని సాల్లోన ఆడు కనబడ్డాడు. సూసినట్టున్నాడు' అన్నాడు సోములు. ఓపక్క దుంప నములుతూనే.

దుంప తినడం మాని తుంబడు దిక్కు చూసాడు నర్తోడు.

'అడు అయేళప్పుడు యానికుంతాడ్రా. నీ అనుమానంగాని. అన్నాడు గడ్డయ్య. అక్కడేచూసి సోములు గొణిగాడు. గడ్డయ్య వెతికిచూసాడు. ఎవరూ కనిపించలేదు. ఏచెట్టో మొక్కో చాటొచ్చిందో ఏమో.

తామాడ సుగ్రీవు అంటే కృష్ణారావుకి అసహ్యం. వాడు వయసులో పదేళ్ల పెద్ద ఉంటాడు. చిన్నప్పుడు చెర్లో స్నానం చేస్తుండగా వాడు కృష్ణారావుని నీళ్ళల్లో ముంచేసాడు. ఊపిరిపీల్చుకోలేక ఉక్కిరిబిక్కిరయిపోయేవాడు. కేకలేసి అరిచి తిట్టేవాడు సుగ్రీవుని. వాడు మళ్ళీ పట్టుకుని నీళ్ళల్లోకి ముంచి అణిచిపెట్టేవాడు. వాడిని అంతా తిట్టేవారు. అయినా వాడేంమారలేదు. వాడి తండ్రికి వెధవ అప్ప జెల్లెళ్ల ఆస్తి పదెకరాలు బంగారం ముప్పయినలభైతులాలు డబ్బు పది పదిహేనువేలు ఇళ్లు రెండు కలిసాయి. ఒక్కడేకొడుకు, వాడి ముద్దు అలాగేపెరిగింది.

'అడి గుడ్లోన దొంగలాడినా మేంటి? అడుసూస్తే?'అని తీసిపారేసాడు గడ్డయ్య

'అడికి మనం దొరికితే నరాï. ఏ గుడ్డిలో దొంగలాడినా(వో వొద్దు. ఒకటి దొంగలాడితే పది దొంగలాడినావంటాడు. పక్కగుడ్డిలో తెస్తే ఆదిగుడ్డిలో తెచ్చినా మంతాడు' అని వాడిగుణం చెప్పాడు నర్తోడు.

ఆ దుంపలు తినేసరికి వర్షం తెరిపిచ్చింది. మేఘాలు తెల్లబడ్డాయి. పశువులు వొళ్లు దులుపుకుని చెట్లకిందనించి బయటికి సాగిపోయాయి. గొర్రెలు చరికి వొణికి పోతున్నాయి;

ఆ పక్కనించి తుప్పలచాటున తామాడ సుగ్రీవు కనిపించాడని చెప్పాడు సోములు.

'వోరి వోరి ఆ తొక్కతీసేసి తుప్పల్లోనికి పారేయండారి' అన్నాడు గడ్డయ్య. గబగబా ఎవరికి అందింది వాళ్లు పారేసారు.

కృష్ణారావుచేతిలో చిన్నముక్క ఇంకా మిగిలింది. అదీ పారేసాడు, వస్తున్న తామాడ సుగ్రీవుని చూడనట్టుగా నర్తోడు గొర్రెలవేపు నడిచిపోయాడు. సోములు వాడి ఆవులు వెళ్లినవేపు దారితీసాడు.

గడ్డయ్య, తుంబడు, కృష్ణారావు ఎక్కడికివెళ్ళాలో తోచక అక్కడే ఉండిపోయారు. తుంబడు ఏమీఎరగనట్టు అమాయకంగా ముఖంపెట్టాడు. గడ్డయ్యకూడా నిబ్బరంగా ఉన్నాడు. అది కృష్ణారావుకు చేతకావటంలేదు.

వస్తూనే 'ఏమిరో దుంపలు బాగున్నాయా?'అని అడిగాడు తామాడ సుగ్రీవు. స్నేహితుడులాగా. పలకరిస్తున్నట్టు.

గుండె ఆగినంతపని అయింది. దూరంనించి వింటున్నాడు నర్తోడు.

'బాగున్నాయి బావు అన్నాడు తుంబడు,

'ఏమిరో నర్తోడా, ఈళసేత ఈ పని సేయించినావు?' అని మంచి మంచి మాటల్తోనే అన్నాడు. కాని ఆ మాటలు విషంలో తడిసివచ్చినట్టున్నాయి.

'ఏంపని బావు!'

'నీ దొంగబుద్ది పోలేదుర దొంగలంజకొడకా' ఈసారికూడా మాటలు మెత్త మెత్తగానే అన్నాడు.

నర్తోడు నిజం చెప్పేస్తే బావుండుననిపించింది కృష్ణారావుకి. ఏంపని బావు అని తెలీనట్టు అడగడం నచ్చలేదు.

తామాడ సుగ్రీవు అటు నర్తోడువేపు నడుస్తున్నాడు.

నర్తోడంటే తామాడ సుగ్రీవుకు పడదని కృష్ణారావుకు తెలీదు. తామాడ సుగ్రీవు దగ్గర తనకొడుకును నర్తోడు కంబారిగా ఉంచాడు. కంబారితనం చేస్తున్నప్పుడే వాడు జబ్బుపడ్డాడు. జబ్బుపడినందుకు పంపకపోతే తిట్టాడు. కొంచెం నయిమయిందనేసరికి కొడుకును పనిలోకి పంపాడు. అక్కడ కొన్నాళ్ళకి ఆ ఇంట్లో పనులకీ వాళ్లపెట్టిన తిండికీ జబ్బు తిరగేసి కొడుకు చచ్చిపోయాడు. కొడుకు పీనుగముందుకూచుని నర్తోడు కడుపులోని దుఃఖాన్ని దిగమింగుకోలేకపోయాడు. చేతి కందొచ్చిన కొడుకు చచ్చిపోయేసరికి వాడికి ఇంకో కారణం ఏదీ కనబడలేదు. రాచ్చసుడి ఇంట్లో పెట్టేసినానుకొడుకో, నిన్ను ఆడిపొట్టలో పెట్టేసికొన్నాడు కొడుకో. అని ఏడ్చాడు. దాంతో తామాడ సుగ్రీవుకి కోపమొచ్చింది. అప్పటికే కొడుకుమీద అప్పుచేసాడు. ఆ అప్పుతీర్చమని పడ్డాడు తామాడ సుగ్రీవు. అది వూర్లో పెద్దమనుషుల దగ్గరికెల్లింది. తర్వాత గుర్రాల పరికాళం నాయిడు దగ్గర్నించి ఆ డబ్బు కక్కించాడు తామాడ సుగ్రీవు.

దానికీ మళ్లా ఏడ్చాడు నర్తోడు.

'అరే తుంబా, దుంపలుతెచ్చినావా లేదురా?' తుంబడువేపు తిరిగి దూరంనించే అడిగాడు.

'తెచ్చినాను. కాని మీ గుడ్డిలోకాదు బావు. తుమ్మల సవరయ్య గుడ్డిలోవిబావూ' అన్నాడు తుంబడు.

'బొంకులు బొంకకురా తుంబా. ఎక్కడ తిచ్చావోసెప్పు?'

తుంబడు పూల రామయ్యనాయుడు కంబారి. వాడిని గట్టిమాట అనటానికి తామాడ సుగ్రీవుకు కొంచెం భయం. పూల రామయ్యనాయుడు ఆ వూళ్లో పెద్దరైతు. వాడికొడుకు పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్. వాడి తమ్ముడు బ్లాకులో యూడీక్లర్కు. వాడి అల్లుడొకడు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్. అన్నిటికంటె ముఖ్యం పూల రామయ్య సర్పంచ్ దగ్గరమనిషి. వాడిమాటకి వూళ్లో విలువుంది. అలాంటి పెద్దరైతు పలుకుబడిగల పూల రామయ్యనాయుడు కంబారి తుంబడు. తామాడ సుగ్రీవుకు ఇది తెలుసును. వాడిమీద చెయ్యిచేసుకుంటే అది ముప్పే. అందుకే కొన్నిసార్లు తుంబడు ఇలాంటివాళ్లని లెక్క చేయడు.

మరి నర్తోడికి ఆ బలంలేదు వూళ్ళో పెద్దలకీ, గుర్రాల ప్రకాశం నాయుడుకీ ఎలక్షన్స్‌లో గొడవలొచ్చాయి. ఆ వూళ్లో ఒంటరివాడయిపోయాడు. వాడిమాటకి పలికే మనిషిని లేకుండాచేసారు పెద్దలంతాకలిసి. అదినర్తోడుమీద తామాడ సుగ్రీవుకు ఒక బలం.

చేతిలోని కర్రి గట్టిగా పట్టుకుని వెళ్లి నర్తోడుమీద పడ్డాడు.

గొడుగు అడ్డం పెట్టుకున్నాడు నర్తోడు.

నాలుగుదెబ్బలకి ఆ గొడుగు చిరిగిపోయింది. అది చిరిగిపోతున్నప్పుడు గుండె చిరిగిపోతున్నట్టనిపించింది. వాడి ఇల్లులాంటి గొడుగు. తోడూనీడా గొడుగు.

'బాబ్బాబు కొట్టకొట్టకు. తప్పయిపోయింది బాబో. నీ కాళ్లమొక్కతాను సుగ్రీవుబాబో.' అని అరిచాడు. అయినా తామాడ సుగ్రీవు ఆగలేదు. వాడు సన్నగా పొడుగ్గా ఉన్నాడు. ఆ కోపంతో వాడి ముక్కుచరాలు విచ్చుకుని బుసలుకొట్టున్నాయి. వాడు కరవటానికి పైబడే కుక్కలా చూస్తున్నాడు. చేతిలోని కర్రివిసిరి బలంగా కొట్టున్నాడు. దెబ్బలు వొంటిమీద ఒకదగ్గరకాదు. కుడిచేతి ఎముకమీద. వీపుమీద. ఎడం భుజంమీద. మోకాలి పిక్కలమీద.

నాలుగయిదు దెబ్బలు తగిలినతర్వాత అంతవరకూ గొడుగుతో ఆపుకుంటున్న వాడు గొడుగు రక్షించలేదని అటు తుప్పల్లోకి పారేసి బూతులు తిట్టుకుని తిరగబడ్డాడు. ముందు కర్రిందుకుని తామాడ సుగ్రీవు చేతుల్లోంచి లాగిపారేసాడు. వాడి ఏభైయ్యేళ్ల వయసులోనూ ఆ కోపం వాడెరగడు. పిడికిలితో కడుపులో పొడిచాడు. ఒక తన్ను

కసితో తన్నాడు. ఆ దెబ్బలకి తామాడ సుగ్రీవు కిందపడ్డాడు. 'లంజికొడకా. నాకొడుకును సంపినావు. నామీద పడ్డావు. ఇక్కడే గొయ్యితవ్వి నీకు పాతేస్తా(న్రా. అయ్యా బాబూ అని బతిమాల్తే కొమ్ములొస్తన్నాయిరా. ఒరే తామాడు సుగ్రీవు— నీను సస్తే నాకోసం ఏడిసేవోళ్లలేరు. నీవు సస్తే లంజికొడకా నీ పెళ్లంతాడు తెంపుతార్రా. అంతా ఏడుస్తారు' అని మరొక గుద్దు గుద్దాడు.

* * * *

తామాడ సుగ్రీవు వెళ్ళిపోయిన తర్వాత రకరకాల ఆలోచనలొచ్చాయి. వాడు వూళ్లో పెద్దమనుషులకు తప్పక చెప్తాడు. సర్పంచ్ తగువుకి పిలిపిస్తాడు: గుర్రాల పకాశంనాయుడు అంటే ముందే వూళ్ళో పడదు. ఆ కారణంచేత బాగా రెండొందలు దాకన్నా తప్పు వేస్తారు. ఆ రెండొందలూ యజమాని దగ్గర తీసుకుని నర్సోడు చెల్లించాలి. దానికోసం నర్సోడు మరొక సంవత్సరం కంబారితనం చెయ్యాలి. అయినా తప్పు చెల్లించినా వూళ్ళో పెద్దలుగాని. తామాడ సుగ్రీవుగాని ఊరుకోరు. ఏదో ఎక్కడో ఒకసారుతీసుకుని మళ్ళీ కొట్టిస్తారు. గుర్రాల పకాశం నాయుడు తన కంబార్ని కాపాడు కోలేడు. వాడికి వూళ్ళో దిక్కులేదు ప్రస్తుతం.

రాత్రికి తగువుకు పిలుస్తారని తుంబడు. సోములూ. కృష్ణారావు. గడ్డయ్య అందరూ భయపడుతున్నారు దొంగతనంలో వాళ్ల ఉన్నందుకు వాళ్ళకూ తప్పు పడుతుంది. అయితే ఏభైఅరవైకంటె ఎక్కువ తప్పు పడకపోవచ్చు. వాళ్ల ఆ తప్పు చెల్లించటానికి మరొక సంవత్సరం కంబారితనం చెయ్యాలి.

నర్సోడు ఇంకా కోపంలో ఉన్నాడు. తామాడ సుగ్రీవుని నర్సోడు కొట్టున్నప్పుడు చాలా ఆనందం కలిగింది. ఇప్పుడు వూళ్ళో ఏమవుతుందోఅన్న భయం ఒక పక్క పట్టుకుంది. ఆ భయంలో మళ్ళీ తెగింపే వచ్చింది. 'ఆడుమల్లా దీనిమీద ఏమన్నా సేసినాదో— నన్ను పెద్దలంత కలిసి నరికేస్తే నరికేయనీగాని ఆడినుంచను. ఆ లంజికొడుకు నాకొడుకుని తిండెట్టక రోగమొస్తే కూకోనీయకుండా పనులోపెట్టి నలగ్గొట్టి సంపేసినాడు. ఆడు రాచ్చసుడు' అన్నాడు.

దూరంనించి గోనెలాగ్రిముడు తుప్పలచాటునించి తిక్కు మోసుకొస్తూ కనపడ్డాడు.

* * * *

ఆ రాత్రి పెద్దమనుషుల్నించి తగువు కబురురాలేదు. తర్వాతా రాలేదు. పెద్ద మనుషుల దగ్గరకి ఆ తగువే పోలేదు.

కొన్నాళ్ళకి గుర్రాల ప్రకాశంనాయుడు మాత్రం బలపడ్డాడు. నర్సోడు ఇప్పుడూ గొర్రెలుకాపరే అయినా— పసులకాపర్లకీ, వూళ్ళో కంబార్లకీ చెప్పుకునేందుకు బతుకుతున్న కథా వస్తువయ్యాడు.

'రోజు లొక్కలాగ కలకాలం ఉండిపోవురా-'అని చెప్తే- తుంబడు, సోములూ, గడ్డయ్యా, కృష్ణారావు దానికి సాక్ష్యం,

మల్లి మొగ్గలు

సి. యస్. రావు

తూర్పు పడమరలను కలుపుతోన్నట్టు పొడవైనకాలవ. కాలవకీవల ఒడ్డు కాలవ పొడుగునా సిమెంటురోడ్డు. కాలవలో తెరచాపలెత్తుకుని పరుగెత్తే పడవలకి సిమెంటు రోడ్డుమీద పరుగెత్తే కారులు లారీలకి పోటీ.

కడియందగ్గర కాలవకడ్డంగా పెద్దవంతెన. వంతెనదాటితే కడియపులంక బుర్దం కలుకుపోయే ఎర్రికంకరరోడ్డు. రోడ్డుకిరుపక్కలా నర్సరీలు—. రంగు రంగుల గులాబీతోటలు, గుబురుగా పెరిగినచెట్లు, పందిడికి లొంగని పనసకాయలను మోస్తున్న పనసచెట్లు, అరటితోటలు, పందిరిలా అలుముకున్న మామిడితోటలు, యిందర్రి ధనస్సులలా మెరిసే రకరకాల క్రోటన్సులు.

అక్కడే వాటిమధ్య పనిచేసేవాళ్ళకి ఆ వాతావరణం ఎలావుంటుందో తెలీదు గాని, ఎప్పుడేనా అటువెళ్ళినవాళ్ళకి ఆ పరిసరాలు వదిలి రాబుద్ధికాదు.

కడియపులంక దగ్గరౌతోన్నకొద్దీ మల్లితోటలు ముమ్మరంగా అగుపిస్తాయి.

వింగి ముచ్చటపడి ఆకుపచ్చరంగు చీర సింగారించుకొని, నేలమీద వాలినట్టున్న విశాలమైన మల్లితోటది. దట్టంగా మొగ్గతొడిగింది. అక్కడక్కడ విరిసినమల్లెలు చుక్కల్లా మెరుస్తున్నాయి. విరిసిన మల్లెలమీంచివీచే చిరుగాలి సువాసనలను పులుము కుని దాటిపోయేవాళ్ళకి గిలిగింతలు పెడుతోంది. లంకలనుంచి వచ్చిన కన్నెపిల్లల దండు తోటమధ్యనుంచి వున్న గట్టునే నడచి మోటారుషెడ్ దగ్గరకిచేరింది. షెడ్ లోంచి చినకాపు బయటకొచ్చి, 'తక్కినోళ్ళేరే?' అన్నాడు.

'అందరకి మేఁప్ దారంకట్టావేఁటి?' అందిసీత.

'యిది బొత్తిగా పిసిందీర్రి అయిపోతంది. యేవేరత్తనం. తతిమ్మావోళ్ల వత్తన్నారా?' అన్నాడు చినకాపు.

'వత్తారులెండి. ముఁదు మా ముసుఁప్ యిడదీసి మాకిచ్చెయ్యండి. మేఁప్ కోత మొదలెడతాం' అంది రత్నం.

చినకాపు పంచాయితీబోర్డు మెంబరు నరసయ్యగారబ్బాయి దోరవయసువాడు. ఊళ్ళోని అందగాళ్ళలో ఒకడు. చేసేది పొలంపనేఅయినా ఎప్పుడూ మల్లిపూవులాంటి తెల్లని గ్లాస్కోపంచి, మీగడ తరకలాంటి సిల్కుచొక్కా తొడుక్కుంటాడు. బురద

లోకి దిగకుండా వ్యవసాయం చేయించుకునేటంత ఆస్తిగలవాడుగాబట్టి అతనికలా సరిపోతోంది

'సరే పదండే.'అని తోటపొడవునా పదేసి వరసలవంతున ఒకో మునుం ఏర్పాటుచేసి ఒక్కొక్కళ్ళకే యిచ్చాడు.

వాళ్లు మొగ్గలు కోయడం మొదలెట్టారు.

నూనెకు ముఖంవాచిన రుప్పతలలు. చిరిగిన జాకెట్లు, కచ్చాపోసిన మొద్దుపరికిణీలు ఆ మల్లెమొక్కల వరసలమధ్య నడుములువంచి కదులుతున్నాయి. ఆ పిల్లల వేళ్ళు నేర్పుగా గింజలేరుకునే పిచుకముక్కుల్లా ఏపుగా ఎదిగిన మల్లిమొగ్గల్నే కోస్తున్నాయి. ఎదగని పిందిమొగ్గల్ని. విరిసిన పువ్వుల్ని, వదిలేస్తున్నాయి. ఒకోపిల్ల విరిసిన పువ్వుల్ని తుడిమి చింపిరితలలో ముడుచుకుంటోంది. వంచిన నడుం ఎత్తకుండా, ఓ చేయి మోకాలుమీద ఆన్చి, మరోచేత్తో మధ్యమధ్య చింపిరిజుట్టును ఎగదోసుకుంటూ మొగ్గల్నితుంపి వడిలోపోసుకుంటూ ముందుకుపోతున్నారువాళ్ళు. మధ్యమధ్య నడుం లాగి ఒకోసారి నిలబడి వళ్లువిరుచుకుని మళ్ళీవంగి కోత మొదలెడుతున్నారు.

మోటరుషెడ్దగ్గర నిలబడిన చినకాపు, అప్పుడప్పుడు ఒక్కొక్కళ్ళ మునుంలోనే నడచి 'ఏయ్ పిల్లా! మొగ్గలొదిలేత్తన్నావ్. రేపటికీ పువ్వులెందుకూ పనికిరాకుండాపోతాయ్ యిలాకోత్తె నీకు మొగ్గలెక్కువెట్టనుమరి' అంటూ పువ్వులుకోసే పిల్లల్ని గదమాయిస్తున్నాడు. అందులో ఓపిల్ల 'ఎక్కడో ఓ మొగ్గసెయ్ తాటిపోతె, అంతలోకే సణగాలేంటి?'అని బుంగమూతిపెట్టి కోపంగాచూచింది.

'సరిసర్లే కావియ్.'అని ముందుకుసాగాడు చినకాపు.

'యేవేసీతా! నీమునుంప్లో పిందికూడా అపడ్డంలేదు, మొత్తం తుంపేత్తన్నావేటి?'.

'మరే బాగా కోత్తేనేమో మొత్తం తుంపేత్తన్నావా– అంటావ్. మొగ్గవుండిపోతేనేమో వదిలేత్తన్నావా?–అంటావ్. విన్నెపత్తి కట్టుకుంటాదోకాని నీతో యాగటం కట్టవే.'

'ముదిపేరక్క మా బొమ్మలా మాటాడతాది. దీనితస్పాదియ్య.' అని షెడ్ దగ్గర వెళ్ళిపోయాడు చినకాపు.

సూర్యోదయానికి ముందువచ్చి కోతమొదలెట్టిన ఆ పిల్లలు పదకొండు గంటల వరకు పూలుకోసి, షెడ్ దగ్గరికి చేరారు అక్కడ పరచివున్న తడిచాపమీద ఒక్కొక్కళ్ళే వడిలోవి మొగ్గల్ని ఓమ్మరపోసారు. దోసడుదోసడు మొగ్గల్ని తిరిగి ఆపిల్లల ఒళ్ళల్లో పోసాడు చినకాపు. ఆ మొగ్గలట్టుకుని ఎవరి యిళ్ళకువాళ్ళు వెళ్ళిపోయారు పిల్లలు.

మల్లెలకాలంలో యిది నిత్యం జరిగే సంగతి.

సాయంత్రిపువేళ ఒక్కొక్కపిల్లే ఆ మల్లిమొగ్గల్ని ఓ చిన్న జంగిట్లో పోసుకుని వాళ్ళవాళ్ళ వీధుల్లో అమ్ముకుంటారు.

వేసవి రాత్రికి పండువెన్నెల మల్లిమొగ్గలులేనిదే నిండుతనం వుండదేమో. అందుకే ఏ మాత్రిం సాగున్న యిల్లాలైనా ఆ రోజుల్లో మల్లి మొగ్గలుకొని తీరుతుంది.

మల్లిమొగ్గలకోసే ప్రితిపిల్లా ఆ రోజుల్లో అలా ఏభై అరవైపైసలు సంపాదిస్తుంది.

నిజానికి ఆ పిల్లలు కూలీపిల్లలుకాదు. అటు మధ్యతరగతికి అందుకోలేక, యిటు తెగించి కూలిపనికెళ్ళలేక మధ్యలో సతమతమయ్యే మరీ చిన్నసంసారాల్లోని పిల్లలు వాళ్ళంతా. అందుకే ఆ వయసు పిల్లలు. కొంతలోకొంత గౌరవంగా సంపాదించిన ఆ డబ్బుల్ని చన్నీళ్ళకి వేడినీళ్ళులా ఆ సంసారాలు వాడుకుంటాయి. యింకో రెండు మూడేళ్ళు పోతే ఆ పిల్లలే విరిసిన పూవులై పెళ్ళిళ్లు చేసుకుని యింక బయటకిరారు. మగవాడినీడలో తినో తినకో బతుకుతారు.

అందరి పిల్లలాగే సీతా అమ్ముతుంది మల్లిమొగ్గలు. కాని సీత ఎక్కువగా తిరిగి అమ్మనక్కర్లేదు సీత వీధిలోని పెద్దరుగులలోగిలివాళ్ళే సీత మొగ్గలన్నీ కొనేస్తారు. ఆ పెద్దరుగులవాళ్లకంతా వూడుపుచేనేవుంది. వాళ్లకి మల్లితోటలేదు. కాని వాళ్ల పాప ఆ రోజుల్లో రోజూ పూలజడ వేసుకుంటుంది. పాప అమ్మ నిత్యం కనకాంబ్రాలు మల్లెలు కలిపి అల్లిన మాలని శిఖనిండా చుట్టుకుంటుంది.

అప్పుడప్పుడు పాప పూలజడచూసి, తనూ అలాటి జడ వేసుకోవాలెప్పుడేనా అని సరదాపడేది సీత మనసులోనే.

మళ్ళింతలోనే, 'తను జడవేసుకోవడమే నాలుగైదు రోజులకోసారిగాని కుదరదు. ఏ వాసననూనెలు రాయకపోయినా తనది చమ్మకాయలా భారీజడ. దానికే అమ్మ చాలీచాలకుండా రాస్తుందినూని. యింక పువ్వులన్నీ జడలో సింగారించుకుంటె నూనె లావస్తూంది.' అని వయసుకుమించి ఆలోచించుకుని సరిపెట్టుకుంటుంది.

అక్కడికీ మనసుతీరక బాగా విరిసినమొగ్గల్ని ఏ పొట్లాల దారంతోటో బక్కచిక్కిన మాలకట్టి అరుప్పలాంటి తలలోనే ముడుచుకుంటుంది సీత. సీతేకాదు, సీత లాంటి ఆ పిల్లలు చాలామంది అంతే.

తోటదగ్గర చాపమీదపోగైన మొగ్గల్ని బుట్టలలోకెత్తి, పీఠజల్లి దగ్గరలోవున్న పట్టణాలకి, పొరుగూర్లకి బస్సులమీద సైకిళ్ళమీద పంపేస్తాడు చిన్నకాపు.

అలా ప్రితి మల్లెలకాలంలోను పూసినమొగ్గలన్నీ ఆ కన్నెపిల్లల చిన్నారివేళ్ళ కోస్తాయి. ఆ మొగ్గలన్నీ బుట్టల్లో కిక్కిరిసి ఎక్కడెక్కడికో పోతాయి. రాతి విగ్ర

హోల శిరస్సులనో, మెడలనో కొత్త దంపతుల పాన్పుమీదనో, యిల్లాలి సిగలోనో వెలయాలి వయ్యారంలోనో, సరసుని ముంజేతినో వాడి మరునాటికి పెంటపోగులోకి చేరతాయి.

కాని ఆ పూలపిల్లల తలలు నూనెకి పూలకి ఎదురుచూస్తూనే వుంటాయి

ఓనాడు సీతతల్లి రత్తమ్మ తీరుబడి చేసుకొని, సీతను ముందు కూర్చోబెట్టుకుని, తలకినూనెరాసి, చిక్కుతీసి జడలేస్తోంది, జడపూర్తికావస్తోంది,

'అమ్మా,' అంది సీత గారాబంగా,

'ఊఁ,' అంది రత్తమ్మ నూలుతాడు జడ చివరముడివేస్తూ,

'మల్లెపూల జడేసుకోవాలనుందే'

'అయ్యో సోద్దెం, యిప్పుడు పూఁజడెందుకే? పెళ్లనా కార్యంఅనా?'

'పెళ్లికేకాని యేసుకోరేటి పూఁజడ?'

'లేపోతే రోజూ పూలఃజడేసుకుని పల్లకీఎక్కి వూరేగుతావేటి?' అంది రత్తమ్మ జడని సాపుచేస్తూ.

'మరట్టాగైతే మన పెద్దరుగులింటిపాప నాకంటేసిన్నది రోజూ యేసుకోటం లేదేటి? సీత బిక్కమొగం పెట్టిఅంది. రత్తమ్మ మనస్సు చివుక్కుమంది. తలమీద చేయివేసి నిమురుతూ, 'అల్లు సాగునోళ్లమ్మ మీ అయ్య బతికుంటె, నీకూ పూల జడేసేదాన్నే. నువ్వు పూలజడేసుకుంటె నానుమాత్రం సూడాలనిలేకాఅమ్మ. మనకి సాగకకాని' అంది రత్తమ్మ జాలిగా.

అలారత్తమ్మ మాట్లాడడంతో సీత మరికాస్త గారాబానికిపోయి, 'మొగ్గలు నేనే తెత్తానుకాదంటె. ఓపాలు పూల జడెయ్యేమ్మా' అందిగోముగా.

'చూడమ్మా! నీకింకా తెలియనితనం. నువ్వు మొగ్గలమ్మితె రోజూ ఓ అర్ధ రూపాయి డబ్బులొత్తన్నాయి. తమ్ముడు సదువుకుంటానే రోజూ పందాలమాటు గేదని మేపుకొత్తన్నాడు. సేసేది కూలిపనే అయినా, మీ మావయ్య ఎవర్నో ఒకర్నడిగి అప్పుడప్పుడు ఓ మోపుగడ్డదేత్తన్నాడు. ఆ గేదిపాలమ్ముకుంటావుంటె రోజూ రెండో మూడో వత్తన్నాయి. నువ్వట్టుకొచ్చిన డబ్బులు ఆ పాఁడబ్బు పెట్టి యీదినపడకుండా రోజులు చింపుకొత్తన్నాం. నేను కూలిపనికెడదావంటె మనోళ్ళలో ఆ రివాజులేదు, మిమ్మల్నిద్దరినీ నాకొదిలేసి మీ అయ్య ఎల్లిపోయాడు. మీఅయ్యేవుంటె నీకెన్ని ముద్దు ముచ్చట్లు తీరిసేవాడో, పోనీలేఅమ్మా. నీ సరదా నేనెందుక్కాదనాలి! యీ పారి జడేసినప్పుడు నువ్వుతెచ్చుకున్న మొగ్గలలో ఎంత జడొత్తె అంతజడే పల్చగానేనా యేసుకుదువుగాని' అంది రత్తమ్మ. యింటి భారాన్ని కన్నకూతురుతో చెప్పడంలో

అప్పడికే రత్తమ్మ గొంతు జీరవోయింది. కళ్ల చెమ్మగిలి ఓ నీటిబొట్టు సీత భుజంమీద రాలింది.

సీత వులిక్కి పడి వెనక్కి తిరిగి తల్లి ముఖం చూసింది. రత్తమ్మ కళ్ళను పమిటకొంగుతో వత్తుకుంది.

సీత మెల్లిగా అంది— 'పూలజడొద్దులేఅమ్మ. పెళ్ళికే యేసుకుంటాను.'

రత్తమ్మ సీతని గుండెల కదుముకుంది.

* * * *

నాలుగు మల్లిపూల కాలాలు గడిచిపోయాయి. చిన్న కాపు మరో రెండెకరాల మల్లెతోటని ఉన్నతోటకి కలిపాడు. ఓ పంచాయితీ ఎలక్షన్ జరిగింది. పాత ప్రెసిడెంటే మళ్ళీ ప్రెసిడెంటుగా ఎన్నికయ్యాడు.

చినకాపు తండ్రి నరసయ్య యీసారి వైస్ ప్రెసిడెంటు అయ్యాడు. పూలు కోసే పిల్లలు అలాగే అవే చింపిరితలలతో మొగ్గకోతకి వస్తున్నారు. చిన్నకాపుకి పెళ్ళయ్యింది.

సీత వరదొచ్చిననదిలా నిండుగా తయారయింది. వోణీలు వేసుకుంటోంది. జాకెట్టు కాస్తచిరిగినా, బట్టలు బాగోకపోయినా బయటికెళ్ళడానికి సిగ్గుపడుతోంది. తల నాలుగైదు రోజులకోసారి నూనిరాసి దువ్వుకున్నా, రోజూ పైపైన దువ్వెనతో దువ్వు కుంటోంది. యింకా పెళ్ళికాకపోవడంతో అందరితోపాటె పూలకోతకి వెడుతోంది. కాని సీత యీడువాళ్లు కొంతమంది పెళ్ళిళ్ళై అత్తవారిళ్లకి వెళ్లిపోయారు. సీతతో ప్రస్తుతం ఎక్కువమంది కొత్తపిల్లలు మొగ్గకోతకి వస్తున్నారు.

రత్తమ్మకి యిప్పుడు రెండు గేదెలున్నాయి. ఒకయింట పుట్టిన పెయ్యని మేపి గేదెనిచేసింది రత్తమ్మ. ఆ గేదెని నాలుగొందలకడుగుతున్నారు. ఆ గేదెనమ్మి సీత పెళ్ళిచెయ్యాలని రత్తమ్మ కలలు కంటోంది. సీత మేనమామ సంబంధాలు వెతుకు తున్నాడు.

పూలజడ వేసుకోవాలన్న సీతకోరిక సీతవయసుతోపాటు పెరుగుతూనేవుంది. అప్పుడప్పుడు పది మల్లెమొగ్గలు బంతికట్టుకొని జడలో పెట్టుకొంటోంది సీత. కాని తల్లిని పూలజడ వేయమనిమాత్రం ఆ రోజు తరువాత ఎన్నడూ అడగలేదు. ఇప్పుడు మరీ ఖర్చు ఎక్కువయింది. తమ్ముడు పక్కూరి హైస్కూల్లోచేరాడు. వాడికి నెల నెలా జీతం కట్టాలట. దాంతో కోరికను గుండెల్లోనే దాచుకుని అదునుకోసం ఎదురు చూస్తోంది.

ఓనాడు సీత మేనమామవచ్చి, రత్తమ్మతో ఏదో పెళ్ళిసంబంధం గురించి చెబుతున్నాడు. సీత తలుపుచాటునుంచి వింటోంది.

'కుర్రోడు దుక్కలావుంటాడు. టాక్టరు డ్రైవరు. నెలకి ఓవందదాకా సంపాదిత్తాడంట. తల్లిలేదు. తండ్రి ముసలోడు. యింట్లో ఆడదిక్కు లేదు పాపం. పెళ్ళి కాగానే కాపరానికి పంపెయ్యాలన్నారు. మన పక్కూరే. అది రావాలన్నా నువ్వెల్లాలన్నా నాలుగడుగులు నాకైతే బాగానచ్చిందీ సంబంధం.' అన్నాడు రత్తమ్మ తమ్ముడు.

'నీకునచ్చితే నాకూ నచ్చినట్టేరా' అంది రత్తమ్మ.

పెళ్ళికొడుకు ఎలావుంటాడో అనుకుందిసీత. అంతలోనే 'మావయ్యకు అన్నీ తెలుసులే. అంత బాగోని వాడిని చూడడు.' అని సరిపెట్టుకుంది.

ముహూర్తం పెట్టారు. పెళ్ళింకా నాలుగు రోజులుంద సీతని పెళ్ళికూతుర్ని చేసారు. మేనమామ కొత్తపరికిణీ, ఓణీ జాకెట్టు కుట్టించి పట్టుకొచ్చాడు. ఆ కొత్త బట్టల్లో కొత్త పెళ్ళికూతురు సీత మరీ అందంగా అగుపిస్తోంది ఆ రోజున మాత్రం సీత పూలకోతకెళ్ళలేదు. మర్నాడు పొద్దున్నే సీత మొగ్గకోతకి బయలుదేరింది.

'ఎక్కడకే!' అంది రత్తమ్మ.

'మొగ్గకోతకి'

'కొత్తపెళ్ళి కూతురువై కొత్త బట్టలతో పొలంమీదకెళ్లకూడదమ్మా'

'ఎల్లుండికి మొగ్గడుగుదావనమ్మా'.

'ఔనమ్మా. నేమరిసేపోయాను. పోనీ ఎల్లిరా. ఎల్లి, పెళ్ళికుదిరిందండి, పెళ్ళికి మీరూ రావాలి అనిసెప్పి నాలుగు దోసిళ్ల మొగ్గ పెట్టమనడుగు, నీకు పూల జడకి సరిపోత్తై'.

'అలాగేనమ్మా' అంటూ లేడిపిల్లలా పరుగెత్తింది సీతతుళ్లతూ.

మల్లెతోట గట్టున పిల్లలతో కలసి నడుస్తుంటె, ఆ పిల్లలందరికంటె తనే పెద్దదానిలా అనిపించింది సీతకి. ఎందుకో సిగ్గుముంచుకొస్తోంది షెడ్ దగ్గర చినకాపు మడతమంచంమీద పీటం వేసుకుని కూర్చున్నాడు అతన్ని కన్నెత్తిచూడాలన్నా, పలకరించాలన్నా సిగ్గేసిపోతోంది సీతకి. పిల్లలంతా తోటలోకిదిగారు. కోతమొదలెట్టారు. సీత యింకాదిగలేదు. ఓణీ కొంగును పళ్లతో పట్టి నములుతూ చినకాపుముందే నిలబడింది.

'ఏ'టేటి కత? మరీజోరుగా ముస్తాబయావ్' 'అన్నాడు.

నాకు— నాకు పెళ్లి

'ఎప్పుడే?'

'యింక రెండ్రోలుంది.'

'అదాసంగతి. ఎటాగ్రియింత టింగురంగుగా వుందనుకున్నాను. ఇంతకా పెళ్లి కొడుకు దేవూరంట?'

'ఏమోనాకుతెల్దు.' అనితూనీగలా తోటలోకిదూకింది. మొగ్గల్ని చలాకీగాతుంప సాగింది.

వంగి మొగ్గల్ని ఎంతోనేర్పుగా మునివేళ్లతో కోస్తూన్న సీతని ఒక క్షణంపాటు రెప్పార్పకుండా చూసాడు చినకాపు. ఎప్పుడూ అల్లరిపిల్లలా అగుపించేసీత, ఆ రోజు కొత్తగా, విరిసిన పువ్వులా అగుపించిందతనికి కొత్త కొత్త కోరికలు పూరి మనసు తుమ్మెదల్లె 'ఝుం'మ్మంటోంది. చేతికందిన ఖజానా యింకా రెండు రోజుల్లో పరారీ అయిపోతున్నట్లనిపించింది చినకాపుకి.

మధ్యాహ్నపువేళకి మొగ్గకోత అయిపోయింది పిల్లలంతా మొగ్గపట్టుకొచ్చి చాపమీద దిమ్మరపోసారు. ఆఖరుకిసీతా దిమ్మరపోసింది సీత ఆ రోజున చాలా మొగ్గకోసింది.

'మొగ్గ తుంపటంలో చేయి బాగాతిరిగినట్టుంది.' అన్నాడు చినకాపు ఏదోఒకటి అనాలన్న సరదాతో.

'ఆరేల్లబట్టి కోత్తుంటే తిరక్కేమవుద్దేటి?' అంది సీత ముఖంమీద పడుతున్న ముంగురులను వెనక్కినెడుతూ.

మొగ్గకోసిన పిల్లలందరికి దోసెడు దోసెడు మొగ్గపెట్టాడు. ఒక్కొక్కపిల్లే యింటిముఖంపట్టింది, సీతమాత్రిం యింకా నిలబడేవుంది

'ఏం యింకా నిలబడ్డావు?' అన్నట్టు చూసాడు చినకాపు.

'నా పెళ్లికి ......' అని సిగ్గుపడింది సీత.

'నే రావాలా?'

'మాలాటోళ్ళ టికి మీలాటి పెద్దోళ్ళెందుకొత్తారేటి?'

'పిలిత్తే తెలుత్తాం। వత్తారో, రారో.'

'సరే అదీయిత్తాను. ఆవల్లుండిపెళ్ళి. తప్పకుండారావాలి.'

'ఓ.'

'మంనాకు పువ్వులుకావాలి.' నేలని బొటనవేలుతోరాస్తూ అడిగిందిసీత.

'యిరిసినకాడికి కోసుకో.'

'అబ్బ మరిసిపోయి అన్నానులే. అదేమొగ్గకావాలి.'

'దోసెడు వాళ్ళోపోసుకుని అప్పుడే పరగడపా?'

'యిప్పుడుకాదు ఎల్లుండి సందాలకి.'

'అయ్యాల కోతకొత్తావుగ పెడతాలే.'

'పెడతం అంటె మా మూలు దోసెడుకాదు, నాలుగుదోసెళ్ళదాకా పెట్టాలి. కావాలంటె డబ్బులిచ్చేత్తానులే. కాదంటె నేనీపూరువదిలేసి ఎల్లీలోగా నాలుగురోజులు వట్టినే కోసిపోతాను.'

'అదిసరేలే అంత మొగ్గ ఎందుకే.'

'పూలజడేసుకోవాలని ..' జడని వేలికి మెలిపెడుతూ అంది సీత. మొగ్గలొదిగిన సిగ్గు విరబూసినట్లు నవ్వేసింది.

'అదాసంగతి! వట్టిపూలజడేంకర్మే? నీకుకావాలంటె పూలజడ, పూలజాకెట్టు, పూలచీర, పూలపానుపు- అన్నిటికి సరిపోయేటన్నిపూలు యిత్తాను సరేనా' అంటూ ఒళ్ళువిరుచుకి, ఒక్కడుగు ముందుకేసాడు, బుగ్గమీద చిటికవేయబోయేడు చినకాపు చనువుకొద్ది. చనువు రంకెవేస్తే సిగ్గు తుర్రుమంది

వయసొచ్చిన సీతకి అప్పటికే సిగ్గుతో బుగ్గలెర్రబడ్డాయి. చేతికందకుండా పరుగెత్తింది. చినకాపు నవ్వుకుని, కోరికల్ని గుటకలుమింగి మొగ్గని బుట్టలకెత్తించడంలో మునిగిపోయాడు.

* * * *

అనుకున్న ప్రకారం పెళ్ళిరేపనగానూ మొగ్గకోతకొచ్చిందిసీత అందరితోపాటు మొగ్గకోస్తోంది. మనసునిండా తీయని ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి కావడంతో చేయి ముందుకు జరగడంలేదు.

అంతలో షెడ్ దగ్గరనుంచి 'యీయాల కొత్త సిన్నమొగ్గలుకూడా వదలకుండా కోసెయ్యండే' అని అరిచాడు చినకాపు.

'నాకు మొగ్గలెట్టటంకోసవే సిన్నమొగ్గలుకూడా కోసెయ్యమంటున్నాడు సిన్నకాపు మంచోడు.' అనుకుందిసీత. ఓసారి నడుంఎత్తకుండానే ఓరగాచూసింది అతన్ని. అదే సమయానికి అతనూ చూసాడుసీతని. కళ్లుకలసి నవ్వుకున్నాయి యిద్దరూ చెరో రకంగాను అర్థంచేసుకున్నారు ఆ నవ్వుని.

మొగ్గకోత పూర్తయినతరువాత అందరూ మొగ్గంతా చాపమీద దిమ్మరపోసారు. ఇంక చినకాపు వాళ్ళందరికి దోసెడు దోసెడు మొగ్గపెట్టడమే తరవాయి.

'ఇయ్యాల మీకెవరికీ మొగ్గలెట్టను. మీఅందరికి డబ్బులిత్తాలెండి రేపు.' అన్నాడు చినకాపు.

'నాకోసమే యీళ్ళందరికి మొగ్గలెట్టకుండా డబ్బులిత్తానంటున్నాడు. ఓ బుట్టే యిత్తాడేమోనాకు.' అనుకుంది సీత.

ఇంతలో రోజా మొగ్గ బుట్టలకెత్తె నౌకర్లుకాకుండా, ప్రెసిడెంటుగారి నౌకర్లు వచ్చారు.

'వచ్చారా! యీయాల్టిమొత్తం మొగ్గది. అట్టుకెళ్ళండి.' అన్నాడు చినకాపు.

ప్రెసిడెంటుగారి నౌకర్లు మొత్తం మొగ్గని బుట్టల్లోకెత్తుతున్నారు.

సీత నోరుమెదపకుండా చూస్తూ బొమ్మలైనుంచుంది. మొగ్గలిస్తానని దగాచేసినందుకు చినకాపునిచూస్తే వళ్లు మండిపోతోంది సీతకి.

'ఎన్నాళ్లబట్టో పువ్వులజడకోసం సరదాపడ్డాను. అడిగినదానికంటే ఎక్కువ మొగ్గ యిస్తానని మాటిచ్చావు. చివరకిలా మాటతప్పుతావా? నువ్వు రెండునాలికల మనిషివి.' అని ముఖానకొట్టినట్టు అనాలనుకుంది సీత.

వచ్చినవాళ్లు పూల బుట్టలట్టుకొని వెళ్ళిపోయారు.

అంతలోనే చినకాపు సీతనిచూసి, 'అయ్యో! నీ సంగతే మరచిపోయానే. ఆతల పెసిడెంటు గోరమ్మాయి పెళ్లని కబురొచ్చింది. వున్నమొగ్గంతాంపమన్నారు; పూల కారు కడతారట, పూలమండపంకడతారట, మరికాదంటె బాగోదుసూడు. ఈ పాలెప్పుడేనా పట్టుకెడుదువుగానిలే' అని వెళ్ళిపోయాడు చినకాపు.

'మాలాంటోళ్ల కిచ్చిన మాట తప్పినాపరవాలేదులే. పెద్దోళ్ళకిచ్చిన మాట తప్పకు. మా దేవుంది? మా కోరికలదేవుంది? సిన్నోళ్ళం.' అనుకుని సీత దిగాలుపడి, అడుగులో అడుగేసుకుంటూ యిల్లుచేరింది పట్టిచేతులతో.

పెళ్లి జరిగిపోయింది. యివతలవీధిలో సీతపెళ్లి, అవతలవీధిలో ప్రెసిడెంటు గారమ్మాయిపెళ్లి ఒకే ముహూర్తానికి జరిగిపోయాయి. అరోజున వూళ్లోని పువ్వులన్నీ ప్రెసిడెంటుగారింటికే వెళ్లాయి.

సీత సాదాజడ వేసుకుంది. సాదాపల్లకీలో పెళ్లికొడుకులో కలసి ఎక్కింది. యిరుగుపొరుగు పిల్లలు సరదాపడి, సీతముందు కొందరు పెళ్లికొడుకుముందు కొందరు కూర్చున్నారు. పల్లకీముందు వూళ్లోని భజంత్రీలు, పిల్లసనాయి, డప్పులమేళం వున్నాయి. రెండు పెట్రోమాక్సులైట్లు— పల్లకిదగ్గరొకటి డప్పులమేళందగ్గరొకటి పట్టుకుని వాళ్లవాళ్లే నిలబడ్డారు.

పెళ్లిజరుగుతున్నా మనసులోని తీరనికోరిక, జరిగిన అవమానం సీతమనసుని కుమ్మరిపురుగులా దొలుస్తూనేవున్నాయి.

వాళ్లవీధంతా వూరేగి పెద్దవీధిలోకి వూరేగింపు మళ్లబోతోంది. 'ఆగండి. యీతసెట్టు కాలుతున్నారు.' అని అరచారెవరో.

ఆ వీధిలోని జనంఅంతా- అంతరాత్రివేళా బయటకొచ్చి కాలుస్తూన్న బాణా సంచానిచూస్తూ నిలబడ్డారు. వీధిలో కటాకిటలకి కట్టేసున్న దూడలు బెదురుతూవుంటే, రైతులు దూడలదగ్గరనిలబడి వాటిని దువ్వుతూ బాణాసంచా కాల్పుని చూస్తున్నారు.

పల్లకీఎత్తుకున్న ఓ బాకలి 'పెసిడెంటుగోరూరేగింపనుకుంటానురా సానాపొడుగుం దాదిరా. ఇప్పడప్పుడే తెవల్దు' అన్నాడు వెనకవాడితో.

వెనకవాడు పల్లకీబొంగుకి బోటుకర్రని బోటుపెట్టి, చెవిలో చుట్టతీసి తాపీగా ముట్టించాడు.

బాణాసంచాముందుకు కదిలింది. తరువాత డప్పులమేళం. –ఢంకానౌబత్ఖానా– సామర్లకోట బ్యాండ్ మేళం– సాయబు డోలుసనాయి– దాని తరువాత మురమండ బోగంమేళం.

మేళంముందు చినకాపు అగుపించాడు సీతకి

'కిలోళ్ళ పెళ్లిలోకలోడు. నా పెళ్లికెందుకొత్తాడులే' అనుకుంది సీత.

తరువాత పూలకారు అగుపించింది. వూరేగింపు పొడవునా అదోపది. యిటో పది గాస్లైట్ల నెత్తుకుని తూర్పుజనం. ఆ వెలుగులో పూలతోనిండిన పూలకారులో ప్రెసిడెంటుగారిమ్మాయి సూటువేసుకుని బొమ్మలాకూర్చున్న పెళ్ళికొడుకు అగుపించారు సీతకి.

'కారులోవాళ్లెక్కడా అగుపించకుండా పూలతోరణాలు కప్పేసాయి కారుని.' అనుకుంది సీత.

'ప్రెసిడెంటుగారిమ్మాయి ఎక్కినకారు కాబట్టె, పాత యినుపముక్కే అయినా పూలతోనిండిపోయింది నేను మనిషినే అయినా అకారు పాళంచేయలేదు. నేను పువ్వుల్లో పుట్టాను. పువ్వులమధ్య పెరిగాను, తిరిగాను. రోజూ పువ్వులుకోసాను. అందుకే పూలకికూడనే వెగటైపోయాను. పూలకి నోచుకోలేదు. పూలజడకోరిక తీరనేలేదు. లేనోల్లయింట్లోపుట్టిన మనిషికంటె వున్నోళ్లెక్కినకారే నయం. యిదె న్నాళ్లో?' అనుకుంది సీత.

ప్రెసిడెంటుగారమ్మాయి వూరేగింపు వెళ్లిపోయింది. వీధంతా చీకటయిపోయింది. అంతా మసగ మసగ్గా అగుపించింది సీతకి- కొంతసేపు. తరువాత తన వూరేగింపు వెలుగులోనే అంతనీ స్పష్టంగా చూడగలిగింది.

రాక్షసి

కమలాగిరి

"ఏం అప్పుడే అయిపోయిందా సంబారం. థు, బోగబడోడా! సన్యాసోడా! ఎప్పుడూ యిండ్లిండ్లు బసవరాలాకట్ల తిరుగుతుంటాడు మీ వంశమే అట్లాది. ఎప్పుడూ ఎఱవలకి శాకిరీసేయడమే. యిండ్లిండ్లూ తిరిగేకన్నా రాత్రి వానకి మిద్దిమీద అంత బొంగపడిందిగదా యింత మన్ను తెచ్చిపోసేవాళ్లులేరు. మీయప్ప ఖజానా వుందనికో యింటివా బాడుగ బండిపెట్టి తోలించేకి. మీరేం మొగోళ్లు అయితేగదా సంసారం కాబట్టేది? ఇగో పోయినాడుసూడు మీనాయిన తెల్లారుజాంకాడ ఎఱవశాకిరి చేసేదానికి, వానికి దుడ్లతో అవుసరముంటే వాడేపోయి తెచ్చుకుంటాడు, ఏం మనపని యిడిసిపెట్టి పోవల్లని ఆరేడుమైళ్లునడిచి. ఏం వాళ్ళ మొగలాయి దర్బారూని? యిట్ల యిట్ల షవ్వమ్మా షవ్వమ్మాని ఉంటే నెత్తికెక్కి కూచుంటారు. ఇగో పొద్దున యింటి పైకి వచ్చిన్రిసూడు మీసాలున్న మొగోల్లాకట్ల, కోడి మనం తిన్నామంటా. లంజా కొడుకులు. మనకోళ్ళే సింపించుకొని మల్ల మనపైకేవచ్చినారు. వాళ్ళు అన్ని అంటా వుంటే వొక్కమాటైనా మాట్లాడినావా! సిగ్గు శరమూ, మానము పాణము ఉంటేగదా! మీరేం మొగాళ్ళయితేగదా! రేపొద్దున్న అమ్మగారివి; పెండ్లాండ్లని పబ్లీకుగా పక్కలోకి యీడ్చుకునాన్రి అడిగే లంజాకొడుకులు కాదుమీరు. థు. ఇంక యియ్యప్పకి పెండ్లాం కావాలంట పెండ్లాం. దాని బతుకు నాశనం చేసేదానికి. పెండ్లాలు లేసిపోయినారంటే లేసిపోరూ మల్ల. ఎంతో వైనంగా సంసారం గడుపుకొని యింత వెనకేసుకుంటూ వస్తే అంతా ఎఱవలకి ముండమోయించాడు. 'మంచోడురబ్బా' అంటేసాలు. ఉబ్బేది యిచ్చేది. ఉబ్బేది యిచ్చేది. యిప్పుడుసూడు తామది ఎంగిలి ఉముసుమన్నా ఉముస్తారేమోసూడు. ఆకిరీకి ముసలి ముప్పున ఎంతకష్టం తెచ్చిపెట్టినాడు సూడు" అంటూ రొట్టె వేసేటప్పుడు పెనుముమీదపడిన కన్నీరు వేడి పొగలను రేపింది. "ఉ, గతుకు గతుకు పాపం ఊర్లోళ్ళపని నిలిచిపోదూ, మొగాడయినంకా రోషంగా బతకాలి. బతుకుతుంది గద్దా. కాకి."

అంతలో ఒకడు ఇంట్లోకి దూరాడు, వానివెంట గుంపొచ్చింది, "తుడుగు లంజా! మా కోడినేతిని మమ్మల్నే తిడుతావా?" అంటూ ఆమెని బర్రినియీడ్చి దబ దబ కొట్టాడు.

చెప్పకుండా ఉండలేను. చెబితే అసహ్యం. అశ్లీలమంటూ నిజాన్ని కప్పిపుచ్చమంటారు మీరు. నేనలా చేయలేను. నిజాన్ని దాచలేను

ఆమె వాని ఇజాలను (మర్మాంగాలను) చేతులతో బిర్రిగా పట్టుకుంది. వాడు విలవిల తండ్లాడుతున్నాడు. ఆమె చేతులుతీయాలని గిచ్చాడు. కొరికాడు వాని ప్రాణాలు పోయేవరకు చేతులు బిగువు సడలలేదు. సీగ్గిచచ్చాడు. అంతా ఆమెను 'రాక్షసి' అన్నారు.

కావచ్చు. మనిషిగా బ్రతకటమే రాక్షసత్వం అయితే ఆమె రాక్షసే.

బూర్జువా సమాజంలో క్రియాశూన్య వేదాంతం చెప్పేవాడు కేవలం ఆలోచనలలోనే జీవిస్తూ, భౌతికసత్యాల్ని యధార్థజీవిత స్వభావాన్ని, మానవుడి సామాజిక సంబంధాల్ని ఎరుగనివాడై వుంటాడు లేదా పచ్చిమోసగాడూ, స్వార్థపరుడూ, సోమరిపోతూ అయినా అయి వుంటాడు.

—విజయ్

వచ్చే సంచికలో

కథలు:

చైతన్యం ఆర్. వి. ఆనంద్.

జనం శ్రీపతి

తెలుగులో సీరియల్ నవలలు

—పురాణం సుబ్రహ్మణ్య శర్మ

దాశరథి రంగాచారి నవల మోదుగుపూలు

సమీక్ష 'రహి'

వచ్చే సంచిక నుంచి

సీరియల్ సమీక్షావ్యాసం

భారతీయ తత్త్వ శాస్త్రము — ఒక పరిశీలన

—నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు

'తీర్పు': సామ్యవాదవాస్తవికత

లక్ష్మీపతి

సేర్పుగల చేతులకూ చతురమైన బుద్ధులకూ మధ్యగల వైషమ్యమే మానవజాతి వ్యథాకలిత బాధాభరిత జీవితానికి మూలకారణం.

—మార్క్స్

సాహిత్యపు రాజకీయతత్వం (Partyness of Literature) అనే మాటవింటే. సాహిత్యంవేరు రాజకీయాలువేరు అనే 'బుద్ధిజీవులు' చాలామంది ఉలికిపడవచ్చు కాని ఈ విషయాన్ని శ్రామికలోకపు జ్యోతి లెనిన్ స్పష్టంగా ఊహించాడు. దాన్ని కార్యరూపంలో చూపడానికే స్టాలిన్, జ్డానోవ్ గోర్కీలు ఈ విషయానికి మరో అడుగు ముందుకు ఊహచేశారు. దాంతో సోవియట్ రష్యా రచయితలను ముఖ్యంగా ఒక విషయాన్ని దృష్టియందుంచుకోవాలని కోరింది. ఆ కోరిక నిజానికి కోరికకాదు; ఒకవిధంగా ఆంక్ష జనాళిలో ముప్పాతిక మువ్వీసంపైభాగం జ్ఞానానికి జ్ఞానోదయం కలిగించి సరియైన పంథాలో నడిచేట్లుచేసే ఆదేశాన్ని ఆంక్ష అనడంకంటె కోరిక అనడమే సమంజసమని నా అభిప్రాయం. ఇది 1932లో జరిగింది. ఈ కోరిక వివరణే సామ్యవాద వాస్తవికత (Socialist Realism).

దీన్ని స్థూలంగా ఈ విధంగా నిర్వచించవచ్చు: విప్లవ మహాయాత్రలో వాస్తవాన్ని వాస్తవికంగాను, చారిత్రిక నిదర్శనాత్మకంగాను, సైద్ధాంతిక పునర్నిర్మాణ కార్యక్రమాన్నికూడా కలుపుకొని. శ్రామికులకు సామ్యవాదతత్త్వపు జ్ఞానం కలిగించేదిగాను, సాహిత్యంలోను, కళల్లోను చిత్రించే మౌలికపద్ధతే సామ్యవాద వాస్తవికత.'[1] దీని దృష్ట్యా సాహిత్యకారుడు సమాజానికీ, రాజకీయాలకూ అతీతంగా కాని వాటిని నిరసించి కాని రచనలు చేయడానికి వీలుపడదు. ప్రజాజీవితాన్ని—పరాన్నభుక్కులదికాదు. కష్టజీవులది—మెరుగుపరచే విధంగా మాత్రమే రాయాలి. ఏం. కోరిక అన్యాయంగా ఉందా? వ్యక్తి స్వేచ్ఛ దెబ్బతింటుందా? అందరికీ మేలుకలుగజేయటానికి 'సొంత లాభం కొంతమానుకో'మని కోరడం లేదా ఆంక్ష విధించడం పాపమా? ఈ విషయంలో పాపపుణ్యాల ప్రసక్తి ఉచితానుచితాల సమస్యా సవ్యంగా పరిష్కరింపబడడం రచయితకు సమాజంపట్ల, దగాపడ్డ, పడుతున్న, పడబోయే తమ్ముళ్ళపట్ల ఏమైనా

కాళీపట్నం రామారావుగారి 'యజ్ఞం' కథా సంకలనంలోని ఒక కథ

1. Everyman's Encyclopaedia

బాధ్యత ఉందా? ఉంటే దాని స్వరూప స్వభావాలెలాంటివి అనే విషయాలపై ఆధారపడి ఉంది. ఈ వ్యాసంలో పైకోరిక సవ్యమైనదేననే గట్టి నమ్మకం, కనీసం సరియైన కోణంలో అర్థంచేసుకోగల సానుభూతిగలవారినే సంకేతిస్తున్నాను. దాన్ని వ్యతిరేకించేవారితో — వీరికి సాహిత్యంలో ఇంతవరకు పేరు లేదనుకుంటాను. నేను 'రచకు'లంటాను — ఎలాంటి ప్రమేయమూ లేదు. (ఇక్కడొక విషయం గుర్తుంచుకోవాలి. ఈ 'రచకులు' కూడా తమకు 'సమాజం' పట్ల బాధ్యత ఉందని నమ్ముతారు. జనాభాలో ముప్పాతిక ముప్వీసంభాగానికి సరిపడే ఆస్తులను సేకరించిన ట్రిస్టీల సమాజమది. ఆ 'అసామాన్యుల' సమాజ శ్రేయస్సే వారి ధ్యేయం).

సామ్యవాదవాస్తవికతదృష్ట్యా సాహిత్యంలో ప్రతిఫలించాల్సిన అంశాలేవి అనే విషయాన్ని గోర్కీ చాలవిశదంగా చెప్పాడు. సాహిత్యం జీవితానికి దర్పణమనేది చాలపాతకాలంనుండి వాడుకలోఉన్న అభిప్రాయం. అద్దంలో ముఖాలు, ముఖాల్లోని ముడతలు, మొటిమలు, అందం అనాకారం అన్నీ కనబడతాయి. ఇవి మాత్రమే చూపితే అద్దం కర్తవ్యం నెరవేరినట్లుకాదు. ఈ కోణంలో అనేకానేక ముఖాల్లోదైన్యం నిరాశ ముఖాల ఇష్టాయిష్టాల ప్రమేయంలేకుండానే బలవంతంగా చోటుచేసుకున్నాయి. ఇందుకు అనేకమైన బాహిరకారణాలున్నాయి. సమాజ శ్రేయస్సుకోరే రచయిత సాహిత్య దర్పణం అవినాశకరబాహిరశక్తుల నగ్న రూపాలను ప్రతిబింబించాలి. వాటి నిర్మూలనా విధానాల అన్వేషణకు తోడ్పడాలి. గోర్కీకి అద్దమంటే ఉన్నఅవగాహన ఇది[2] ఈ వినాశకరశక్తుల నిర్మూలనకు నడుంకట్టిన విప్లవకారులకి తీవ్రరూపంలో వాటి సత్వరపతనానికి తోడ్పడడమే నిజమైన సాహిత్యం కర్తవ్యం.[3] ఇలాంటి ధ్యేయాల చక్రాలతో బయల్దేరిన సాహిత్య మహారథాన్ని కూలదోయడానికి కుట్రలు (Conspiracy)[4] జరిగినై, జరుగుతున్నై. అయినా అవన్నీ ఈ సాహిత్య రథ చక్రాలకింద నలిగి నజ్జునజ్జయినవి. This chariot will go on for ever unperturbed and undaunted.

ఇక సాహిత్యకారుడు రాజకీయాలకు కట్టుబడి ఉండాలాలేదా అనేవిషయం. ఈ విషయంలో ఝాఁపాల్ సార్త్రెకు చాల ఖచ్చితమైన నిర్ద్వంద్వమైన అభిప్రాయాలున్నై! రాజకీయాల్లో జోక్యం కలుగజేసుకోవడం రచయిత మహత్తరబాధ్యత. అబద్ధత (Degagement) అనేది కేవలం స్వాతంత్ర్యాన్ని పరిహసించడమే. వాస్తవానికి అది ఒకవిధంగా స్వాతంత్ర్యన్నుండి దూరంగా పారిపోవడం లాంటిది'[5] ని

2 On Literature P. 204
3 ibid P. 171
4 March of the Conspiracy-Gopal Mittal
5 Sartre-Maurice Cronston p. 14

ఆయన దృఢవిశ్వాసం. బాధ్యతాయుతుడైన ఏ రచయితా ఈ విషయాలనుకాదనలేడు.

మన తెలుగు సాహిత్యంలోనూ ఈ విషయాన్ని ఇంత గట్టిగానమ్మి ఆ ఆశయాలనుగుణంగా రాస్తున్న రచయితలు అసంఖ్యాకంగా కాకున్నా కొందరైనాఉన్నారు. వారిలో కాళీపట్నం రామారావుగారిది అనన్యమైన స్థానం. తోడిరచయితలు (రచకులు కారు) గొప్ప కథకులన్నారు; సెంటిమెంటల్‌గా పుణ్య పురుషులన్నారు; దేముడు మానవుడైతే అప్పుడు అతనైనాసరే కాళీపట్నం రామారావుగారికి నమస్కరించి తీర వలసిందేనన్నారు. ఇంతకంటేగొప్ప, హృదయపూర్వకమైన tribute ఏ రచయితకైనా ఇదివరలో యివ్వబడిందా?!) Sentiment అన్నాను అయినా ఇది చాల noble Sentiment., ఒక మానవుడికి మరో మానవుడిచ్చే హృదయపూర్వకమైన tribute. దాన్ని నేను గౌరవిస్తున్నాను.

రామారావుగారి కమిట్‌మెంట్‌కు వారి రచనలే ప్రత్యక్ష నిదర్శనం. రాత పూర్వకమైన స్టేట్‌మెంట్లు లేనంతమాత్రాన వారి కమిట్‌మెంట్‌ను శంకించ నవసరం లేదు.

వీరికథల్లో చాలభాగం పతితుల, దగా పడ్డతమ్ముల, అట్టడుగునఉన్న జాతుల జీవనం దర్శనమిస్తుంది. వీరువాళ్ల జీవితాన్నే వస్తువుగా ఎన్నుకోవడం సమంజసమూ, విశిష్టమూ, వాంఛనీయమూ అయినపని. Truth and wisdom spring from below (సత్యమూ వివేకమూ అట్టడుగునుండి పుట్టుకొస్తాయి) అంటాడు గోర్కీ.[6] 'యజ్ఞం' కథల్లోని యజ్ఞం, ఆర్తి ఇందుకు నిదర్శనాలు. ఈ రెండు కథలను గురించీ మిత్రుడు శ్రీపతి విపులమైన సవిమర్శ సమీక్షలు చేశాడు. ఈయన 'తీర్పు'ను తడమ లేదు కుటుంబరావుగారుకూడ దీన్ని గురించి విపుల వ్యాఖ్యానమేదీ చేయలేదు. జీవితసత్యాలు ఎంత చిన్నవాటిలోనైనా కనిపిస్తాయన్న నా నమ్మకాన్ని ఈ కథ బల పరుస్తున్నదన్నారు. ఈ సత్యాన్ని గ్రహించజాలని ఒక వారపత్రిక సమీక్షకుడు కేవలం కథ 40 లేక 50 పుటల వరకు సాగలేదనే కారణంతో చాల చులకనగా చూశాడు దీన్ని. దాదాపు రామాయణంలో పిడకల వేటలాంటిదనే భావాన్ని వెలి బుచ్చాడు, బహుశ మిత్రునికి గ్రీకునాటకాల కుండవలసిన 'of certain magnitude' అనే లక్షణంపై గురికాబోలు!

రచయిత సామ్యవాద వాస్తవికతదృష్ట్యా శ్రమజీవులకు 'తెలివి'గలవారు, డబ్బు గలవారు తమ శ్రమశక్తిని ఎట్లా దోచుకుంటుందీ చూపాల్సిఉంటుంది. ఏదో అలౌకిక శక్తిమూలంగాకాక తమ శ్రమశక్తివల్లనే ఈ లోకం లోకమంతా నిలువగలిగి ఉందనే

---

6 On Lit. P. 170

సత్యాన్ని తెలుసుకునేట్లు చేయాలి. ఈ బాధ్యత కా.రా. గారు 'తీర్పు'ద్వారా ఎట్లా నెరవేర్చారో పరిశీలిద్దాం,

'తీర్పు'ను ఒక చిన్నపాటి Allegory అనవచ్చు. ఇందులోని పాత్రలు కేవలం వ్యక్తులుకాక ఆయావ్యక్తులు వ్యక్తంచేసే అభిప్రాయాలున్న వర్గాలకు ప్రతినిధులు వాళ్ల మనస్తత్వాలేకాక వాళ ఆకారాలుకూడా ఆ వర్గ వ్యక్తిత్వాన్ని చాటుతై

ఈ కథలో సమస్యకు కీలకపాత్రలు రెండు. పెద్దవాడు 'ఐడియా'ఇచ్చినవాడు- తెల్లగా, నాజూగ్గా, స్టయిలుగా ఉంటాడు. కళ్లలో కొంత 'తెలివి'కూడా కనబడుతుంది. శ్రామికవర్గానికీ ఇతడికీ ఎలాంటి సంబంధమూ లేదని ఇట్టె తెలిసిపోతుంది. చిన్నవాడు- తన శ్రమశక్తిచేత అసలు వస్తుసంపదనే సృష్టించినవాడు- కాస్త 'బండ'గా ఉంటాడు. మూసిఉంచే పెదవుల్లో పట్టుదలా, తెరచిఉంచే కళ్లల్లో నిబ్బరమూ కనిపిస్తాయి. శ్రమజీవి లక్షణాలని వేరే చెప్పనవసరంలేదు.

ఇక భర్తపోయి నిస్సంతయి ఇంటజేరిన సుందర రామయ్య ఆడబడచు, Parasitic Villain, పిల్లలమేనత్త 'పెద్దవాడన్నాక పెద్దవాడే, వాడి తర్వాతేమీరంతా' అంటూ Sentimental గా irrational గా శ్రమఫలం కేవలం 'ఐడియా'మాత్రం ఇచ్చినవాడికి కట్టబెట్టజూచే తాబేదారీతత్వం ప్రతీక. ఈ తత్వం తమ మాట నెగ్గించుకోడానికి వేసే ఎత్తుగడలన్నీ, చేసేకుతర్కాలన్నీ మనకీపాత్రలో కనిపిస్తాయి. వీరు తమ వాదాన్ని తర్కబద్ధంగా నెగ్గుకునే అవకాశం శూన్యమైనపుడు బ్రహ్మాండమైన ఆయుధాన్నితీస్తారు. 'ఈ జన్మలో పెట్టిపుట్టనివారికి ఏ జన్మలోనూపుట్టదు అదిఖాయం' లాంటి మత సిద్ధాంతాలూ, పూర్వాపర జన్మసిద్ధాంతాలూ, వెంటరావిడాలూ, ముందు పోవడాలూల ఊకదంపుడు ఉపన్యాసాలు మొదలుపెడతారు, శపిస్తారు. పాపంచేస్తే పాపంపుణ్యంచేస్తే పుణ్యంతప్ప యింకేదీ తమ వెంటరాదంటారు. అందువల్లనే 'ఒకరికి (కొంత తెలివిగలవారికిమాత్రమేనని గమనించాలి)చ్చేటప్పుడు మంచిదిచ్చి, తానుంచుకునేది పుచ్చుదుంచుకోవడం పుణ్యవంతుల లక్షణం' అంటూ పుచ్చుతత్వం, పుచ్చు నీతులు బోధిస్తారు.

అమ్మ: మొదట అన్నయ్యకే ఇచ్చేయమంది. రెండో అన్నయ్య (చిన్నవాడు) వాదిస్తే వాడికీ ఇచ్చేయబోయింది.' ఏ పక్షం వహించాల్సిందీ సరిగ్గా తేల్చుకోలేని ఊగిసలాడేతత్వం. అయినా అప్పుడప్పుడు తనకూ అవగాహనశక్తి కొంత లేకపోలేదని నిరూపించడానికా అన్నట్లు 'మీరు సబువులూ, లోకాచారాలూ మాటాడితే పెద్దవాడివంతు వాటావేయడం- చిన్నవాళ్లు ఎత్తుకోవడం రివాజు' అంటూ Protest చేస్తుంది. మొత్తంమీద తన్నడగందే మాట్లాడటం అలవాటులేని Passive వ్యక్తి.

మూడోవాడు కనీసం తన అభిప్రాయం వ్యక్తంచేస్తే తనకేమీ హానికలుగదన్న చోటనైనా తను ఏ వర్గంవాడో స్పష్టంగా చెప్పగలడు (తానుకూడా కష్టజీవే. అట్టల తయారీలో పేస్టురాసేడు) శ్రమఫలం గట్టిగా శ్రమజీవికే–రెండవవాడికి–యివ్వడం న్యాయమన్నాడు. తనుచేసినది ఒక పెద్దపనికాదని ఒప్పేసుకున్నాడు. తను వాటిని చెయ్యలేదుకనుక తనకి ఏ అట్టయిచ్చినా పరవాలేదన్నాడు. వీడికి తాను సరియైనపక్షాన్ని వహిస్తున్నందుకు తండ్రిలేనప్పుడు ఈ 'కొంత తెలివిగలవాడు' తన వీపు చిటగొడ తాడనే విషయంకూడా తెలుసు.(యు.ఎన్.వో. లో తన ప్రతిపాదన వీగిపోయినమీదట అమెరికా ఎలాబెదిరింపులకు దిగిందో గుర్తుతెచ్చుకోండి).

ఇక ముఖ్యపాత్రల్లో తండ్రి సుందర రామయ్యమాత్రం మిగిలాడు. 'పిల్లలూ పెద్దలూ యిలా పక్షాలుగా విడగొట్టబడ్డం సుందరరామయ్యకిష్టమైన విషయంకాదు. తన పిల్లలు త్రేతాయుగం నాటి శ్రీరామచంద్ర సోదరులను తలపిస్తూ ఒకటిగా ఉండాలని అతని అభిమతం.' ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఎన్ని అసమానతలున్నా శాంతియుత సహజీవనం చేయాలనేదే ఆయన అభిమతం. ఏ సమస్యనైనా ఈ 'పరమమైన విశ్వాసం' పునాదిగా ఇట్టే పరిష్కరించగలడు. 'సుందరరామయ్య తెలివికి అది (ప్రస్తుతసమస్య) ఒక పెద్ద సమస్యకాదు, అయినా, అతనుకొంచెంసేపు వెనకాముందు ఆలోచించేడు. ఎవరికివ్వడం న్యాయమాఅనికాదు ఆలోచించింది. పెద్దవాడికి రాజ్యాధికారం కట్టబెట్టడానికి ఏయేసబబులు చూపెట్టగలనాఅని.

ఈ కథ కా.రాగారు శ్రమశక్తి ఔన్నత్యాన్ని, ప్రాముఖ్యాన్ని, ఉత్పత్తిలో దానిస్థానాన్ని స్పష్టంచేయడానికి రాశారు. ఇదే కథా వస్తువుగా రావిశాస్త్రిగారు కొన్ని సంవత్సరాలకు పూర్వం 'బల్లచెక్క' అనే కథ రాశారు. కాని అప్పట్లో చిత్రిణ దీని అంత ప్రతిభావంతగా, ప్రభావయుతంగా ముఖ్యంగా సర్వతోముఖంగా జరుగలేదు. శిల్పం విషయకంగా ఇప్పటి రావి శాస్త్రి గారు అందరికీ ఒరవడి కాగలిగినంత ముందు కెళ్ళిపోయారు 'ఒత్తి ఐడియాలకి అట్టలు ఎప్పటికీ పుట్టవ్' అనే త్రికాలాబాధిత సత్యాన్ని చాటడానికి రాశారు. ఉత్పాదనక్రియకు ముడిసరుకు, భూమి, పెట్టుబడి, నిర్వహణాదక్షత అవసరాలే. కాని శ్రమశక్తిలేక మిగతా ఉత్పత్తిసాధనాలేవీ తమంత తాము ఏ వస్తువునూ ఉత్పత్తిచేయలేవు. ఈ సాధనాలు ఉత్పత్తిలో తమవాటా రాబట్టుకోవాలన్నా, లాభాలు ఆర్జించాలన్నా శ్రమశక్తినే ఆశ్రయించాలి, ఏ ముడిసరుకుకూ తనదైన ఒక విలువఉండదు; శ్రమశక్తి దాన్నిచేరితేనేగాని, దాన్నితీర్చిదిద్ది వాడుకోవడానికి అనువుగా మలిస్తేనేగాని దానికి ఏ పాటి విలువైనారాదు.

ఉత్పత్తిలో ఈ శ్రమశక్తిని వాడుకునే పద్ధతిలోను, దానికి ముట్టజెప్పే ప్రతిఫలంలోనూ చాలాకాలంగా మోసం జరుగుతూవచ్చింది, ఈ మోసాన్ని, ఈ మోసపు

పరిమాణాన్నీ మేరను స్పష్టంగా, ఒక సిద్ధాంత రూపంగా చాటినవాడు విశ్వకార్మికపథ నిర్దేశకుడు మార్క్స్ (Das Kapital Vol III లో) Labour Value Theory (శ్రమ విలువ సూత్రం)లో ఆయన బయటపెట్టిన అంశాలివి: అంగట్లో సరుకులు అమ్ముడు పోయినట్లుగానే శ్రమశక్తి కూడా కొన్ని సూత్రాలకు లోబడి అమ్ముడు పోతుంది. అయితే దానికి ముట్టే ప్రతిఫలం తానుత్పత్తి చేసిన మొత్తం వస్తు సముదాయాన్నిబట్టీ, పనిచేసిన మొత్తం కాలాన్నిబట్టీ ఉండదు. కార్మికుడు తన జీవితం గడుపుకోవడానికి సరిపడేంత డబ్బుకు సమానమైన వస్తుసామాగ్రిని ఎంత కాలంలో ఉత్పత్తి చేయగలడో అంతకాలానికి మాత్రమే ప్రతిఫలం ముట్టజెప్పబడుతుంది. ప్రపంచంలో శ్రమశక్తి ఒక్కటే తన విలువను మించిన విలువను సృష్టించగలశక్తి. ఉదాహరణకు ఒక శ్రామికుడు తన నిత్య జీవితానికి సరిపడే సంపదను 3 గంటల్లో ఉత్పత్తి చేస్తాడనుకోండి. దాన్నిబట్టి అతనికి ఆ మూడుగుంటల శ్రమకు సమానమైన ప్రతిఫలాన్ని ముట్టజెప్తే సరిపోతుందనే ద్రోహబుద్ధితో అతనికూలి అంతకే నిర్ణయిస్తారు. వాస్తవానికి సాధారణంగా ఏ కార్మికుడూ 8 గంటలకు తక్కువ పనిచేయడు. ఈ కాలంలో తన జీవితావసరాలకు సరిపడే శ్రమకుమించి చేసిన శ్రమను అదనపు శ్రమ (Surplus Labour) అనీ, ఆ అదనపు శ్రమ శక్తిద్వారా ఉత్పత్తిఅయిన విలువను అదనపు విలువ (Surplus Value) అనీ అంటారు. ఇదే లాభాలు, బాడుగ, వడ్డీ లాంటి అవైతనికాదాయాన్ని (Non-wage income) సృష్టిస్తుంది. జీవితపు రిజిస్టర్‌లో ఎక్కే వ్యక్తులు మాత్రమే ఈ అదనపు విలువ (Surplus Value)ను సృష్టించగలరు నిర్జీవమైన యంత్రసామగ్రి సృష్టించదు. మొత్తం శ్రమకాలానికి కాకుండా జీవనభృతి సంపాదనకు సరిపడే కాలానికి మాత్రమే ప్రతి ఫలాన్ని ముట్టజెప్పడం శ్రమదోపిడి (Exploitation) అనబడుతుంది.[7] చతురమతుల ఈ దోపిడీ విధానమే మానవజాతి విషాదానికిమూలం. ఈ రహస్యాన్నే కా. రాగారు చాల సమర్థవంతంగా చిన్నపిల్లలకు కూడా బోధపడే విధంగా వస్తువును మలిచి అలాంటి సరళమైన శైలిలోనే చెప్పారు

ఈ కథలో అసలు వస్తుసంపద (రైటింగ్ పేడ్స్)ను ఉత్పత్తిచేసినవాడు రెండవ వాడు. తన శ్రమశక్తికి ప్రతిఫలంగా కాలికో పేడ్ కోంతాను. కేవలం 'ఐడియా' మాత్రమే యిచ్చిన పెద్దవాడూ అదే అట్ట కోరుతాడు. వాస్తవానికి వాడి ఐడియాకి 'పావలా అట్ట ఎక్కువ. అయినా కాలికోఅట్ట' లాక్కోవడానికి చాలారాద్ధాంతం కావడానికి కారకుడయ్యాడు. ఇదంతా అన్యాయమూ, అర్థరహితమూ. మరైతే తప్పుడు పక్షం వహించి తప్పుడు తీర్పు ఇచ్చిన, ఇవ్వజూచినవారికిది తెలియదా? తెలుసు; అంతరానికి. వారి ఆయుధం reason కాదు cheap sentiment. 'పెద్దవాడన్నాక

7 Encyclopaedia Brit. vol. 14 p. 995

పెద్దవాడే'తప్ప వారివద్ద అంతకంటే సబబైన కారణంలేదు. ఈ కారణం చాలాకాలగా లోకంలో చలామణీ కాగలుగుతూవస్తున్నది. ఇంకానా ఇకపైసాగదుఅనే తత్వం వంట బట్టించడానికే ఈ 'చిన్న'కథ. కా. రాగారు సమస్య లేవనెత్తి ఊరుకోలేదు పరిష్కరించారు. ఈ తీర్పుగాళ్లెవరూ తనకు న్యాయం చేకూర్చరని తెలుసుకొని ఆ బాధ్యత తానే వహించాడు రెండవవాడు. శ్రామికులే లోకంలోని వస్తుసంపదను పంచితే ఎట్లా ఉండగలదో స్థూలంగాతెలిపారీ తీర్పులో.

'అత్తా! నేనీ అట్టలు పంచుతానుచూడు. అన్నయ్య ఆరేశ అణాలన్నాడు. కాని బజారులో ఇవి ఒక్కొక్కటి పావలాయే! అమ్మ ఇచ్చిన అర్ధరూపాయికి ఇదిగో రెండు అట్టలు (పెట్టుబడిదారునివాటా) అన్నయ్య ఐడియాకి ఈ పావలాఅట్ట ఎక్కువ. తమ్ముడుచేసిన సాయం చాలతక్కువే! 'అయినా. నాకురెండు అట్టలున్నాయి. (శ్రామికుడు hoarding కు accumulation కు తలపడడు) అంచేత తమ్ముడికొకటిచ్చేస్తున్నాను 'ఈ అట్టంటే నాకు యిష్టంగాఉంది. కాబట్టి ఈ కాలికోఅట్ట నాది.' ఈ తీర్పులోని ఔచిత్యాన్నిగురించి ప్రతివారూ. ముఖ్యంగా మేధావులు యోచించ వలసిన అవసరం ఉంది.

సమీక్షలు:

హేహారు

(పన్నెండు కథలు – న్యూవేవ్ ప్రచురణ – 1 రూపాలు 25 పైసలు)

ఒక హాలీవుడ్ సినిమాలో ఒక మనిషి కారులో పోతూ ఆక్సిడెంట్ చేస్తాడు. మరో కారులో మరొకడు అటుగా వొస్తూ ఆగి, "ఏం జరిగింది?" అని అడుగుతాడు. "రోడ్డు వంపు తిరిగింది– నేను తిరగలేదు." అంటాడు ఆక్సిడెంట్ చేసుకున్నవాడు.

సాహిత్యంలోకూడా ఇలాటి ఆక్సిడెంట్లు జీవితపు మలుపులలో జరుగుతూ ఉంటాయి. ఉవ్వెత్తుగా లేచిన సాహిత్య కెరటాలు విరిగిపడిపోతూ ఉంటాయి, కొత్తవి లేస్తూ ఉంటాయి.

ఈ నాటి సాహిత్యపు కొత్త కెరటాల తాకిడి ప్రభావం సాహిత్య పిపాసువులపై బాగా పని చేస్తున్నదనటానికి సందేహంలేదు. ఇందులో పత్రికలున్నాయి. కవితా

సంకలనాలున్నాయి, కథా సంకలనాలున్నాయి, విమర్శనా వ్యాసాలున్నాయి- స్త్రీ గర్భంలో ఏర్పడిన జీవకణం పెరిగి అన్నిరకాల ధాతువులనూ పొదిగి, అన్ని అంగాలనూ, ఉపాంగాలనూ నిర్మించుకున్నట్టుగా కొత్త సాహిత్యం అన్ని ప్రక్రియలనూ ఉత్పత్తిచేస్తున్నది. "మార్చ్" "ఝంఝ" "లే" "తిరుగబడు" "ఇప్పుడు వీస్తున్న గాలి" "హోరు" లాటివి ఉప్పెనలాగ రావటమేగాక, పాఠకులను అమితంగా ఆకర్షించాయి.

విరిగిపోయిన కెరటాలనూ, లేచిన కెరటాలకూ మధ్య వ్యత్యాసం చూడలేని కబోదులు సాహిత్య రంగంలోనేఉన్నారు. కొత్తకెరటాలకు కొన్ని లక్షణాలున్నాయి. అవి ప్రజాపీడక శక్తులకు హిస్టీరియా తెప్పిస్తాయి; పెట్టుబడిదార్ల స్వలాభాపేక్ష ప్రేరేపించకుండానే అవి సృష్టి అవుతాయి; ఇంతకన్న ముఖ్యమైనదేమంటే, వీటితో పాత సాహిత్య ధోరణులకు కాలదోషం పట్టిపోతుంది. ఈ లక్షణాలను ఎవరైనా సులువుగా కనిపెట్టవచ్చు. ముందురాబోయే పబ్లిషర్లు ఈ సాహిత్యంమీద లాభాలు గడించటానికి ఎగబడతారు: ఈ సాహిత్యాన్ని అణచిపెట్టటానికి ప్రయత్నించినవారు "జంగ్లీలు"గా సర్వత్రా గుర్తించబడతారు.

ఈ కొత్త సాహిత్య కెరటంమీద వెలువడినదే 'హోరు' పన్నెండు కథల సంపుటి. రూపాయిపావలా ఖరీదుచేసే ఈ 128 పేజీల పుస్తకం ధనార్జనకోసం ప్రచురించినది కాదని వేరే చెప్పనవసరంలేదు.

ఇందులోఉన్న పన్నెండు కథలూ భూమిలో లోతైన పునాదులుగలవి- గాలి మేడలుకాదు, రచయితలందరికీ తాము రాస్తున్న విషయాలు క్షుణ్ణంగా తెలుసు; వారి అనుభూతులను మనం మనం సంకోచంలేకుండా మన అనుభూతులుగా స్వీకరించవచ్చు. వీటిలో కొన్ని కథలు నిర్దుష్టమైన శిల్పసామర్థ్యంతో కూడుకున్నవి. ఎంతో సామర్థ్యంతో రచించినవి.

"మెజారిటీ ప్రజలకి మనదేశంలో జరుగుతున్న అన్యాయాలతో, సాహిత్య రంగంలో, రాజీలేని పోరాటం సాగించటం, నిజాయితీని నిర్మాణమార్గంలోకి మళ్లించటం న్యూవేవ్ లక్ష్యం" (ముందుమాట) "హోరు" ఈ లక్ష్యానికిసూటిగానే ఉన్నది.

వి. రాజారామమోహనరావు రచన "వరద" మంచి పటుత్వంగల కథ. వరద ఒక్క ఏటిదేకాదు, గ్రామస్తుల వరదా, వారి ఆకలి వరదాకూడా కథలో ఉన్నాయి, ఈనాడు జీవితంలో కలుగుతున్న వికృతాపరిణామాలకే ఈ వరద ఒక ప్రతీక. "అయిదారేళ్లక్రితం....పచ్చటి ఇసుకమీద పల్చటితెరీలా పారుతున్నాయి.... అటువేపు గట్టమీద చెట్లు.... ఆనాడుచూసిన అందం...." ఇప్పుడు వరద భీభత్సంగా మారింది.

గ్రామస్థులు ఏటిగండిని ఆపలేకపోయారు. ఆరాత్రి "చీకట్లోకురిసే వర్షంలో అదా మగా చిన్నాపెద్దా గోడలమీద ... ఇళ్ల కప్పులమీద ..."

వీళ్లను ఆదుకున్నవాడు సామాన్య మధ్యతరగతివాడు. అతనిలో సహజంగా నాయకత్వ లక్షణాలులేవు. ఒకవంక తిండికి మాడుతున్న ప్రజలు. ఇంకోవంక ఈ వరదను అడ్డంపెట్టుకుని. వీలయినంత హెచ్చుధరకు ధాన్యం అమ్మటానికి సిద్ధంగా ఉన్న రంగయ్య. ప్రజలగొడవ ప్రజలకే వదలమని రంగయ్యహితవు. రంగయ్యను దోస్తామంటారు గ్రామస్థులు. అది దోపిడీఅని నమ్ముతూనే ప్రజలను నడిపించి. రంగయ్యను దోపిడీచేయించాడు।

పీడితులూ. పీడకులూ ఈ కథలో ఒకేగోదాలో కనిపిస్తారు. వారిమధ్య ఆదర్శాల తెరలూ. ధర్మపన్నాలూ అడ్డులేవు. ప్రత్యక్షపోరాటం. ఈ గొప్పకథలో నాకు చాలా జీవిత సత్యాలు కపించాయి.

1. ఎంత దుర్భర పరిస్థితిలోఉన్నా ప్రజల పోరాటానికి నాయకత్వం వహించే వాడు ఒకడుకావాలి. (ఈ కథలో అతను నామమాత్రి నాయకుడే. గండి పూడ్చటానికి గ్రామస్తులకు ఏమాత్రమూ సహాయపడలేని అర్భకుడు. ఆ గ్రామస్థుల వర్గానికి చెం దాడు. ఆ గ్రామంలో ఉంటున్నవాడైనా కాడు. నిజానికి అతనిది రంగయ్య వర్గమే. ఆ ఊళ్ళో వరదబాధలేని ఇళ్లు. ఎత్తునఉన్నవి— అతనిఇల్లూ, రంగయ్య ఇల్లుమాత్రమే నని మనం గుర్తుంచుకోవాలి। మంచిటచ్—కాదా?)

2. ప్రజలనుంచి నేర్చుకున్నవాడు నాయకత్వం వహించగలుగుతాడు. అది నాయకత్వానికి అతిముఖ్యమైన విషయం.

3. తిరుగుబాటు సమగ్రంగా ఉన్నప్పుడు ఘర్షణ విచ్చిపోయింది. ఒక్క టురికూడా ఎగలకుండా గ్రామస్థులు రంగయ్యనుంచి రెండు బస్తాల బియ్యం తెచ్చేసు కున్నారు.

4. ప్రజాపీడకుడూ, ప్రజానాయకుడూ ఒకేవర్గంవారయినట్టుగానే. రంగయ్య తన తరఫున ఉసికొల్పటానికి ప్రయత్నించినవాళ్లు "దోపిడీ" చెయ్యటానికి వచ్చినవారి సమవర్గీయులే. వాళ్లు సహకరించని నాడు రంగయ్యలేడు।

'వరద' ఈ సంకలనానికి మణిపూసలాటికథ. ఇందులో ప్రత్యక్ష వర్గ పోరాటం లేకపోయినా. దాని లక్షణాలన్నీ ఉన్నాయి.

ఆలాంటిదే ఎన్.యస్. ప్రకాశరావుకథ "పేపర్ టైగర్" ఇందులోని వాతావరణం వాన. ఎంతో తాపీగానూ, రసవంతంగానూ రచించిన ఈ కథలో ఘర్షణ కేవలమూ

మానసిక ప్రవృత్తికే పరిమితమైనది. ఇందులోకూడా మధ్య తరగతి మనస్తత్వం "ప్రజల" నుంచి నేర్చుకోవటం ఉన్నది. వెనకఊత ఇచ్చేవాళ్లు లేనప్పుడు అస్తి హక్కు లొంగిపోవటం కూడా ఉన్నది. మనకు జీవితంలో అజేయంగా కనిపించే శక్తులవెనక ఏదో ఊత ఉండాలి, ఆ ఊతలేని స్థితిలో పేపర్ టైగర్ అసలు టైగర్ కాదని ఇట్టే తేలిపోతుంది.

"మనుషుల్ని తినేవాళ్లు" (డి. వెంకట్రామయ్య రచన) మరొక మంచికథ. రంగం "విందులకీ, వినోదాలకీ, విలాసాలకీ విఖ్యాతి పొందిన 'నవభారత విలాస్'.... పట్నంలో పేరుమోసిన 'బోర్డింగ్ మరియు లాడ్జింగ్' ". అక్కడ తాగుడూ, వ్యభిచారమూ, హత్యలూ కుట్రలూ మొదలైన గొప్పవాళ్ళ ఆక్టివిటీస్ ఉంటాయి, అదొక సంస్థ. జూలో పాములున్న బోనులోనే కప్పలుకూడా ఉంచబడ్డట్టు, ఈ సంస్థలో మనుషుల్ని తినేవాళ్ళూ, తినబడే మనుషులూ ఉంటారు. మనుషుల్నితినే ప్రక్రియకు సాధకులూ ఉంటారు. తినబడేవాళ్ల జీవిత విధానమే చావుకు దారి తీస్తూ ఉంటుంది. అందుకే వయసు మళ్ళుతున్నా శరీరం అమ్ముకోకుండా జరగని వరహాలు, "నేను సచ్చినా పరవాలేదు ... నా బిడ్డలు...." అంటుంది. వరహాలు మా ప్రాణాలను బలిపెట్టినా దాని బిడ్డలకు దమ్మిడీ ముట్టలేదన్నది, పాఠకుణ్ణి బాధిస్తుంది, ఈ నాటి సంస్కృతిలోనుంచి ఈ "బోర్డింగు మరియు లాడ్జింగు"లను తీసి వెయ్యలేం. ఈనాడు దేశంలో ఉన్నగొప్ప పరిశ్రమలలో ఇదికూడా ఒకటి.

తాడిగిరి పోతరాజు రచన "ఎర్రబుట్ట"మరొక సమర్థవంతమైన రచన, ఇది ఎన్నికలనాంది భాగోతం. పాత్రలన్నీ నిండు ప్రాణాలు, మధ్యతరగతి మేధావులలో చాలామందికన్న పోలీసు సత్తయ్య పెద్దమేధావి. అతనికి అన్నీతెలుసు. "సార్ ... అంతా అన్యాయం ... మీకంటే మేము ఈ అన్యాయాలను రోజూసూత్తాం కాబట్టి చెబుతున్నా.... యెవరిపాపాన వాళ్లే పోతారనుకునే పిచ్చజనం ఉండబట్టే మన భా·తదేశం ఇట్ల ఏడుస్తుందిసార్. ఖద్దరు బురఖాగాళ్లు దేశాన్ని చెదలుతిన్నట్టు తింటాన్రు ... ఈ ఆఫీసర్‌గాళ్లని కాల్చిపారేసినా బాధలేదు బద్మాష్ ఎదవలు మందిని బెదిరించి కోళ్లూ కుక్కలూ కోయించుకొని తిని సర్కారిచ్చే బేటాలుజేబులో ఏసికొంటా·ు." అవును. వాళ్ళు ప్రజావిమోచన సైనికులా ఏమన్నానా– ప్రజలనుంచి తీసుకునేదానికల్లా డబ్బు చెల్లించటానికి?

మరి చివరకు సత్తయ్య అదే పనిచేశాడు– 'పెద్దమనుషు"లను బెదిరించి ఎన్నికల జట్టుకు తిండి ఏర్పాటు చేశాడు. అతన్ని తప్పుపట్టగలమా?

సీత: "ఈ గొప్పతనం.... ఈ యెర్ర బుట్టది.... ఈ యెర్రబుట్టలేకపోతే ఎలక్షనేలేదు. ఢిల్లీలో ఇందిరమ్మకానీ, హైదరాబాదులో మంత్రులుకానీ అందరూ ఈ

యెర్రిబుట్ట చూపెట్టి జనాన్ని భయపెడుతున్నారు" రాజకీయ పేపర్ టైగర్లకి ఎర్రబుట్ట అంగరక్ష.

"రాజనీతి" (సి. యస్. రావు) రచన మరొక మంచికథ. ఎక్కడినుంచో కోతలకు వచ్చిన జనం హెచ్చు రేటు అడిగితే వాళ్ళతో ఘర్షణపడటంపాతపద్ధతి వాళ్ళకు ఆరేటిచ్చి, వాళ్ళతిండి బిల్లుల ద్వారా తిరిగిరాబట్టడం కొత్త రాజకీయ విధానం. ఇది పరిశ్రమలలోనూ ఉన్నది. శ్రామికులు జీతాలు పెంచుకునేటందుకు సమ్మెలు చేస్తారు. జీవనభృతి వాళ్ళ కూలిరేటునుమించి పెరిగిపోతూ ఉంటుంది. సమ్మెలు సఫలమైనకొద్దీవారి జీవితం కిందికి దిగుతూ ఉంటుంది. అయితే ఈ కథలో కృష్ణమూర్తి మన పారిశ్రామికులకన్న తెలివైనవాడు. పోలీసులూ, రౌడీలూ అవసరం లేకుండా, ధనికులకు దరిద్రులమీద ఉన్న అసలు కబంధహస్తం ఆర్థికమైనదని గ్రహించి దోపిడీ అతి సులువుగా చేసేశాడు.

మరువాడ రాజేశ్వరరావు 'గోడ' అతిసున్నితమూ, వాస్తవమూ అయినరచన. ఇంకెలాగూ బతకలేక కామందుల గోడ ఆధారంతో పిడకలు చేసుకుని బతుకుతున్న ముసిలి ముండకు ఆ కాస్త ఆధారమూ లేకుండా పోతుంది. కారణం అది కామందుల గోడ కావటమే ఎన్నికల పోస్టర్లు అంటిస్తే ఆ గోడకు రాజకీయవిలవ ఉన్నది. ప్రకటనల పోస్టర్లు అంటిస్తే ఆర్థిక విలువ ఉన్నది. ఇవి ముసలిదాని కడుపుమీద కొట్టడం ఒక లెక్కలోకిరాదు. పత్రికలో రెండు పంక్తుల వార్తగాకూడా పడటానికి పనికిరాని సంఘటన చక్కని చిన్నకథకు ఇతి వృత్తమయింది. జీవితసత్యాలు చాలా చిన్న విషయాలలో కూడా కనిపిస్తాయిమరి.

మల్లంపల్లి కృష్ణారావు "దేవుడు" కథకు కొంతకాలం క్రితం ఏమంత సాహిత్యపు విలువ ఉండేదికాదు. ఆ రోజులు మనలో చాలామందికి తెలుసు. కాని అది ఇవాళ అతిముఖ్యమైన ఇతివృత్తమై కూర్చున్నది. భౌతికవాదం తమకు విని యోగించినంత కాలమూ దోపిడీగాళ్ళు దాన్ని బలపరుస్తారు. అందుకే జాతీయోద్యమం నడిచినప్పుడు దేవుడి గొడవ ఎవడికీ అంతగా పట్టలేదు. కాని ఆ భౌతిక వాదమే ప్రజలకు ఉపకరించే పరిస్థితివచ్చినప్పుడు శాస్త్ర జ్ఞానాన్ని సామాన్య ప్రజలకు అందకుండాచేసి దేవుణ్ణి పంపకం చెయ్యటం దోపిడీగాళ్ళకు చాలావీలు. అసలు దేవుడే ఒకపెద్ద దోపిడీ సాధనం కుళ్ళలోనే విషక్రిములు పుట్టినట్టు, దేవుడు ఎపిలెప్సీలోనూ, హిస్టీరియాలోనూ పుట్టి జనానికి సంక్రమిస్తాడు. ఈ విషయం స్పష్టంచేసే ఈ కథ ఈ నాడు అవసరం.

రుద్రాభట్ల నరసింగరావు రచన "ఉదారులకు ఉద్బోధన"లో ఉన్న సమస్య తీవ్రమైనదే– చదువూ, డబ్బూ, ఉద్యోగార్హతలేని ఒక యువకుడు క్షయతో బాధపడు

తున్నాడు. అతని క్షయ నయంకాదు ఏరెండు మూడేళ్లో బతకవచ్చు. ఆ పరిమిత కాలంపాటు బతకటానికి ప్రభుత్వం ఏమన్నా మార్గం చూపుతుందా అన్నది సమస్య. ఈ సమస్య కృత్రిమంగా తయారుచేసినదే అయినా అసంభవమైనది కాదు, కాని కథ యొక్క ఉద్దేశం ఈ సమస్యను చిత్రించటంకాదు- ఈ నాటి జీవితంలో ఇలాటిసమస్య ఎలా కరిగి ఆవిరి అయిపోయేదీ చూపటం. ఇది వ్యంగ్యరచన.

శ్రీపతి రచన "తగువు"కథలో మనకు కనిపించేది దాష్టీకమే. గ్రామపంచాయ తీలను ఒకందుకు మెచ్చుకునేవారు. సాంఘిక వ్యవస్థలో ఉన్న మేరకు పంచాయితీలో కూడా న్యాయం జరుగుతుంది. కోర్టులో ఈ న్యాయానికికూడా గ్యారంటీలేదు అయితే ఈ కథలో జరిగినది సరిఅయిన పంచాయితీకాదు, తగువుదార్లలో ఒకడైన రవీందర్ ని విచారణకు పిలిచారు, అందుకనే సుబ్బడితల్లి సీతమ్మ శాపనార్థాలుపెట్టి లేచిపోతుంది. తగువు ఎలా పరిష్కారమయిందన్నది ముఖ్యంకాదు— పంచాయితీలో లచ్చుమయ్య ప్రవర్తన, జీవితం ఎలా నడుస్తున్నదంటే, ఒకేవర్గంలో సూరయ్యలాటి తోడేళ్ళు. లచ్చుమయ్యలాటి పిరికిపందలూ ఏర్పడుతున్నారు. ఈ కథలో గమనించదగినదేమంటే చెయ్యని నేరానికి ముందు శిక్ష, దాన్ని సమర్థించటానికి విచారణా, దాని ఆధారంతో తిరిగి శిక్షా— ఇదీ పంచాయతీ రామరాజ్యం !

చివరికథ నగ్నముని రచన "తిమింగలం." మహాసముద్రాలకు అసలు రాజు తిమింగిలం. అది కనిపించదు. మనకు కనిపించేవి మామూలు చేపలు— చిన్నవీ, పెద్దవీనూ, రాజకీయ మహాసముద్రపు లోతులలోకూడా తిమింగిలాలవంటి బాబూభాయి పటేళ్లుంటారు. ఎర్రిటోపీలైనా, ఎన్నికలైనా, ఇతర రాజకీయభాగోతాలైనా ఈ తిమింగిలాల కోసమే ఈ దేశంలో జరుగుతున్నాయి. మన బుర్రాక్రాట్లు నీతిగా, నిజా యితీగాఉంటే రామరాజ్యం వస్తుందనే వారికి బాబూభాయిలనుగురించి తెలీదు, అలాటి అమాయకులకు యీ కథ కనువిప్పు. రావులాంటి నిజాయితీపరుడుంటే అతడిమీదికి హైకాస్ ముండల్నీ, అతని కొడుకుల్నే పంపకంచేసి పని జరుపుకోగలదు తిమింగలం.

ఈ సంపుటిలో నేను ఆమోదించలేని రెండు కథలున్నాయి. యం పినాకిరచన "ఎర్రిదీపం", ఇస్మాయిల్ రచన "సిగరెట్". వీటిలో స్పష్టతలేదు. టెక్నిక్ క్లిష్టంగా ఉండటం శ్లాఘనీయంకాదు. అది రచనలో "పొదుపు" కోసం స్పష్టతను కోల్పోరాదు. "సిగరెట్"లో నిరాశావాదము, "దైవిక"మైన కష్టాలూ ఉన్నాయి.

మొత్తంమీద యీ సంపుటి తెలుగు సాహిత్యంలో వస్తున్న సరికొత్త కెరటం అనటానికి సందేహంలేదు. ఈ కెరటం ఇంకా విస్తరిస్తుంది. ఇంకా చాలా యెత్తు లేస్తుంది.

కథ

నిర్వహణ: WOW– వెల: 25 పైసలు;

కళలను– ముఖ్యంగా సాహిత్యాన్ని, సినిమాలనూ– నల్లమందులాగా ఉపయోగించే అలవాటు మధ్య తరగతిలో చాలాకాలంగా ఉంటూవస్తున్నది. "జీవితంలోని రొంపి, దుర్గంధమూ ఎప్పుడూ ఉండేదే దాన్ని కాస్సేపు మరిచిపోవటానికి కాకపోతే ఈ కళలు దేనికి?" అని ఈ నల్లమందును బాధా నివారిణిగా జనం ఆమోదించటం మనకు తెలుసు. అయితే ఇవాళ ఈ నల్లమందు ఔషధంకాదు. దురలవాటుగా పరిణమించింది. దీని నిషాలో జనానికి జీవితంలో రొచ్చూ, బాధా, దౌర్జన్యమూ, క్రౌర్యమూ ఉన్నట్టుకూడా తెలియకుండా పోతున్నది. అందుచేత "నల్లమందు" సాహిత్యానికి మంచి విరుగుడు అవసరం అయింది. ఆ విరుగుడు విప్లవ సాహిత్యం సరఫరా చెయ్యాలి. జీవితంనిండా పాపం ఉన్నది. పాపం సామాజికం చాప్లిన్ ఒక చిత్రంలో అడిగినట్టు, 'మనమంతా mass murderers కామా?' అవును మనకందరికీ సమిష్టి పాపంలో వాటాలున్నాయి. మనం నరకంచూసితీరాలి. పాపవిముక్తికి అదిమొదటిమెట్టు.

'కథ'లో కొంత నరకం ఉన్నది. స్వర్గం భ్రమకావచ్చు, నరకం నిజం, వాస్తవం. స్వర్గాన్ని గురించి ఏమీ చేసేదిలేదు, నరకం గురించి ఏదో ఒకటి చెయ్యాలి. జీవితం నరకంగా ఉండరాదు. నల్లమందు మింగినవాడు నరకమంటూ ఉందనే ఒప్పుకోడే, వాడుదాన్నిగురించి ఏంచేస్తాడు? నగ్నముని రచన 'అమలిన శృంగారం'లో విశ్వంలాగ, 'ఎక్కడరా దరిద్రం! ప్రతివాడూ సుఖంగానే ఉన్నాడు. మీలాంటివాళ్లు కల్పించేవే ఈ సమస్యలన్నీ.' అంటాడు.

ఈ నాడు వెలువడే పత్రికలన్నీ నల్లమందు షాపులుకావు. రచయితలందరూ నల్లమందు తయారుచేసేవాళ్ళూకారు. అమాటకువస్తే ఈ కాలంలోనే నల్లమందు రచయితలకీ విరుగుడు రచయితలకూ చీలిక స్పష్టమైంది. 'కథ'అంటీ పత్రికఅనవచ్చు. ఇది కేవలమూ విరుగుడుతో తృప్తిపడి ఊరుకోదు.

"రచయి(త్రు)తలకు మనవి" (యజ్ఞంశెట్టి కాయి రచన), 'గ్రంథసమీక్ష', 'కావలెను', 'వరుడు కావలెను', 'ఎర్రికణాలు....', 'విప్లవ కవుల అరెస్టు–మిరపకాయల ధరలు', 'ప్రాచీన ప్రదేశ్ సాహిత్యఎకాడమీ', 'తెలుగు పత్రికాధిపతులకే..' 'చెందరు నోటీసు'లాంటి వ్యంగ్యరచనలలో ఆంటీ పత్రికావ్యంగ్యం జాస్తి.

పత్రికా 'పరిశ్రమ'లో పత్రికాధిపతీ, రచయితా, పాఠకుడూ వేరువేరు సమాజాలకు చెందినవాళ్లు. పత్రిక 'కమోడిటీ', అది ఎవరి సంస్కారాన్నీ ప్రతిబింబించదు: కాని చదివేవాడి వ్యామోహాన్ని రెచ్చగొట్టి, సంతృప్తిపరుస్తుంది. సినిమాపరిశ్రమకూ, దీనికీ తేడా అట్టేలేదు. సినిమా చిత్రంలో సూదంటు రాళ్లు సినిమా తారలు, కథల్లో పాత్రలు మాత్రమే. వాటికి అక్షరాకృతేగాక రేఖాకృతికూడా ఉంటున్నది. రేఖాకృతి ఆకర్షణీయంగా ఉండాలి. కాని రేఖాచిత్రకారుడికి 'కులం' ఉండదు. ('బొమ్మకు పది రూపాయలా!') కథ రాసినవాడు మరీ చవట. ('పేరు దురదకొద్దీ రాసి పాతికలూ, ముప్పయిలూ చాలవంటారేవీళ్లు!')

మనకు ఈ రచయితలమీద సానుభూతి అవసరంలేదు. పత్రికాపారిశ్రామికులకు డబ్బుచేసి పెట్టటానికి ఎగబడేవాళ్లు అవమానాలకు గురిఅవుతున్నమాట నిజం. 'కథ ఏమయిందో చెప్పరు. అచ్చేసేదీ వెయ్యందీకూడా చెప్పరు.... ఒకవేళ పొరపాటున పిచ్చేశ్వరరావు రచన అచ్చయినపక్షంలో, ఆపైన ఆర్నెల్లకి అందుకు ప్రతిఫలంగా ఓ తృణం పంపుతారు!' ('తెలుగు పత్రికాధిపతులకే.... జోహార్లు!)

నిజమే. కాని పిచ్చేశ్వరావులు ఇలాటి అవమానాలకు ఎదురు తిరుగుతారా? తిరగరు! పత్రికలవాళ్ళు తమను స్వప్రయోజనంకోసం ఉపయోగించుకుంటున్నందుకు అభ్యంతరం చెబుతారా? చెప్పరు! పాఠకులను నల్లమందు ఖాయీలలాగాను, దళారీలుగానూ చూస్తూ, పత్రికా పరిశ్రమలో ఎంతపైకి వచ్చిన పత్రికలో తమ చెత్తపడితే అంతగా సంబరపడే పిచ్చేశ్వరావులు పత్రికా ప్రపంచంలో తమ స్థానాన్ని ఆమోదించినవాళ్ళేననుకోవాలి. 'మీ పత్రికలో నా కథ పడాలంటే మీకు ఎంత ఇచ్చుకోవాలి?' అనిరాసే పిచ్చేశ్వరావుల ఉత్తరాలు నేను చాలా చదివాను.

అంటే పత్రికలు ఎన్నివస్తే ఈ దేశం అంతబాగుపడుతుంది.

'బద్దలు కొట్టండి' (శ్రీపతి). 'బ్లూమేన్' (వి. రాజారామమోహనరావు). 'బియ్యం' (డి. వెంకటామయ్య). 'చోటు/జాగా/ఎడం/ ప్లేస్....' (లీపారియా). 'వలయం' (శ్రీకంఠమూర్తి). 'అర్ధరాత్రి ఉదయించిన సూర్యుడు' (చంద్ర). 'సమాధానం' (విజయ్). 'అమలిన శృంగారం' (నగ్నముని) కథలలో సామాజిక వరకంయొక్క వివిధ రూపాలు చిత్రించబడ్డాయి.

ఇంత చిన్నసైజు పత్రికలో ఇంత డైనమైట్ కుక్కిన WOWఅభినందనీయులు వీరి కృషి అవిరళంగా సాగాలి.

—కొ. కు.

(పైె రెండు పుస్తకాలు కాపీలు అయిపోయినవి)

ఇప్పుడు వీస్తున్నగాలి

''నిన్న నక్సల్‌బరీలో వీచినగాలి
నేడు శ్రీకాకుళంలో వీస్తున్నగాలి
రేపు దేశమంతా వీవనున్నగాలి''

అని ఒక యువకవి 'మార్చ్' అనే గేయసంపుటిలో హెచ్చరించాడు. ఈవీస్తున్న గాలి గుణాన్ని పసికట్టి దాని శక్తిసామర్థ్యాలను అంచనావేసిన 'సైంటిస్ట్' ఆ యువకవి. ఈగాలి రేపు దేశమంతా వీచి కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలపై నిర్మితమై, ఇప్పుడిప్పుడే సన్నగా పగుళ్లుచూపుతూన్న యీ సాంఘికవ్యవస్థను కూలగొట్టటానికి రేపు గంగవెఱ్ఱి లెత్తి వీస్తుందేమోనని భయపడిన ప్రభుత్వం దానిని నిషేధించింది, కానీ గాలిని ఎవరు నిరోధించగలరు. ఇది ప్రకృతిశక్తి. అక్షరాలలో పొందుపరిచిన యీ సత్యాన్ని సి. యస్. రావ్‌గారు తన కథకు 'టైటిల్'గా వాడుకున్నాడు. అదే 'టైటిల్'ను విరసం (సంకలనకర్త) సంకలనానికి పెట్టుకోవటం జరిగింది. ఇందులో 16 కథలున్నాయి.

అన్నికథలలోనూ అంతర్లీనమైఉన్న ఒక సామాన్య లక్షణం ఏమిటంటే సమాజాన్ని ముందుకు తీసికెళ్ళే భావచైతన్యం. ఇది వర్గసమాజం. కులవ్యవస్థకు భారత దేశం ఉసిళ్ళపుట్ట– అసంఖ్యాకమైన కులాలు.

నెత్తిమీద బొచ్చుగొరుక్కోవటంలోకూడ మతసంస్కృతిని ఉద్దీపింపచేసే ఉన్మాద పూరితమైన వివిధమతాలకు మనదేశం పెద్దతల్లి. వివిధ కులమతవర్గభేదాలకన్నమిన్నయైన పేద ధనిక వర్గభేదాలు బాగా ఊడలుపాతకున్న ముసలి మఱ్ఱిచెట్టు మనదేశం.

ఈ దేశంలోని పీడిత ప్రజలు సంస్కరణలలో, చట్టాలలో తమకున్న అంధ విశ్వాసాన్ని దిగజార్చుకొని యీ దోపిడీవ్యవస్థను నిర్మూలించటానికి విప్లవోన్ముఖులు కావాలని ఈ కథలు హెచ్చరిస్తున్నాయి.

స్వాతంత్ర్యంవచ్చిన 25 సంవత్సరాల తరువాత మన దేశపరిస్థితి ఏమిటి? 'ఎక్కడవేసినగొంగళి అక్కడే ఉందన్నట్లుగా ఉంది కానీ పురోగమించలేదు. పురోగమించినదని ఎవరైనాఅంటే, దానికి నిదర్శనగా 'బిర్లా–టాటా–ఆయారామ్–గయారామ్' లను మాత్రమే చూపగలడుగానీ సామాన్యవ్యక్తినికాదు. ఈవేళ సామాన్యవ్యక్తి.... 'తెల్లవాడే మంచివాడు నిజామే మంచివాడు ముప్పొద్దూ తిండికి కరువులేదు అప్పట్లో' అని యీ దోపిడీవ్యవస్థను అప్పటి రాచరికపుకాలంతో పోల్చుకొని కళ్ళవెంట నీళ్లు కార్చుకుంటున్నాడు.

అలాటి దగాపడిన తమ్ముళ్లను, దోపిడీచేయబడుతూన్న తమ్ముళ్ళను, చెల్లాయిల నందరినీ ఆయుధంపట్టి తమ హక్కులను సాధించుకోమని మార్గం సూచిస్తున్నాయి ఈ కథలు.

శ్రీమాన్ గాంధిగారు మాలమాదిగలకు హరిజనులని కొత్తపేరు పెట్టారు. దేవాలయ ప్రవేశం చేయించారు. ఊరిబయట గుడిశెలలోవున్న హరిజనులు ఉన్నత కులాలవారితో కలిసిపోవాలని మొసలికన్నీళ్లుకార్చే ప్రభుత్వం వాళ్ళకు ఊరిబయటనే సోషల్ వెల్ఫేర్‌శాఖతో కాలనీలు కట్టిస్తోంది. వీళ్ళిద్దరూ అస్పృశ్యులేకానీ ఒకరికి మరొకరంటే పడదు. ఈ రెండుకులాలమధ్యనున్న తారతమ్యాలను వైషమ్యాలను పెంచి ప్రోత్సహించి అగ్రికులాలవారు వీరిని ఉపయోగించుకోవటం సి. యస్. రావ్‌గారు 'ఇప్పుడు వీస్తున్నగాలి'లో చక్కగా చిత్రించారు. "గుళ్ళో దేవుడు గుళ్ళోనే ఉన్నాడు. మాదిగ పేటలో మాదిగలు మాదిగపేటలోనే ఉన్నారు" .... ఒక కొత్తమార్పును రచయిత ఆకాంక్షిస్తున్నాడు.

చెరబండరాజుగారి "చిరంజీవి" శ్రీకాకుళ గిరిజనపోరాటంతో సంబంధాలున్న పద్నాలుగేళ్ళ బాలుని నిర్భయ వైఖరినిగూర్చినకథ. ఈ చిరంజీవి విముక్తిపోరాటంలో పాల్గొన్నకారణంగా డి.యస్.పి. గారి తుపాకీగుండు అతనిగుండెల్లో దూసుకుపోయింది. ఈ అమానుష దృశ్యాన్ని ప్రత్యక్షంగాచూసిన ఓపోలీసులో మానవత్వం పెల్లుబికి తన తుపాకితో తన బాస్‌ను హతమార్చుతాడు. ఈ కథలోని సంఘటనలు అసహజంగా ఉన్నా ప్రయోజనాత్మకంగా ఉన్నాయి.... "మావోసాహిత్యం లభ్యం— ఇద్దరు నక్సలైట్ల మరణం.... పోలీసులెవరికీ గాయాలు తగల్లేదు"అన్న పత్రికా ప్రకటనలను ఈ కథ అపహాస్యంచేస్తుంది.

నిఖిల్‌గారు వ్రాసిన 'సూర్యుడు' కథలో దోపిడీదారుని ఎలా ఎందుకు హత్య చేస్తారో, ఆశయం సాధించటానికి ఆయుధం పట్టవలసిన ఆవశ్యకతఏమిటో మొదలైన అంశాలకు సంబంధించిన శాస్త్రీయమైన అవగాహన కనిపిస్తుంది. ఇది కథఅనటంకన్న జరుగుతూన్న పోరాటానికి రూపకల్పన అంటే బాగుంటుంది.

శ్రీ కాళీపట్నం రామారావుగారు వ్రాసిన 'భయం' ఈ సంకలనంలోని అన్ని కథలలోకెల్ల అత్యుత్తమకథ. రచయిత కథలు వ్రాయటంలో చేయితిరిగినవ్యక్తి అని ఈ కథలోనిశిల్పం తెలుపుతుంది. అన్యాయాన్ని అధర్మాన్నిఎదుర్కొనే నిర్భయత్వం మానవునిలో కొరవడింది. ఈ భయం మానవసహజమైనదైతే కొంత క్షమాపణఉంది. కానీ మూఢవిశ్వాసాలూ, శుద్ధ అసంగతాలూ, కట్టు కథల పుట్టలోనుండి వచ్చిన ఈ భయాన్ని చంపాలని రచయిత సింబాలిక్‌గా వివరించుతాడు", చంపటమా—మానటమా

అనే మీమాంస మనుషులకేగానీ కోళ్ళకున్నట్టులేద"ని రచయిత కోళ్ళకు పాముపట్ల ఉన్న వర్గశత్రుత్వాన్ని సింబా లైజ్‌చేస్తాడు "పాఁవుకరుస్తాది అది యిషప్పురుగు .. సంపి అవతలపారేస్తాను" అన్న సత్తయ్య పలుకులు నేటి బూర్జువా వ్యవస్థనుచంపి అవతల పారవేయవలసిన అవసరాన్ని సూచిస్తాయి.

"తెలుపా?... నలుపా" కథ నల్లధనం తెల్లగా చేతులుమారేవేళ—చావుబతుకుల సందిగ్ధావస్థలో ప్రారంభమైతుంది ఈకథ. శ్రీకాకుళమైదాన ప్రాంతంలో ముఠాదార్లు, కరణాలు, షావుకార్లు సామాన్యప్రజలను ఎలా పీల్చి పిప్పిచేస్తారో వివరిస్తూన్న యీ కథ ఓపెద్ద రాజకీయ ఉపన్యాసంలా సాగిపోతుంది. విశ్వనాధమనే మోతుబరీ రైతు చేసిన దుర్మార్గానికి ప్రతీకారంచేసిన ఓపేదరైతు ప్రభువర్గానికి అనుకూలంగావున్న చట్టంలోని ఆంతర్యాన్ని అడుగుతాడు.

"అడిపాపం ఆదీన్నీసంపకుండ ఏమైనట్టు"...అని అడిగాడు. పాత్రోచితమైన సంభాషణలతో పాత్రలకు జీవంపోశాడు శ్రీ అరుణకుమార్. కానీ కథావివరణపద్ధతి ఫ్లాష్‌బ్యాక్ కాబట్టి పాఠకుని ఎఫెక్టివ్‌గా కదిలించలేకపోతోంది. ఉరిశిక్ష పడిన కథానాయకుడు దొంగసాచ్చికాలులేని. దొంగకేసులులేని. నల్లకోటుబాబు ఇసపునవ్వులులేని" మరోవ్యవస్థకోసం పలవరిస్తాడు. రచయిత, కార్మిక శ్రామికవర్గపు కల్పతరువుగా భావించిన కమ్యూనిస్టుపార్టీ రెండుగా చీలిపోయిన విధానాన్ని 'తెలుపు-నలుపు'గా సింబాలయిజ్‌చేశాడు.

వర్గపోరాటాన్ని వెన్నుపోటు పొడిచే మధ్యతరగతిగాళ్ళ ఆలోచనా విధానం అసలుబూర్జువావర్గపు ప్రజలకన్న అపాయకరమైనదని చాలా ఎనలిటికల్‌గా చెబుతుంది వేతనశర్మకథ. మధ్యతరగతి వాళ్లమని భావించే లేబర్ యూనియన్ నాయకులు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితర నాయకులు ఏమంటారు? అచ్చు కుంఖకుల తిలకుడైన వేతనశర్మలా మాట్లాడుతారు. 'రాజుల్నీ రాజ్యాంగాల్నీ మారుస్తామంటే ప్రభువర్గంవప్పుకోదు.... ఈ దోపిడీ అనేది ఉండటంవలన మనకు ఏం నష్టం ఉంది?.. ఈ దోపిడీ నశిస్తే మనకు ఏ లాభం చేకూరుతుంది? ... ప్రజారాజ్యం వచ్చినట్లయితే మాత్రం మనకు వచ్చేదేముంది? .. మనకి వేతనాలు పెరిగితే రాజులుకానీ రాజ్యాంగము కానీ మారనవసరంలేదు' అంటారు. మార్కండేయుడు (మార్క్స్) లేవదీసిన ఈ విప్లవం వేతన శర్మలు పొడిచిన ఈ వెన్ను పోటుకు చాలా మట్టుకుగాయపడి మిగతాది అడవుల్లో (నక్సలైట్ ఉద్యమం) తలదాచుకుందని రా. వి. శాస్త్రిగారు ప్రస్తుతానికి కథ ముగించారు.

'విచ్చైన—దాక్షి' కథలో శ్రీతేజోనిధి అభ్యుదయ రచయితల సంఘం దివాళా కోరుతనాన్ని విప్లవ రచయితల సంఘ ఆవిర్భవ ఆవ ను గూర్చి దాని దశలవారి

పురోగమనాన్నిగూర్చి సింబాలిక్‌గా చెబుతారు. ఇందులో రిఫర్ చేయబడిన సంకేతాలు వ్యక్తులు స్పష్టంగా గోచరిస్తారు. సమతా దాక్షిణ్య పళ్ళను అందుకోడానికి విప్లవ నిచ్చెన వేసికోమని సూచిస్తూన్న ఈ రచనను 'కథ' అని పిలవలేం.

కుక్కతోక— ఇది చక్కని కథ. సూదిముక్కు బూట్లు. గొట్టాం ప్యాంట్లు గళ్ళ చొక్కాలు ధరించిన ఓ గొప్ప ఇంటి బిడ్డడు 'విల్స్' సిగరెట్ల పొగలో కాలాన్ని ఊదు కొంటూ ఇరుకుఇరుకు సందుల్లో ఇంటిపైఇల్లుకట్టినట్లనిపించె తాటాకుగుడిశెలమధ్యనున్న ప్రియురాలిని దర్శించటానికై వెళ్తూ వెళ్తూ సిగరెట్టు పీకను నిర్లక్ష్యంగా విసిరిపారేస్తాడు. తత్ఫలితంగా మంటలు— యాభైఅరవై గుడిశెలు బూడిదయిపొయ్యేవరకూ రాని ఫైర్ ఇంజన్లు. అయితే శ్రీమంతుల పిల్లవానిలో కించిత్తు మానవత్వం వెలుబికి ఒక్కింత సాంగి(ఘి)క సేవ చేశాడు. అయితె ఈ సేవ తనమిత్రుల అవహేళనకి గురియైపో వటం వలన అతను ఏడుపు ముఖం పెట్టుకున్నాడు— 'కుక్కతోక' టైటిల్ పెట్టటంలో కానీ కథా సంవిధానంలోగానీ రాజేశ్వరరావుగారి ప్రతిభ కనిపిస్తుంది.

సమాజంలోని ఆర్థిక అసమానత్వం వలన, కష్టజీవుల బ్రతుకులు ఎలా చితికి పోతాయో నీతిశాస్త్రం అవినీతిగా పరిగణించే అవినీతి చర్యలకు ఒక్కొక్క ఆడదికానీ మగవాడుకానీ ఎందుకు దిగజారతాడో 'నిటలాగ్ని రగిలింది' కథలో బి. టి. రామానుజం గారు వివరిస్తారు.

అమెరికా అంటే 'పేపర్‌టైగర్' అన్న సూక్తి అందరికీ తెలిసిందే క్యాపిట లిస్టు సిద్ధాంత పునాదులపై నిర్మింపబడిన బూటకపుప్రజాస్వామ్యానికి అమెరికా పెద్దపీట వేసింది. మనలాటి క్యాపిటలిస్టు దేశాలలోని శ్రీమంతులకు వారిపిల్లలకు ఈ అమెరికా అంటే మోజు ఎక్కువ. అవే పోజులు ఇక్కడ వేస్తూంటారు. అందువలన తల్లిదండ్రులు పిల్లలను ఫారిన్ పంపాలని తహతహ లాడుతుంటారు. ఇందులోని నరసింహంగారు ఆ బాపతు జనాంగానికి ప్రతినిధి. రికమండేషన్ కోసమైవచ్చిన వరప్రసాదుడ్ని అసిస్టెంటు ప్రొఫెసరయిన తన పెద్దకొడుకుని గూర్చి ఫారిన్‌లోఉన్న 'థర్డ్‌సన్'ను గూర్చి భగవంతునికి ప్రతిసంవత్సరమూ తమ బొచ్చు సమర్పించుకొనేవారి దైవభక్తిని గూర్చి 'బోర్'చేసి విడిచిపెడ్తాడు నరసింహం. వర్షంలోతడిసి ఆశ్రియంకోసంవచ్చిన ఓపేదపిల్లచేతిలో భంగపడి'పేపర్‌టైగర్'లాగర్జించి ఏమీ చేయలేకపోతాడు. 'టైటిల్' కుతగ్గట్టు తీర్చిదిద్దబడింది ఈకథ.

శ్రీహరిగారి "అనుభవంతీర్చిన మనిషి"లో కార్మికఉద్యమంలో చీలికలుతీసికొని రావటానికి వర్గశత్రువు ఎలా ఎత్తుగడలువేస్తాడో, నక్కల్లాంటి పోలీసుబలగం యెలా ప్రవర్తిస్తుందో వివరించబడినది. తిమ్మిరెడ్డిగారి "మహానగరంలో ఇద్దరు మనుషులు"

గొప్పవాళ్ళు, తమకు అడ్డుగానిలిచిన సామాన్యులను ఎన్నిచిత్రహింసలపాలుచేస్తారో, పోలీసులూ పత్రికలూ కుమ్మక్కై వాటిని యెలా ప్రచారంచేస్తాయో విశదపరుస్తుంది— కానీ కథలోని సంఘటనలు అసహజంగా కనిపిస్తాయి

మహాకవి శ్రీశ్రీగారు తమ "కరక్కాయముక్క-అరక్కాయతొక్క"లో ఇద్దరు దొంగలు. ఒకజేబు దోచుకోబడిన పెద్దమనిషినిగూర్చిచెబుతారు. ఇది కల్పనతో వ్యభిచరించకుండ వాస్తవానికి సన్నిహితంగాఉన్న ఇతివృత్తం. ఇదికథగామారిన కవిత్వం.

"వేదుమాత్రలు"— కన్సల్టింగ్‌ఫీజు. 'కన్సల్టింగ్‌ఫైము-ర్లబ్బు' అని తన చుట్టూ ఒక విషవలయాన్ని సృష్టించుకొని అవలయంకారణంగా భార్యాపిల్లలను కోల్పోయి హృదయపరివర్తనచెందిన డాక్టర్ జగన్నాధంకథఇది.

బి. పాండురంగారెడ్డిగారి 'చీకటిలో చిక్కిన బతుకులు' కథలో చక్కని కథా సంవిధానముంది: ఓట్లకోసం, సీట్లకోసం, ఉద్యోగాలకోసం, మంచాలువేసే బతుకు విధానం అమలులోవున్న ఈ సమాజంలో భార్యను ఆఫీసర్‌గాడిపక్కలోపడుకోబెట్టలేక సతమతమైపోయిన నిరుద్యోగికథఇది,

ఈసంకలనంలోని చాలా కథలు కథాపద్ధతినిఆవలంబించిన రాజకీయఉపన్యాసాలు రచయితకువున్న పొలిటికల్ కమిట్‌మెంటువైపు పాఠకుడ్ని ఉదాత్తమైన పద్ధతితో తీసికెళ్లటానికి కళాకారుడు ప్రయత్నించాలి. ఎక్కువభాగం కథలు విరసం కళాతీవ్రతకు ప్రతిబింబాలుగాలేవు శ్రీశ్రీగారు తమ 'కరక్కాయముక్క— అరక్కాయతొక్క'లో తెలిపినట్లు ఊహాగానాలు పనికిరావు.

'అన్నా! ఇందా తీసుకో నీ యాభైరూపాయలు ఈ దోపిడీవ్యవస్థలో మనం చేసిన కష్టాన్ని చెరిసగం పంచుకుంటున్నవాళ్లం మనం యిద్దరిమే'అంటూ అయిదు పది రూపాయలనోట్లిచ్చాడు అన్నగారికి తమ్ముడు. ఈరకమైన ఊహాజనితమైన ప్రమాద పూరితమైన ముగింపులకు ఊహాగానాలకు విరసం రచయితలు చోటుపెట్టకూడదు.

— తాడిగిరి పోతరాజు

అనివార్య కారణాలవల్ల యీ సంచికలో
అధునిక సాహిత్య చరిత్ర ఐదవ వ్యాసం
ప్రకటించలేక పోతున్నాం. —సంపాదకుడు

నేటి చిత్రకళ - కళారంగం

చలసాని ప్రసాదరావు విమర్శకు సమాధానం

1. 'మన సమీక్షకులు వ్రాసిన పద్ధతినిబట్టి వారికి నేటి చిత్రకళనుగురించిగానీ కళా పరిణామాన్నిగురించి, విలువలను గురించిగాని సరయిన స్పష్టమయిన అవగాహన లేదని తేలుతున్నది 'అని విమర్శించటానికి ఉద్యమించిన శ్రీ చలసాని ప్రసాదరావు గారు 'ఇందులో మన సమీక్షకుడివి అనాల్సిందేమీలేదు. సదరు అకాడెమీ వారికే తాము ప్రైజులిస్తున్న ఆయాచిత్రాలగురించి సరిగా తెలీదు.'అని తన అభిప్రాయాన్ని తనే ఖండించుకున్నారు. అకాడెమీలకు, బహుమతులను నిర్ణయించే న్యాయమూర్తులకే 'సరీగా తెలీదు' అన్నారు కాబట్టి నన్ను క్షమించినట్టే.

అయితే ఈ సరిగాతెలీని తనానికి శ్రీ ప్రసాదరావుగారు చూపిన ఆధారాలు పరిశీలిస్తే- ఆతెలీనిది ఎవరికో స్పష్టమవుతుంది.

ఆ మధ్య అవార్డు ఇచ్చిన ఓ చిత్రం శాబూకు ఫోటోను (చాలా పెద్దసైజులోనే) అందమైన ఆర్టుపేపర్ కాట్లాగులో తలకిందులుగా అచ్చుగుద్ది- ఆ చిత్రకారిణివచ్చి ఇదేమిటని ఏడుపుమొహం పెడితేనేగాని తప్పు తెలుసుకోలేకపోయారు, ఇది పొరపాటే తప్పించి దీన్ని ఆధారంచేసుకుని అకాడెమీని తిట్టాల్సినపనిలేదు. అకాడెమీని విమర్శించటానికి, న్యాయమూర్తుల తప్పులను ఎత్తిచూపటానికి బలమైన కారణాలు అవసరం. తెలుగులో కళాసంబంధంగా కృషిచేస్తున్న ఒకేఒక పత్రిక 'కళ.' ఆ పత్రిక సంపాదకులు, భారత కళా పరిషత్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, దశాబ్దంపైచిలుకు కళారంగంతో పరిచయంఉన్న శ్రీ చలసాని ప్రసాదరావుగారు ప్రచురించిన 'కళ' 1968 సంచికలో 72 పేజీ ఒకసారిచూస్తే కరీం 'లేండ్‌స్కేప్' తలకిందులా అచ్చయిన పొరపాటు కన్పిస్తుంది. దీన్ని ఆధారంచేసుకుని శ్రీ ప్రసాదరావు గారికి కళగురించి 'సరిగా తెలీదు'అని ఎవరన్నా వాదిస్తే అది నాకు తెలివితక్కువగా. ఉన్మాదంగా కనిపిస్తుంది.

2. 'ఈనాటి చిత్రకళలో సాంఘిక దృక్పథం. సామాజిక ప్రయోజనం గురించి చర్చించుకునే మన బోంట్లం ఆదరించదగిన ఆలోచించదగిన <u>విలువలేవీ లేవు.</u>' అని స్పష్టంగా మొదటివాక్యంలోరాసి ఆ తర్వాత వాక్యంలోనే 'నూటికి ఏ ఒకరో ఇద్దరో తప్ప' అన్న అంశాన్ని జోడించారు.

ఈ క్రమంలోనే 'కమకనే గత ఫిబ్రవరిలో న్యూఢిల్లీలో జరిగినమన అకాడెమీవారేర్పాటుచేసిన, అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శనను దర్శించినప్పుడు దానిని గురించి వ్యాసం వ్రాయమని ఓ వారపత్రికవారు అడిగినా, ఆ నాన్‌సెన్స్‌ను గురించి మరికొంత నాన్‌సెన్స్ సృష్టించటం ఇష్టం లేక. పత్రికలవారికి కావలసినవిధంగా భజనచేయటం చేతగాక అందుకు నిరాకరించాను' అని ఒక గాడిదగుడ్డు ఇజాన్ని ప్రవేశపెట్టారు.

రోగముందని తెలిస్తే నివారించటానికి ప్రయత్నిస్తాం. నివారించటం చేతకాకపోతే రోగముందని తెలియజెప్తాం. మరి శ్రీ ప్రసాదరావుగారు ఆ నాన్సెన్స్‌గురించి మరికొంత నాన్సెన్స్ ధోరణిలో పోతున్నారు. ఇక వారికి ఆలోచించదగిన విలువలెలాకన్పిస్తాయి! నూటికి ఏ ఒకరో ఇద్దరో ఉన్న ప్రతిభావంతుల కళను ఆదరించగల అవసరం ఎట్లాతెలుస్తుంది! వారన్న నూటికి ఒకరో ఇద్దరో ప్రతిభావంతులుగానే దొరైస్వామి, లక్ష్మగౌడ్, సూర్యప్రకాష్‌లను నేను పేర్కొన్నాను.

ఇక గాడిదగుడ్డు ఇజంసంగతి. దీని నిర్వచనం శ్రీ ప్రసాదరావుగారి భావనలో అసలు మన కళాకారుల చిత్రాల్లో ఏమీలేదని అంతాశూన్యం అని. దీనికి విరుద్ధంగా వారేచెప్పిన కొన్నివాక్యాలు చూడండి. '—తమతమ మానసిక చీకటిగుహల్లో విహరిస్తూ, యూరోపియన్ కళా విలువలనూ, భావజాలాన్నీకూడా అనుసరిస్తూ' ఈ పదాలతో శ్రీ ప్రసాదరావుగారు మన కళాకారుల్లో యూరోపియన్ భావజాలంఅన్నది ఉందని చెప్తున్నారు. ఆ యూరోపియన్ భావజాలం ప్రగతిదాయకమైందా! (రష్యా, తూర్పు యూరోప్‌దేశాలు సామ్యవాదదేశాలు) లేక ప్రగతి నిరోధకమైందా? కళలకీ, సాహిత్యానికీ, చారిత్రిక ఘటనలకీ ప్రగతిదాయకమైన లేక ప్రగతి నిరోధకమైన ఏదో ఒక గుణం ఉంటుంది. 'ఆ నాన్సెన్స్‌గురించి మరికొంత నాన్సెన్స్' ధోరణికీ, గాడిద గుడ్డు ఫిలాసఫీకీ ఇవి పట్టకపోవచ్చు. పాశ్చాత్య సాంస్కృతిక సంస్థలు (ముఖ్యంగా పశ్చిమ జర్మనీ, అమెరికన్‌లు) ఏ ప్రయోజనమూ లేకుండానే కళాకారులని చేరదీస్తున్నాయని, ప్రదర్శనలు ఏర్పాటుచేస్తున్నాయని అనుకోలేము. వారి అనుకూల భావజాలాన్ని ప్రచారం చేయటానికే ఈ కార్యకలాపాలు చేపట్టుతున్నాయన్న అవగాహన తప్పుకాదు

కాని మొదటే శ్రీ ప్రసాదరావుగారు చెప్పారు. 'మనటోంట్లం ఆదరించదగిన ఆలోచించదగిన విలువలేవీలేవు' అని.

3. 'మనం ఎంత అమాయికంగా బంగ్లాదేశ్ గురించి శోకిస్తున్నామో అర్థమవుతుంది' అన్నారు శ్రీ చలసాని ప్రసాదరావుగారు. యాహ్యాఖాన్‌కి వచ్చిన వివేక

మొచ్చింది వారికి ఇక్కడ 'రేప్ఆఫ్ బంగ్లాదేశ్' చిత్రంలో దొరైస్వామి చిత్రించింది, బంగ్లాప్రజల దృష్టితో. మతం పేరుతో సాగిన దోపిడీని ఎదిరించినప్పుడు జనం గురయి. హింసవిన కళాకారుని సామాజిక చైతన్యమేకాదు మానవతా అనుకంపన కూడా ప్రేక్షకులని తట్టింది. బంగ్లాదేశ్ అవతరించిన ఈ సమయంలోనన్నా, పక్షం దినాల యుద్ధానికి మూల కారణాన్ని శ్రీ ప్రసాదరావుగారు అర్థం చేసుకోగలరు.

4. మళ్ళీ ముందుకొస్తున్నాం.

అకాడెమీ న్యాయమూర్తులకు సరిగా తెలీదు. ఇక ఢిల్లీ పత్రికలకూ ఏడవ ట్రియానియల్ పారిస్‌కి తెలుగువాడి పెయింటింగ్ సెలెక్టుచేసిన న్యాయమూర్తులకు మాత్రం ఈ నాటి చిత్రకళా వికాసలేం తెలుస్తాయి. వారంతా చాలా అయోమయంలో ఉన్నారు.

5. ఏడాదికోసారి తద్దినాల్లా జరిగే అకాడెమీల వార్షిక చిత్రకళా ప్రదర్శనల్లో స్థానం కోసం. ప్రైజులకోసం (ఇక్కడ అకాడెమీ ఆర్థిక సహాయం కోసం అనికూడా చేర్చితే అది ప్రసాదరావుగారి వరకూ రాదనుకుంటాను) తినాల్సినగడ్డి ఏదో తింటూ, ప్రైజువస్తే కాలర్ ఎగరేసుకుంటూ. రాకుంటే 'ఈ దగుల్బాజీ అకాడెమీల పక్షపాత ధోరణ'లను గురించి ప్రైవేటుగా తిట్టుకుంటూ. కొనేవాడులేక తమ పెయింటింగ్‌ల్ని అటకలమీద భద్రపరచుకుని, తమ కళను కొని ఆదరించని 'దిస్ అన్‌కల్చర్డ్ ఇండియన్ పీపుల్'ను తిట్టుకుంటూ కాలక్షేపం చేస్తున్నవారే.' ఇది మన సమాజంలో కళాకారులు ఎదుర్కొంటున్న వికృష్టమైన పరిస్థితుల్ని చెపుతుందేగాని కళాకారుల అసభ్యతని తెలియజేయదు. ఇలాంటి పరిస్థితులను తొలగించటానికి భారత కళా పరిషత్‌లాంటి సంస్థను శ్రీ ప్రసాదరావుగారు ఉపయోగించడమేకాదు. సామాజిక చైతన్యం ప్రయోజనం వేపు కృషిచేసే మనవోంట్లం ఆదరించ దగిన కళాకారులను గుర్తించవచ్చు.

ఇలా ముగించారు శ్రీ చలసాని ప్రసాదరావుగారు:

'మనం ఏదన్నా రాసేటప్పుడూ, దేనిని గురించయినా అంచనాలు వేసేటప్పుడూ కాస్త జాగ్రత్తగా ఉండటం— ముఖ్యంగా మనల్నింకా అంటిపెట్టుకునే ఉన్న మధ్యతరగతి మేధావి మనస్తత్వాన్ని ముందుగా వదిలించుకోవటం చాలా అవసరమూ, తక్షణ కర్తవ్యమూనూ.'

—శ్రీపతి

సినిమాల్లో అవినీతి

శ్రీ శ్రీ

సినిమాల్లో మాత్రమే అవినీతి ఉందని నేను చెప్పడంలేదు. ఏనాడు కాంగ్రెసు వాళ్లు స్వరాజ్యాన్ని హక్కు భుక్తం చేసుకుని ఏకచ్ఛత్రాధిపత్యం చలాయించడం మొదలుపెట్టారో అప్పుడే మన పతనం ఆరంభమయింది. (అంతకు ముందులేదని కాదు. కురుపుగా ఉండేదే నేటికి కుష్ఠుగా తయారయింది) ఏ ఆఫీసుకి వెళ్ళినా చాలు— అవినీతి, లంచగొండితనం, ఆశ్రిత పక్షపాతం, కులాభినివేశం వేయి పడగలు విప్పి వికటనాట్యం చెయ్యడం మనకి రోజూ అనుభవమే। మద్యనిషేధం చాటున ఎందరెందరు ఎన్నెన్ని విధాలుగా మోసపోయారో, మోసపోతున్నారో రాయాలంటే ఒక చేట భారతమే అవుతుంది. సరే, ఇక వ్యభిచారం సంగతి చెప్పనక్కరలేదు. ఇందులో స్త్రీ-పురుషు లిద్దరిదీ తప్పే అయినా మన సమాజం ఆడదాన్నే శిక్షిస్తుంది.

నేటి ధనస్వామ్య వ్యవస్థలో నీతిగా బతుకుదామనుకున్నా వీల్లేని పరిస్థితులు అనుక్షణం, అడుగున పడిపోయినవాళ్ళనే కాదు పైతరగతుల వాళ్లని కూడా పీడిస్తున్నాయి. సినిమా ఒక వ్యాపారం అని తెగేసి చెబుతున్న వాళ్లున్నారు. ఇక వ్యాపారం అన్న తర్వాత ముక్కుకు సూటిగా వెళ్ళడానికి వీల్లేదు. గదిలో ఉన్నవాడు అలా వెళ్ళితే, ఎదుటనున్న గోడను ఢీకొని ముక్కంట రక్తం కార్చుకోక తప్పదు. కాబట్టి, ఆదును బట్టి అప్పుడప్పుడు వంకర టింకర మార్గాలను అవలంబించవలసిందే! తప్పే కావచ్చు.... పాపమే కావచ్చు దేవుడికి నాలుగు కొబ్బరికాయలు కొట్టేస్తేచాలు, వాడే చూసుకుంటాడు. అంతా వాడిలీల!.... మనలో ఏముంది కనక! (ఇలా దేవుని మహిమలని సినిమా ట్రిక్కులతో పావలా ప్రేక్షకులకు చూపించి లక్షలు పోగుచేసుకున్న ఒక ప్రొడ్యూసరు రచయితగారిని ఇన్‌కమ్‌టాక్స్ నక్సలైట్లు నిలువుదోపిడీ చేసినట్లు యిటీవలనే మనం పత్రికల్లో చదివేం!)

ఒక పెద్ద డాక్టరు గవర్నమెంటు ఉద్యోగం చేస్తూ, వేలలెక్కని జీతం తీసుకుంటూ చాటుమాటుగా ప్రైవేటు ప్రాక్టీసు సాగిస్తాడు. ఒక చిన్న టీచరు, చిన్నజీతం తెచ్చుకుంటూ తీరిక వేళల్లో ట్యూషన్లు చెప్పుకుంటాడు. ఎలా చావడం? ఇద్దరి వేన్నీళ్ళకీ చన్నీళ్లు అవసరమే।

ఔను, ఒక్క సినిమాల్లోనేకాదు. అంతటా అవినీతి అంతరించాలంటే సామ్యవాదం ఒక్కటే శరణ్యం। కాని ఈ ధనస్వామ్య వ్యవస్థ ఎలా పోతుంది? దాని స్థానే సామ్యవాద సమాజం ఎలా ఏర్పడుతుంది? తరతరాలుగా గడ్డకట్టిన పెట్టుబడిదారీ

విధానం ఎలా బద్దలవుతుంది? దానికి కార్ల్‌మార్క్స్ ఒకే ఒక్క పరిష్కార మార్గం చూపించాడు. పీడకులకు వ్యతిరేకంగా పీడితులు సంఘటితం కావడమే! పైకి ఎంత దృఢంగా కనబడుతున్నా ధనస్వామ్య వ్యవస్థను నాశనంచేసే బీటలు దానిలోంచే బయలు దేరుతాయన్నాడు మార్క్స్. బ్రిటిష్ సామ్రాజ్యం నామరూపాలు లేకుండా నాశనమవు తుందని యాభై ఏళ్ళకింద ఎవరైనా అని వుంటే వాళ్లని పిచ్చివాళ్లకింద జమకట్టేవారు! మరినేడు....?

ఇక్కడ మద్రాసులో మనదంత ప్రాకారాల్లో ముసుగు తన్నుకుని నిద్రపోతున్న మనకి దేశంలో, యువకుల తరంలో ఎంత అశాంతి ఝంఝూ ప్రభంజనంలాగ విజృంభిస్తోందో ఏం తెలుసు? దాన్ని ఎదుర్కొడానికి ఎన్నెన్ని రకాల నీచాతి నీచమైన కుట్రలు సాగుతున్నాయో మనకేం తెలుసు? కాని, మేలుకున్న యువశక్తిని ఏ ముసలి పీనుగులూ ఎదుర్కోలేవు. ఇంకా ఏ కాస్తయినా నీతి నిజాయితీ మిగిలివుంటే అవి యువతీ యువకుల్లోనే ఉన్నాయి. వాటిని పెంపొందించేలాగ తన కలాన్ని పదును పెట్టడంకన్నా ఈ నాటి రచయితకు యింకో మహత్తర కర్తవ్యం ఏముంటుంది?

కాబట్టి ఈ వ్యాసాన్ని ముగిస్తూ సాటి రచయితలకు (కనీసం సినీ రచయితలకు) నేనొక విజ్ఞప్తి చేస్తున్నాను. ఇంకా ఎందుకు వెంకటేశ్వరునిమీనా, తులసమ్మమీనా భజన పాటలు? ఇంకా ఎంత కాలం అమాయక ప్రజల్లోని అజ్ఞానాన్నీ, మూఢభక్తినీ మీ రచనలతో రెచ్చగొడతారు? పొట్టకూటికోసం అంటారా? ప్రజలకి హానిచేసి మీ పొట్టలు నింపుకోవడం ఏం న్యాయం? ప్రజలకి మేలుచేసే రచనలుచేసి కడుపు నిండా కావలసినంత తినండి. సామాజికవాస్తవికతను శాస్త్రీకదృష్టితో చూడగలిగిన శక్తి వంతులు మీరు!....

('కొరడా' సౌజన్యంతో)

సాహిత్య లేఖలు:

ప్రత్యేక తెలంగాణ—స్వాధీన్ బంగ్లా—మార్క్సిస్ట్ దృక్పథం

సృజన డిసెంబరు 71 సంచికలో విశాఖపట్నం నుండి ఒక పాఠకుడు రాసిన లేఖ 'ప్రత్యేక తెలంగాణ' చూసాక ఇది రాస్తున్నాను.

దోపిడీ, వర్గాలమధ్యనేకాదు, ప్రాంతాలమధ్య కూడా జరుగుతుందనే విషయం మనం చూస్తూనేఉన్నాం. ఐతే వర్గదోపిడీ నిర్మూలనవల్ల కలిగే సత్ఫలితాలు ప్రాంతీయ దోపిడీ నిర్మూలనవల్ల కలగవు. ప్రాంతీయ దోపిడీలో ఎక్కువగా నష్ట పడేది మధ్యతరగతి వాళ్ళూ ఆపైవాళ్లే. ఒక ప్రాంతపు సంపదల్ని కొల్లగొట్టడానికి గోరీలు, గజ్నీలు దండెత్తి రావలసిన పనిలేదు. భాషపేర, మతంపేర, ఐకమత్యంపేర

ఇటు తెలంగాణ అటు తూర్పుబెంగాల్ ఎలా దోపిడీకి గురయినాయో చూస్తూనేఉన్నాం. 1969లో తెలంగాణాలో, 1971 లో తూర్పు బెంగాల్‌లో ప్రాంతీయ దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో అట్టడుగున ఉన్న వాళ్లు సైతం పాల్గొన్నారు/పాల్గొంటున్నారంటే భాషపేరిట, మతంపేరిట జరిగిన దోపిడీ అసత్యంకాదు. వాటికి వ్యతిరేకంగా జరిగిన ప్రజాపోరాటాలు అసత్యం కానటువంటి వాస్తవ సంఘటనలు. పోరాట నాయకత్వం వర్గదోపిడీదార్ల చేతుల్లోఉండటం, పోరాటానికి ప్రజలు క్రమంగా దూరం చేయబడటంతో పోరాటం పూర్తిగా దెబ్బతిన్నది. సరయిన నాయకత్వం లోపించినప్పుడు పోరాట ప్రయోజనం సిద్ధించకపోవచ్చు, కాని ఆ ప్రయోజనానికి చిన్నతనం కాదు, విలువతగ్గదు. అందుచేత ఏ రకమైన దోపిడీకైనా ప్రజలు వ్యతిరేకంగా నిలిచి పోరాడినందుకు అభినందించాల్సిందే కాని వాళ్ళను తప్పు పట్టాల్సిందికాదు వాళ్ళ పోరాటాన్ని ప్రాంతీయ దురభిమానంగా చిన్నచూపు చూడటం కూడదు

తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ప్రాంతీయ దోపిడీ అంతం కావచ్చు. కాని వర్గదోపిడీ మిగిలే ఉంటుంది. (ముల్కీ నిబంధనలతో నిరుద్యోగం రూపు మాసిపోతుందని తెలంగాణా ఉద్యమంలో చెప్పలేదు.) వర్గదోపిడీకి ఇంకా కళ్ళు విప్పని ప్రజలు కనీసం ప్రాంతీయ దోపిడీకైనా కళ్లువిప్పటం శుభ సూచకం. రాజకీయ అనుభవంలో అవగాహనలో ఇది ఒక మెట్టు కాగలదని ఆశించవచ్చు. రా. వి. శాస్త్రి గారన్నట్టు 'పల్లకిలో వర్మగారున్నా శర్మగారున్నా ఒకరకంగానే బరువు మోయవలసి ఉంటుందని' ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే మోసే బోయీలకు తప్పకుండా కనువిప్పవుతుంది. ఈ ఉద్దేశంతోనే తెలంగాణా మేధావివర్గాలు 1969 పోరాటం యెడల సానుభూతి చూపారని భావిస్తున్నాను.

కలం వీరయ్య 'స్వాధీన్ బంగ్లాదేశ్'లో బ్రిటిష్ కుతంత్రం చీల్చిన పదికోట్ల వీరబెంగాల్ ఒకటికాదని ఎవడు జోస్యం చెప్పగలడు అని ప్రశ్నించినప్పుడు, భాషపేరిట బెంగాల్‌లు ఒకటికావాలనికాదు కోరింది. పడమటి బెంగాల్‌లో విప్లవ జ్వాలలు రగుల్కొంటున్నట్టే తూర్పుబెంగాల్‌లోనూ రగుల్కొనేకాలం ఏమంతదూరం ఉండదనే ఆకాంక్ష, అలా రగుల్కొన్న రూపంలో రెండూ ఏకంకాగల అవకాశాన్ని దర్శించిన విజన్ ఆ పంక్తుల్లోఉంది.

అందుకని రెండు తెలుగుప్రాంతాలు విడిపోవాలని కోరినా, రెండు బెంగాల్‌లు ఏకం కావాలని కోరినా అది మార్క్సిస్టుల దృక్పథంలో భేదాభిప్రాయంగా పరిగణించకూడదు. అంతిమ వర్గపోరాటమైన విప్లవానికి దోహదంచేసే రకరకాల ఉద్యమాలవిషయంలో దేశకాల పరిస్థితులబట్టి నిర్ణయించుకోవాలి. ప్రాంత, మత, భాషా మనస్తత్వాలలో దేనికి గురికాకూడదు. ప్రాంతం, మతం అనేవాటికంటే భాషాప్రాతిపదిక ఐక్యతకు విలువ నెక్కువనివ్వటం అనే అన్‌మార్క్సియన్ ఆ పాఠకునిలేఖకు కారణం.

— ఆర్. జి. ఆర్. వరంగల్.

బంగ్లాదేశ్ – ఇండియా – చైనా.

వియత్నాంలో అమెరికా చర్యలను ఖండిస్తూ ఐక్యరాజ్య సమితిలో ఏ తీర్మానమూ ప్రతిపాదించని చైనా, బంగ్లాదేశ్‌కు ఇండియా మద్దతు గురించి గొంతు చించుకోవడం ఆశ్చర్యంగావున్నది. ఇండియాలోని నాగాలకు, మిజోలకు చైనా సహకారాన్ని ప్రకటించినపుడు బంగ్లాదేశ్‌లోని బెంగాలీలకు ఇండియా ఎందుకు మద్దతు ఇవ్వకూడదు?

—రాచకొండ విశ్వనాథశాస్త్రి

విశాఖపట్నం.

సాహిత్యనీరో

రోమ్‌నగరం తగలడతూంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించేడు;
భారతంలో, బంగ్లాలో, అగ్గివాన కురుస్తూంటే అనకాపల్లిలో
'బ్రాహ్మీమయ' మూర్తికి ఘన సన్మానం!!

కవికి సమాజమే ఊపిరి ప్రజలే ప్రాణం. సమాజాన్ని, దేశాన్ని, ప్రజల్ని, కాదని కవిత్వం మనలేదు. ప్రజాజీవితపు దారుల పయనించేదే, నిజమైన కవిత. ప్రజల బాధలు, గాధలు, కథల్లో, కవితల్లో, చిత్రించేవాడే నిజమైన కవి. సాహిత్యపు విలువలు నిర్ణయించేది 'పీఠాలు' కాదు, ప్రజలే ఉత్తమ. కవిత్వం కాలానికి కనీసం ఒక గంటయినా ముందుండాల, బస్తాలకు బళ్ళకెత్తు పద్యాలు రాసి, పాతది పవిత్రమనీ, కొత్తది పనికిరాదనీ, ఆటవిక యుగాలవైపు అందర్నీ నెట్టి, వర్ణాశ్రమధర్మాలకు హారతిపట్టే, పాశవిక ప్రవృత్తికి జేజేలుకొట్టే కవిసామ్రాట్టులు ఆత్మపరిశోధన చేసికోవలసిన సమయం ఇది.

'అదృష్టవశాత్తూ, జాతక చక్రప్రభావం' వల్లా కొందరి అనురూప సహకారం వల్లా, తనకు 'దొరికిన' లక్ష రూపాయిల్లో కనీసం సంగోరయినా' దేశ రక్షణనిధికి సమర్పించి తమ 'దేశభక్తి'ని నిరూపించు కొంటారని ఆశిస్తున్నాం.

ఇవాళ కావలసింది తాత తండ్రులనాటి శివాలయంకాదు. దేశంలో, బంగ్లాదేశంలో 'శిధిలాలయాలను' నవనవోన్మేషంగా పునర్నిర్మాణం చెయ్యాలి.

ఇట్లు,

12-12-71

విశాఖ జిల్లా విద్యార్థులు.

SRJANA Telugu Monthly January '72 Regd. No. H-1088

సాహిత్యంలో విప్లవోద్యమం

కొడవటిగంటి కుటుంబరావు

జీవితము, సాహిత్యము, ఫిలాసఫీ- వాని పరస్పర అనుబంధాలు యీపుస్తకంలోని పదిహేను అధ్యాయాల్లోనూ చాల సమర్థవంతంగా చర్చించబడ్డాయి. ఆర్థికమూ, రాజకీయాలు కూడ చర్చించబడ్డాయి. రచయితకు స్పష్టమైన దృక్పథమూ, స్పష్టమైన ప్రయోజనమూ ఉన్నయి. విప్లవ రచయితలకొరకు(రచయిత)ఒక మానిఫెస్టో తయారుచేసారు... ఇందులోని ప్రతిపేజీ ఎంతో వైవిధ్యంతోకూడుకొని పాఠకునిలో అభిరుచిని ఉరకలెత్తిస్తుంది.

— సంచారి

ఇండియన్ ఎక్స్‌ప్రెస్

ప్రతులకు: సృజన, వరంగల్-1 వెల: 2 రు.

Edited and Published by Varavararao for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayamu,
J. P. N. Road, Warangal-2 (A.P.)